
బుధవారం 3 జూన్ 2026

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## విశాఖలో భారీ గ్లోబల్ డేటా సెంటర్

'ఎయిర్ ట్రంక్' సీఈవో రాబిన్ ఖుదాతో సీఎం భేటీ

- వివరాలు 4 లో..



## ప్రజల్లోనే ఉండాలి...

# మళ్లీ మళ్లీ గెలవాలి

- వన్‌టైమ్ ఎమ్మెల్యేలుగా మిగలొద్దు
- 'సర్'పై అవగాహన పెంచుకోండి... అప్రమత్తంగా ఉండండి
- ప్రతి ఓటునూ మ్యాపింగ్ చేయాలి... అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో ఉండాలి
- కూటమి పార్టీలను సమన్వయం చేసుకోవాలి
- టీడీపీ ప్రజా ప్రతినిధులు, పరిశీలకులు, బీఎల్‌ఏలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం
- రెండేళ్ల పాలనపై ఈ నెల 25 నుంచి 45 రోజుల పాటు సైకిళ్లపై ఇంటింటి ప్రచారం
- చిన్న పామైనా విషం కక్కుతోంది... గొడ్డలి పార్టీని పెద్ద కర్రతో కొట్టాలి
- డీఎస్సీ, నంద్యాల ఘటనల్లో అలెర్టుగా ఉండడంతో తోకముడిచారు

2

రాష్ట్రంలో సుపరిపాలన, పారదర్శకత, అభివృద్ధి ద్వారానే మళ్లీ ప్రజాదరణ పొంది అధికారంలోకి రావాలని, ప్రజాప్రతినిధులెవరూ వన్‌టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) వర్క్‌షాప్‌లో ఆయన కూటమి నాయకులకు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. "చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలని, గొడ్డలి పార్టీ విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నాయకులకు క్యారెక్టర్, నమ్మకం అత్యంత ముఖ్యమని... మన ప్రవర్తన బాగుంటేనే ఓట్లు పెరుగుతాయని, లేదంటే నష్టపోతామన్నారు. కూటమిలోని మూడు పార్టీల (టీడీపీ, జనసేన, బీజేపీ) మధ్య క్షేత్రస్థాయి సమన్వయానికి 'సర్' మొదటి పరీక్ష అని, దీని కోసం త్వరలోనే ప్రత్యేక కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. కేవలం ఎన్నికలప్పుడే కాకుండా మిత్రపక్షాలతో నిరంతరం కలిసి పనిచేయాలని, ఓటర్ల జాబితాను నిత్యం పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని కూటమి శ్రేణులను ఆదేశించారు. జులై 15 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు 45 రోజుల పాటు భారీ ఎత్తున ఇంటింటి ప్రచారం చేపట్టాలని, వీలైతే ఈ-సైకిళ్లపై ప్రజా బాహుళ్యంలోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో తాను కూడా స్వయంగా పాల్గొంటానని వెల్లడించారు.





సాంస్కృతిక వైభవం ఉట్టిపడేలా

# గోదావరి పుష్కరాలు

### ఆధ్యాత్మిక పర్యాటకానికి అత్యధిక ప్రాధాన్యం

### సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష

వచ్చే ఏడాది జరగబోయే 'గోదావరి పుష్కరాలను' కుంభమేళా తరహాలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం ఉట్టిపడేలా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం శంఖారావం పూరించింది. గోదావరి పుష్కరాలు-2027 నిర్వహణపై మంగళవారం సచివాలయంలో మంత్రుల కమిటీ, ఉన్నత స్థాయి అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమీక్షించారు.



పోలవరం ప్రాజెక్టును పుష్కరాల కంటే ముందే పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. ధవళేశ్వరం నుంచి పోలవరం వరకు 'అఖండ గోదావరి' రోడ్డును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది శాశ్వత ఆస్తిగా మార్చాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇచ్చిన సూచనలను ఈ పనుల్లో కచ్చితంగా పరిగణలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు.

- వివరాలు 3 లో..

వెలిగొండ సొరంగం నుంచి

## టీబీఎం తొలగింపు ప్రారంభం

6

పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో రెండో సొరంగంలో చిక్కుకుపోయిన టీబీఎం (టన్నెల్ బోరింగ్ యంత్రం) తొలగింపు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. దానిని లోపలే ధ్వంసం చేసి విడిభాగాలను బయటకు తెచ్చే పనిని ప్రత్యేక నిపుణులకు అప్పగించారు. ఈ పని పూర్తయితేనే రెండో సొరంగంలో కృష్ణా జలాలు ప్రవహించే అవకాశం ఉంటుంది.





ఆరు నెలల్లోనే తుంగభద్రకు

# 33 కొత్త గేట్లు

- సీఎం చంద్రబాబు చొరవతో రికార్డు
- నెలాఖరున రెండు రాష్ట్రాల సీఎంలతో ప్రారంభం
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి



6

రాయలసీమ కరువు ప్రాంతానికి జీవనాధారమైన తుంగభద్ర అవసరాన్ని గుర్తించి చంద్రబాబు ఆరు నెలల్లోనే 33 కొత్త గేట్లు పూర్తి చేయించారని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 19వ గేటు స్థానంలో భారీ వరదలో సైతం స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు చేసి 80 టీఎంసీలను వృథా కాకుండా కాపాడి రాయలసీమకు సాగు, తాగు నీరందించామని చెప్పారు. ఈ నెలాఖరున ఏపీ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు తుంగభద్ర డ్యామ్ గేట్లను ప్రారంభించ బోతున్నారని తెలిపారు.



రష్యాలో మంత్రి లోకేష్‌కు

# ఘన స్వాగతం

మాస్కో: టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆరు రోజుల పర్యటన నిమిత్తం రష్యా రాజధాని మాస్కో చేరుకున్నారు. ఆయనకు ఇండియన్ ఎంబసీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ నిఖిలేష్ గిరితో పాటు ఎన్‌ఆర్‌ఐలు ఘన స్వాగతం పలికారు. ఈ నెల 7వ తేదీ వరకు ఆయన రష్యాలో పర్యటిస్తారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగే ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరం సమావేశంలో పాల్గొంటారు.



# ప్రజల్లోనే ఉండాలి... మళ్లీ మళ్లీ గెలవాలి

- వన్‌టైమ్ ఎమ్మెల్యేలుగా మిగలొద్దు
- 'సర్'పై అవగాహన పెంచుకోండి... అప్రమత్తంగా ఉండండి
- ప్రతి ఓటునూ మ్యాపింగ్ చేయాలి... అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో ఉండాలి
- కూటమి పార్టీలను సమన్వయం చేసుకోవాలి
- టీడీపీ ప్రజా ప్రతినిధులు, పరిశీలకులు, బీఎల్‌ఏలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం
- రెండేళ్ల పాలనపై ఈనెల 25 నుంచి 45 రోజుల పాటు సైకిళ్లపై ఇంటింటి ప్రచారం
- చిన్న పామైనా విషం కక్కుతోంది... గొడ్డలి పార్టీని పెద్ద కర్రతో కొట్టాలి
- డీఎస్సీ, నంద్యాల ఘటనల్లో అలెర్టుగా ఉండడంతో తోకముడిచారు

మంగళగిరి (చైతన్యరథం): ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం 'సర్'పై జరిగిన రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌నకు ఆయన హాజరయ్యారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జోనల్ కో-ఆర్డినేటర్లు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శులు, పరిశీలకులు, బీఎల్‌ఏలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో ఓటర్ల జాబితాలను ఆధారం చేసుకుని వ్యూహాలు, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందని గుర్తు చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని 'సర్' ప్రక్రియపై రాష్ట్రస్థాయి నేతలు మొదలుకుని గ్రామ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడమే కాకుండా పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... "మహానాడును వర్చువల్‌గా అద్భుతంగా నిర్వహించుకున్నాం. రెండు రోజుల మహానాడుకు 24.50 లక్షల మంది హాజరయ్యారు. వర్చువల్‌గా మహానాడును ఈ స్థాయిలో నిర్వహించుకోవడం సాధ్యమా అనే అనుమానాలను పటాపంచలు చేస్తూ... సక్సెస్ చేసుకోగలిగాం. ఇప్పుడు పార్టీ యంత్రాంగంపై అతి పెద్ద కీలక బాధ్యత ఉంది. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 'సర్' ప్రక్రియ మొదలవుతోంది. ప్రతి 20-25 ఏళ్లకోసారి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతుంది. 2002 ఓటర్ల జాబితాను పరిగణలోకి తీసుకుని 'సర్' ప్రక్రియను చేపడుతున్నారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారు. ఈ రెండుసార్లు మ్యాపింగ్ జరిగేలోగా ఓట్ల చేరికలు పరిపూర్ణంగా పూర్తి కావాలి. అవసరమైతే మూడోసారి కూడా ఇళ్లకు వెళ్లి ఓట్ల పరిశీలన జరపాలి. బీఎల్‌వోలతోపాటు మన పార్టీకి చెందిన బీఎల్‌ఏలు కూడా వెళ్లాలి. 'సర్'ను అందరూ సీరియస్‌గా తీసుకోవాలి... ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదు. ఓట్లు నమోదు చేసుకోవడం ఓటర్ల బాధ్యత. ఓట్ల చేరికలపై ప్రజలకు అవగాహన కల్పించడం రాజకీయ పార్టీగా మన ప్రాథమిక బాధ్యత. ఏ ఎన్నికలకైనా ఓటర్ల జాబితా అనేది చాలా కీలకం. ఓటర్ల జాబితా ఆధారంగానే ఎన్నికల్లో వ్యూహాలను అమలు చేయగలం... ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం. పార్టీ బలంగా ఉంటే ప్రభుత్వం మరింత బలంగా ఉంటుంది. 'సర్'పై ప్రతిరోజూ మానిటరింగ్ చేస్తాం. మన ఓట్లు ఉన్నాయా..? లేవా..? అనేది నిరంతరం చూసుకోవాలి. ఏపీకి చెందిన స్థానికులు వివిధరకాల కారణాలతో ఇతర ప్రాంతాలకు వెళ్తారు. వారి ఓట్ల విషయంలో జాగ్రత్తలు తీసు కోవాలి. వివిధ ప్రాంతాల్లో ఉన్న వాళ్లు పెద్ద ఎత్తున వచ్చి ఓట్లేయడం వల్లే మొన్నటి ఎన్నికల్లో కూటమికి 164 సీట్లు వచ్చాయి." అని చంద్రబాబు స్పష్టం చేశారు.

## వన్‌టైమ్ ఎమ్మెల్యేలుగా మిగలొద్దు...

"చిన్న పామైనా పెద్ద కర్రతో కొట్టాలి... గొడ్డలి పార్టీ విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఎన్నికల్లో హామీ ఇచ్చి.. మొదటి సంతకం పెట్టి మెగా డీఎస్సీ నిర్వహించాం. మెగా డీఎస్సీ జరగకూడదని 241 కేసులు వేసి అడ్డుకున్నారు. కానీ వాటిని ఎదుర్కొని అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి.. నియామకాలు పూర్తి చేశాం. పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. గట్టిగా కౌంటర్లు ఇస్తే.. ఇప్పుడు తోకముడిచారు. నంద్యాలలో ఓ వైసీపీ కార్యకర్తే వైఎస్ విగ్రహం తల తీసేశాడు. పోలీసులు నిమిషాల్లో పట్టుకున్నారు. వైసీపీ కార్యకర్తను గుర్తించకుంటే టీడీపీపై నెపం నెట్టేవారు. వివేకా హత్య అనేది ఓ కేస్ స్టడీ. చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి... లేకుంటే విషం చిమ్ముతుంది... దీన్ని ప్రతి ఒక్కరూ నిరంతరం గుర్తు పెట్టుకోవాలి. గొడ్డలి పార్టీతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. నేను ఎన్నో పోరాటాలు చేశాను. కానీ నీచులతో ఎప్పుడూ పోరాటాలు చేయలేదు. పార్టీ పెట్టినప్పటి నుంచి హిందూపురం, కుప్పం సహా ఇంకొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ గెలుస్తూనే ఉంది. ఇలాంటి నియోజకవర్గాల సంఖ్య పెరగాలి. కొత్తగా ఎమ్మెల్యేలు అయిన వారు వన్‌టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదు. మళ్లీ మళ్లీ గెలవాలి. అభివృద్ధి, సుపరిపాలన ద్వారా ఓట్లు పడతాయి. ప్రజా ప్రతినిధుల వ్యవహార శైలితోనే ఓట్లు పెరుగుతాయి, తగ్గుతాయి. ప్రజల కోసం పని చేసినా నోరు అదుపులో పెట్టుకోకుంటే నష్టమే జరుగుతుంది. కార్యకర్త మొదలుకుని నాయకుడి వరకు ప్రతి ఒక్కరికీ క్యారెక్టర్, ట్రస్ట్ అనేది చాలా ముఖ్యం." అన్నారు.

## సైకిల్ పవర్ చూపుదాం... ప్రజలకు చేరువవుదాం...

"జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు ఇంటింటి ప్రచారం చేపట్టాలి. రెండేళ్లల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలి. 45 రోజుల్లో ఇంటింటి ప్రచారం చేపట్టాలి... పెద్ద ఎత్తున ప్రజల్లోకి వెళ్లాలి. ఈ ఇంటింటి ప్రచారంలో నేను కూడా పాల్గొంటాను. సైకిళ్ల మీద వెళ్లి ప్రజలను కలవాలి. వీలుంటే ఈ-సైకిళ్లపై ప్రచారం చేపట్టాలి. నేను కూడా సైకిల్ మీదే ప్రచారం చేస్తాను. ప్రధానిగా మోదీ 12ఏళ్లు పూర్తి చేసుకున్నారు.. నేను నాలుగోసారి సీఎంగా ఉన్నాను. ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వీటితో పాటు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సాధించిన ప్రగతిపై పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలి. టీడీపీ అందరికి చెందిన పార్టీ... తెలుగు వాళ్ల పార్టీ. ప్రతి వర్గాన్నీ మనం ఓన్ చేసుకోవాలి. సోషల్ రీ-ఇంజనీరింగ్‌తో పదవులు, సీట్ల కేటాయింపులు చేశాం. నామినేటెడ్ పదవుల్లోను, పార్టీ పదవుల్లోను సోషల్ రీ-ఇంజనీరింగ్ చేపడుతున్నాం. కార్యకర్తల సాధికారత గురించి ఆలోచించాలి... కార్యకర్తల సంక్షేమం కోసం ప్రత్యేక విభాగాన్ని టీడీపీ తప్ప ఏ పార్టీ పెట్టలేదు. చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటున్నాం. చనిపోయిన కార్యకర్తలకు రూ.5లక్షల ప్రమాద బీమా ఇస్తున్నాం... పిల్లల చదువుకు ప్రత్యేకంగా స్కూల్ ఏర్పాటు చేశాం.

- (మిగతా వివరాలు 3లో)









## సాంస్కృతిక వైభవం ఉట్టిపడేలా

# గోదావరి పుష్కరాలు



- ఆధ్యాత్మిక పర్యాటకానికి అత్యధిక ప్రాధాన్యం
- పుణ్యస్నానాలకు 10కోట్ల మంది వస్తారని అంచనా
- ఆరు జిల్లాల్లో కొత్తగా 237 ఘాట్లు నిర్మించాలని ప్రతిపాదనలు
- త్వరలో పుష్కర లోగో విడుదల, విస్తృతంగా ప్రచారం
- గోదావరి పుష్కరాలు-2027పై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి (చైతన్యరథం): వచ్చే ఏడాది మొదలయ్యే గోదావరి పుష్కరాలను ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక, చారిత్రక వైభవం ఉట్టిపడేలా మరింత ఆకర్షణీయంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. గోదావరి సమీప ప్రాంతాల్లో ఎన్నో పుణ్యక్షేత్రాలు కొలువై ఉన్నందున పుష్కరాల్లో ఆధ్యాత్మిక పర్యాటకానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులతో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలన్నారు. గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాలు-2027 నిర్వహణపై మంత్రుల కమిటీ, వివిధ శాఖల అధికారులతో సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్షించారు. అఖండ గోదావరి అభివృద్ధి ప్రాజెక్టుపైసమగ్రంగా చర్చించారు. గోదావరి పుష్కరాల కన్నా ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వెల్లడించారు. దీంతో పోలవరం ప్రాజెక్టుకు కూడా సందర్శకులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ధవళేశ్వరం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు రహదారిని అఖండ గోదావరిగా అభివృద్ధి చేయాలన్నారు. కేవలం పుష్కరాలను మాత్రమే దృష్టిలో పెట్టుకుని పనులను పరిమితం చేయకుండా, ఇప్పుడు చేసే అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన గోదావరి పరివాహక ప్రాంతానికి ఆస్తిగా మారాలన్నారు. పుష్కరాల నిర్వహణతో రాజమహేంద్రవరం మహా నగరంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

### పుష్కరాలకు కేంద్ర సాయం కోరండి

హైవే ట్రాఫిక్ మేనేజ్మెంట్, రైల్వే ట్రాఫిక్, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల రద్దీపైనా దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు. భక్తుల సౌకర్యార్థం, ఎవరికీ ఎలాంటి గందరగోళం లేకుండా పుష్కర ఘాట్లకు నెంబరింగ్ ఇవ్వాలన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారుల అనుసంధానం, విశాఖ నుంచి విజయవాడ వరకు రైలు సర్వీసులు పెంచాలని నిర్దేశించారు. ప్రత్యేక రైళ్ల గురించి కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాయడంతో పాటు గోదావరి పుష్కరాలకు కేంద్రాన్ని సాయం కోరాలన్నారు. పర్యాటకుల సౌకర్యం కోసం కుంభమేళా తరహాలో టెంట్ సిటీలు, హోంస్టేలు ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. గోదావరి పుష్కరాలను అభివృద్ధికి అద్భుతమైన అవకాశంగా చూడాలన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇటీవల పుష్కర పనుల పరిశీలనకు క్షేత్రస్థాయిలో పర్యటించిన సమయంలో చేసిన సూచనలను పరిగణలోకి తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

### గోదావరి గట్టు బ్యూటిఫికేషన్


పోలవరం ప్రాజెక్టుకు ఇరువైపులా రహదారులు నిర్మించడంతో పాటు గోదావరి గట్టు బ్యూటిఫికేషన్ చేయాలని సీఎం సూచించారు. రాజమహేంద్రవరంలోని కందుకూరి వీరేశలింగం పంతులు ఇంటిని కూడా తీర్చిదిద్దాలన్నారు. ప్రముఖ్య ఆధ్యాత్మిక గురువులు, పీఠాధిపతులు, రాజకీయవేత్తలు, సినిమా సెలబ్రిటీలను కూడా గోదావరి పుష్కరాలకు ఆహ్వానించాలన్నారు. ఈ నెల 24న యాక్షన్ ప్లాన్‌తో రావాలని అప్పటి నుంచి పుష్కరాలకు కౌంట్‌డౌన్ మొదలవుతుందన్నారు. ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్, ఆర్టీజీ, టీటీడీ సంయుక్తంగా రద్దీ నిర్వహణ ప్రక్రియను చేపట్టాలన్నారు. అఖండ గోదావరి పుష్కరాలు-2027 వెబ్‌సైట్‌ను ప్రారంభించాలని కోరారు. గోదావరికి అఖండ హారతి, కృష్ణా నదికి పవిత్ర హారతి రెండూ నిరాటంకంగా జరగాలని ఆదేశించారు.

### రూ.211 కోట్ల విలువైన 132 పనులకు అనుమతి

పోలవరం, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ... మొత్తం 6 జిల్లాల్లో 525 ఘాట్లను పుష్కరాల కోసం సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న 288 ఘాట్లు సహా కొత్తగా 237 ఘాట్లను నిర్మించాలని ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారు. ప్రస్తుతం 4.5 కిలోమీటర్ల మేర పొడవైన పుష్కర ఘాట్లను 9.9 కిలోమీటర్ల మేర పెంచాలని నిర్ణయించారు.

పోలవరం జిల్లా గుండాలలో మొదటి ఘాట్... కోనసీమ జిల్లా అంతర్వేది, బలుసుతిప్ప, కాకినాడలోని గోవలంక, పశ్చిమ గోదావరిలోని నర్సాపురంలో చివరి ఘాట్ నిర్మించ తలపెట్టారు. ఈసారి పుష్కరాల్లో పుణ్యస్నానాల కోసం 9.95 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1991లో 1.2 కోట్ల మంది భక్తుల పుష్కర స్నానాలు చేయగా 2003లో 5 కోట్ల మంది, 2015లో నవ్యాంధ్రప్రదేశ్‌లో 4.86 కోట్ల మంది భక్తులు స్నానాలు చేశారు. గత పుష్కరాల్లో ఒక్క రోజులో అత్యధికంగా 58.26 లక్షల మంది స్నానాలు చేయగా, ఈసారి ఒక్కరోజునే కోటి మంది పుణ్య స్నానాలు ఆచరిస్తారని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రూ.211.97 కోట్లకు సంబంధించి 132 పనులకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది.

సమావేశంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్, పి.నారాయణ, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, వాసంశెట్టి సుభాష్, చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాలతో పాటు దేవదాయ, వైద్యారోగ్య, రవాణా, పర్యాటక, పురపాలక, పంచాయతీరాజ్, ఆర్థిక, జలవనరులు, పోలీసు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ప్రజల్లోనే ఉండాలి...

# మళ్లీ మళ్లీ గెలవాలి

(2వ పేజీ తరువాయి)

కార్యకర్తల పిల్లలకు నైపుణ్య శిక్షణ ఇచ్చి మంచి ఉద్యోగాలకు సిఫార్సులు చేస్తున్నాం. కార్యకర్తల ఆర్థిక సాధికారత కోసం ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్ పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రతి కార్యకర్త ఆరోగ్యంగా ఉండడానికి ఎంతైనా ఖర్చు చేస్తాం. మన కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ చర్యలు తీసుకుంటుంది. ప్రతీ నాయకుడూ ఇదే విధంగా ఆలోచన చేయాలి. మనకు తెలిసి కానీ తెలియకుండా కానీ తప్పులు జరగకూడదు. అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకోవాలి. గత ప్రభుత్వంలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పోయిన బ్రాండ్‌ను మళ్లీ తెచ్చాం. పోలవరం ప్రాజెక్టు ఆగిపోతుందని అందరూ భయపడ్డారు. కానీ మళ్లీ ప్రాజెక్టును ట్రాక్‌లో పెట్టాం. సంక్షేమం అందిస్తున్నాం... అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం. ఈ నెల 21న అమరావతిలో 25వేల మందితో యోగా డే నిర్వహిస్తాం. యోగా మన జీవన విధానంలో భాగం కావాలి." అని చంద్రబాబు స్పష్టం చేశారు.

### కూటమి పార్టీల సమన్వయం ముఖ్యం

'సర్' ప్రక్రియ పర్యవేక్షణలో కూటమి పార్టీలను కూడా సమన్వయం చేసుకుని వెళ్లాలి. ఎన్నికలప్పుడే మిత్రపక్షాలతో కలుస్తాం... మిగిలిన రోజుల్లో పట్టించుకోం అంటే కుదరదు. ప్రభుత్వంలోనే కాదు అన్ని కార్యక్రమాల్లోనూ జనసేన, బీజేపీలను సమన్వయం చేసుకోవాలి. నా రాజకీయ చరిత్రలో 2024 ఎన్నికల్లో సాధించినటువంటి ఘన విజయం ఎప్పుడూ చూడలేదు. కొత్త వారికి టిక్కెట్లు ఇచ్చినా.. కూటమి పార్టీ అభ్యర్థి అనగానే ప్రజలు, కార్యకర్తలు ఓటేశారు. పార్టీల మధ్య సమన్వయానికి 'సర్' మొదటి టెస్ట్. చాలా మంది అనుచరులను కోరుకుంటారు.... కానీ నేను నాయకులను కోరుకుంటాను.

సమర్థవంతమైన నాయకత్వం ఉంటే పార్టీకి బలం పెరుగుతుంది. 2024 ఎన్నికల ముందు పట్టభద్రుల ఎమ్మెల్సీలు గెలిచాం. పూర్తిస్థాయిలో గ్రౌండ్ వర్క్, టెక్నికల్ వర్క్ చేసి అద్భుత విజయాన్ని నాటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో చూపించాం. గ్రాడ్యుయేట్ల ఎన్నికల్లో ఒకప్పుడు పోటీ చేసేవాళ్లం కాదు. కానీ నాడు ఆ ఎన్నికల్లోనూ పోటీ చేసి గెలిచాం. అదీ మన నెట్‌వర్క్ గొప్పదనం. 'సర్' విషయంలోనూ అదే స్థాయిలో కష్టపడి పని చేయాలి. పార్టీలో వివిధ కీలక అంశాలపై చర్చలు జరగాలి. అందులో కార్యకర్తలు భాగస్వాములు కావాలి. అధికార ఫలితాలను కార్యకర్తలకు అందించాలి. క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల మిత్రపక్షాలు ఉండకపోవచ్చు. అయినా వారిని కూడా కలుపుకుని వెళ్లాలి. 2024 ఎన్నికలకంటే ఎక్కువగా మిత్రపక్షాలతో పనిచేయాలి. మిత్రధర్మాన్ని ప్రతి నేతా, ప్రతి కార్యకర్తా పాటించాల్సిందే. 'సర్' పై మూడు పార్టీలతో త్వరలో కో-ఆర్డినేషన్ కమిటీ కూడా వేస్తాం. దీనికి సంబంధించి త్వరలో ఓ ఎన్డీఏ సమావేశం నిర్వహించుకుంటాం."అని టీడీపీ అధినేత వెల్లడించారు.







చైతన్యరథం

## ఇళ్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ సమస్యకు

# ఫుల్‌స్టాప్ పెడదాం




- **జిల్లాల్లో పరిష్కారం కాని ఇళ్ల సమస్యలను కేబినెట్‌కు తీసుకురండి**
- **గృహ నిర్మాణ శాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపులపై దృష్టి పెట్టండి**
- **ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

అమరావతి (చైతన్యరథం): జిల్లాల్లో సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఇళ్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. జిల్లా స్థాయిలో ఎంతవరకు చేయగలరో చేయాలని... కుదరని పక్షంలో కేబినెట్‌కు తీసుకురావాలని ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ల నుంచి సమాచారం తీసుకోవాలని సూచించారు. మంగళవారం ఆర్టీజీ సెంటర్ నుంచి సీఎం వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మట్లాడుతూ... 'రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ సమస్య చాలా కాలంగా పెండింగులో ఉంది. ఏదో ఒక రకమైన సాకు చూపి వాటిని పెండింగులో పెట్టేస్తున్నారు. దీనికి ఫుల్‌స్టాప్ పెట్టాలి. ప్రతీ జిల్లాలోనూ క్రమబద్ధీకరించాల్సిన ఇళ్లు, ఇళ్ల స్థలాల జాబితాలను సిద్ధం చేయండి. ఈ మేరకు కలెక్టర్ల నుంచి సమాచారాన్ని తీసుకోండి. క్రమబద్ధీకరణకు సంబంధించి జిల్లాల స్థాయిలో చేయగలిగినంత మేరకు చేసేయాలి. అక్కడ సమస్య పరిష్కారం కాకుంటే... కేబినెట్లో పెట్టి వాటి క్రమబద్ధీకరణకు నిర్ణయం తీసుకుంటాం. ఎటువంటి వివాదాల్లేకుండా క్రమబద్ధీకరించతగ్గ స్థలాలను ప్రతి కేబినెట్‌కూ తీసుకురావాలి. అప్పటికీ పూర్తి కానివి ఏమైనా ఉంటే... ఆ సమస్యను ఏ విధంగా పరిష్కారించాలో ఆలోచన చేద్దాం. ఇక గృహ నిర్మాణ శాఖలో పెండింగులో ఉన్న బిల్లుల చెల్లింపు ప్రక్రియను కూడా మొదలు పెట్టాలి. ఈ మేరకు గృహ నిర్మాణం-ఆర్థిక శాఖలు సమన్వయం చేసుకోవాలి." అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

### రాజవొమ్మంగి సీడీపీవో ఆత్మహత్యకు కారకులపై కఠిన చర్యలు

"ఇసుక అక్రమాలు అస్సలు జరగడానికి వీల్లేదు. ఏపీలో తవ్విన ఇసుక ఇతర రాష్ట్రాలకు వెళ్లకూడదు. రాష్ట్రాల సరిహద్దులు దాటిన వాహనాలను సీజ్ చేయండి. ఈ విషయంలో కఠినంగా ఉండండి. ఇసుక లారీలకు ట్రాకింగ్ పెట్టాలి. ఈ మేరకు టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. ఇసుక అక్రమంగా వేరే ప్రాంతాలకు వెళ్తే... వెంటనే అలెర్ట్ మెసేజెస్ వచ్చేలా మెకానిజం ఉండాలి. ఇప్పటికే 50వేల వాహనాలకు జీపీఎస్ పెట్టి ట్రాకింగ్ చేస్తున్నాం. అక్రమాలు జరగడానికి వీల్లేదు. ఈ మేరకు మైనింగ్-పోలీసులు కో-ఆర్డినేట్ చేసుకోవాలి. ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. ప్రభుత్వం అందించే ప్రతి పథకం, అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం పట్ల ప్రజలకు అవగాహన కలిగితే.. ప్రభుత్వం అందించే సేవలకు సార్ధకత లభిస్తుంది. ప్రజల్లోకి వెళ్లాలని... ప్రజలకు వివరించాలని చెప్పేది ప్రచారం కోసం కాదు... ప్రజలకు అవగాహన కల్పించడానికే అనేది ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి. ప్రభుత్వ సేవల పట్ల అవగాహన కలిగితే... ప్రభుత్వం అందిస్తున్న సేవల పట్ల ప్రజల్లో సంతృప్తి పెరుగుతుంది. రాజవొమ్మంగి సీడీపీవో ఆత్మహత్య ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోండి. వర్క్ ప్లేసులో వేధింపులు ఉండకూడదు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలి. సమస్యలు ఉత్పన్నమయ్యాక చర్యలు తీసుకోవడం కాదు... సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలి." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో మంత్రి పార్థసారధి, సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విశాఖలో భారీ గ్లోబల్ డేటా సెంటర్

**'ఎయిర్ ట్రంక్' సీఈవో రాబిన్ ఖుదాతో సీఎం భేటీ**



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్... ముఖ్యంగా విశాఖపట్నం భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ఒక కీలకమైన గమ్యస్థానంగా ఎదుగుతుండటం మనందరికీ ఎంతో గర్వకారణం.

ఈ రోజు ఏసియా-పసిఫిక్ రీజియన్‌లోనే ప్రముఖ హైపర్‌స్కేల్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లాట్‌ఫామ్ అయిన 'ఎయిర్ ట్రంక్' వ్యవస్థాపకుడు, సీఈవో మిస్టర్ రాబిన్ ఖుదాతో నేను ఒక ఫలప్రదమైన సమావేశం నిర్వహించాను. స్వచ్ఛమైన ఇంధనం (క్లీన్ ఎనర్జీ), ప్రపంచ స్థాయి కనెక్టివిటీ, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, స్థిరమైన మౌలిక సదుపాయాలతో అంతర్జాతీయంగా పోటీపడగల డిజిటల్ వ్యవస్థను ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించాలనే మా విజన్‌ను ఈ సందర్భంగా వారితో చర్చించాను. దీంతో పాటు విశాఖపట్నంలో 2 గిగావాట్ సామర్థ్యం కలిగిన భారీ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటు చేయడంపై ఎయిర్ ట్రంక్ సంస్థ చూపుతున్న ఆసక్తి గురించి కూడా మేము చర్చించాము. ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, నెక్స్ట్-జనరేషన్ టెక్నాలజీలకు ఒక ప్రధాన హబ్‌గా విశాఖపట్నం ఎదుగుతున్న తీరును మరింత బలపరుస్తుంది.

మా లక్ష్యం కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాదు... మన యువతకు సరికొత్త అవకాశాలను సృష్టించడం, డిజిటల్ సామర్థ్యాలను బలోపేతం చేయడం. ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా సిద్ధం చేయడానికి వీలుగా... డిజిటల్ మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, సరికొత్త టెక్నాలజీ రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను మేము పరిశీలించాము. 'ఎక్స్'లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

## సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ


- **భూసార పరిరక్షణకు కూటమి ప్రభుత్వ ప్రాధాన్యం**
- **పెట్టుబడి భారం తగ్గించి అధిక దిగుబడులే లక్ష్యం**
- **వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

అమరావతి(చైతన్యరథం): రైతు సంక్షేమం, భూసార పరిర క్షణ, సుస్థిర వ్యవసాయాభివృద్ధికి కట్టుబడి ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్--2026 సీజన్‌లో పచ్చిరొట్ట పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో రైతులకు అవసరమైన మద్దతు అందిస్తోందని పేర్కొన్నారు. పచ్చిరొట్ట పంటల సాగును ప్రోత్స హించేందుకు ప్రభుత్వం రూ.62.20 కోట్ల సబ్సిడీని కేటాయించి నట్లు మంత్రి వెల్లడించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 91,918 క్వింటాళ్ల విత్తనాలను జిల్లాలకు కేటాయించగా, అందులో జీలుగ 50,311 క్వింటాళ్లు, జనుము 21,291 క్వింటాళ్లు, పిల్లి పెసర 20,316 క్వింటాళ్లు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 40,459 క్వింటాళ్ల విత్తనాలను జిల్లాలకు సరఫరా చేయగా, 19,667 మంది రైతులకు 5,687 క్వింటాళ్ల విత్తనా లను పంపిణీ చేసి రూ.4.76 కోట్ల సబ్సిడీ ప్రయోజనాన్ని అందించినట్లు చెప్పారు. పచ్చిరొట్ట పంటలు నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఈ పంటలను భూమిలో కలపడం ద్వారా సేంద్రియ కార్బన్ శాతం పెరగడంతో




పాటు నత్రజని నిల్వలు అధికమవుతాయని తెలి పారు. దీనివల్ల రసాయన ఎరువులపై ఆధారపడటం తగ్గి, రైతుల సాగు వ్యయం నియంత్రణలో ఉండటమే కాకుండా భూముల ఉత్పాదకత కూడా గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. సహజ, సేంద్రియ వ్యవసాయ విధానాల పట్ల రైతుల్లో ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో పచ్చిరొట్ట సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈ పంటల ప్రాముఖ్యతను వివరిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సాహానికి రైతుల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. కృష్ణా, గుంటూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప, ఏలూరు, బాపట్ల, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో ఈ కార్యక్రమం ద్వారా వేలాది మంది రైతులు ఇప్పటికే లబ్ధి పొందినట్లు మంత్రి వెల్లడించారు. రైతుల అవసరాలకు అనుగు ణంగా విత్తనాల సరఫరాను మరింత పెంచి పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వ్యవసా యాన్ని కేవలం జీవనాధార రంగంగా కాకుం డా ఆదాయాన్ని పెంచే రంగంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.





# లాటరైట్ ఖనిజానికి సేవింగ్ క్లాజ్ ఇవ్వండి

- గనుల లీజుకు వెసులుబాటు కల్పించండి
- అమలు చేస్తే సిమెంట్, ఐరన్ ఓర్,
- రోడ్డు నిర్మాణ పరిశ్రమలకు మేలు
- కేంద్ర గనుల మంత్రికి చంద్రబాబు లేఖ

అమరావతి (చైతన్యరథం): లాటరైట్ మైన్ వర్గీకరణలో జరిగిన మార్పులపై కేంద్ర గనుల మంత్రి కిషన్‌రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖ రాశారు. లాటరైట్‌లో అల్యూమినియం 20 శాతం లేదా అంతకంటే ఎక్కువ ఉంటే దాన్ని ఉప ఖనిజంగా కాకుండా బాక్సైట్‌గా పరిగణించాలంటూ ఇటీవల కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మార్పుల వల్ల ఏపీ ఎదుర్కొంటున్న ఇబ్బందులను లేఖలో ప్రస్తావించారు. కేంద్రం నిర్ణయం వల్ల ఏపీలో గనుల లీజుల ప్రక్రియ స్తంభించిపోయిందని పేర్కొన్నారు. కొత్త నిబంధనలతో గతంలో మైనర్ మినరల్ కింద ప్రాసెస్ చేసిన 402 గనుల లీజు దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా హోల్డ్‌లో పెట్టిందని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. నిలిచిపోయిన వాటిలో 19 లెటర్ ఆఫ్ ఇంటెంట్ దరఖాస్తులు, 113 ప్రభుత్వ భూముల దరఖాస్తులు, 255 అటవీ భూముల దరఖాస్తులు, 15 పట్టా భూముల దరఖాస్తులు ఉన్నాయని వివరించారు. పాత నిబంధనల మేరకు అప్లికేషన్ ఫీజులు, భూముల కొనుగోళ్లు, అటవీ అనుమతుల కోసం వందలాది మంది దరఖాస్తుదారులు కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని లేఖలో ప్రస్తావించారు. గతంలో మైకా, క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్, బారైట్స్ ఖనిజాలను మైనర్ నుంచి మేజర్ ఖనిజాలుగా మార్చినప్పుడు కేంద్రం సేవింగ్ క్లాజ్ ఇచ్చిందని లేఖలో గుర్తు చేశారు. ఇప్పుడు అదే తరహాలో లాటరైట్ ఖనిజానికి కూడా సేవింగ్ క్లాజ్ ఇచ్చి పెండింగ్‌లో ఉన్న 402 దరఖాస్తులను పాత రూల్స్ కిందనే ప్రాసెస్ పూర్తి చేసి రెండేళ్లు వెసులుబాటు ఇవ్వాలని కోరారు. సడలింపు ఇస్తే వందలాది మంది దరఖాస్తుదారులకు ఆర్థిక నష్టం తప్పుతుందని, కోర్టు వివాదాలు రావని లేఖలో వివరించారు. సేవింగ్ క్లాజ్ అమలు చేస్తే సిమెంట్, ఐరన్ ఓర్, రోడ్డు నిర్మాణ పరిశ్రమలకు ముడిసరుకు కొరత లేకుండా ఉపాధి నిలబడుతుందని తెలిపారు.

## పారా స్విమ్మర్‌కు శాప్ ఛైర్మన్ అభినందన

అమరావతి (చైతన్యరథం): శ్రీకాకుళంకు చెందిన పారా స్విమ్మర్ బలగ గణేష్ గత ఏడాది ఏప్రిల్ 18న శ్రీలంకలోని తలైమ న్నార్ నుంచి భారతదేశంలోని ధనుష్కోటి వరకు విస్తరించిన పాక్ జలసంధిని కేవలం 10 గంటల 40 నిమిషాల్లో విజయవంతంగా ఈది పూర్తి చేశారు. అలాగే ప్రపంచంలోని అత్యంత క్లిష్టమైన సముద్ర ఈతలలో ఒకటిగా గుర్తింపు పొందిన ఇంగ్లీష్ ఛానల్‌ను జూన్ 16న ఇంగ్లాండ్ నుంచి ఫ్రాన్స్ వరకు 13 గంటల 37 నిమిషాల్లో ఈది పూర్తి చేయడం జరిగింది. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ రవినాయుడు బలగ గణేష్‌ను సత్కరించారు. త్వరలో స్పెయిన్ నుంచి మొరాకో వరకు ఉన్న జిబ్రాల్టర్ జలసంధి, జర్మనీ నుండి స్విట్జర్లాండ్ వరకు విస్తరించిన లేక్ బోడెన్సీ ఈతలను పూర్తి చేయడానికి గణేష్ సిద్ధమవుతున్నాడు. ఈ సందరర్భంగా రవినాయుడు అభినందించి అంతర్జాతీయ వేదికపై గొప్పగా రాణించి రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.



## 5న మంగళగిరిలో మెగా జాబ్ మేళా

### 950 మందికి పైగా ఉపాధి అవకాశాలు




మంగళగిరి (చైతన్యరథం): మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరి వీజే జూనియర్ కాలేజీలో ఈ నెల 5వ తేదీన ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. యువతకు ఉపాధి అవకా శాలు కల్పించడమే లక్ష్యంగా ఈ జాబ్ మేళా జరగనుంది. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గల నిరు ద్యోగ యువత ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చు. అభ్యర్థులు ఆధార్ కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, బయోడేటాతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు. ఈ జాబ్‌మేళా ద్వారా 950 మందికి పైగా ఉద్యోగావకాశా లు అందుబాటులో ఉండగా, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15,000 నుంచి రూ.40,000 వరకు వేతనాలు లభించే అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యం పోర్టల్ ఝఱజూబఅఝఎ.ఖజూ.ద్రశీజ.ఱఅ ద్వారా నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. అదనపు వివరాల కోసం: 8074597926, 7780588993 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు. అలాగే జాబ్‌మేళా ప్రాంగణంలోనే ప్రత్యక్ష రిజిస్ట్రేష న్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మే నెలలో శ్రీవారి దర్శనాల్లో రికార్డ్


### 25.46 లక్షల మందికి దర్శనం



తిరుమల (చైతన్యరథం): మే నెలలో తిరుమల శ్రీవారిని రికార్డు స్థాయిలో 25.46 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. వేసవి రద్దీ దృష్ట్యా టీటీడీ మే 1 నుంచే వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేయడంతో పాటు ప్రత్యేక ప్రవేశ దర్శన కోటాను కుదించింది. తొలివారం రద్దీ మోస్తరుగానే ఉన్నప్పటికీ వరుసగా పరీక్షల ఫలి తాలు వెలువడిన అనంతరం తిరుమల కొండ రద్దీగా మారి పోయింది. భక్తుల మధ్య తోపులాటలకు ఆస్కారం లేకుండా భక్తులను విడతల వారీగా క్యూలైన్లలోకి అనుమతించారు. ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా అధికారులం దరూ సమన్వయంతో పనిచేయడంతో మే నెలలో రికార్డుస్థాయిలో 25.46 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24వ తేదీన అత్యధికంగా 98,058 మంది భక్తులు దర్శించుకున్నారు. హెడ్‌కౌంటర్ సిస్టమ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇదే రికార్డుగా నమోదైంది. ఏడు సార్లు 90 వేలకు పైగా భక్తులకు శ్రీవారి దర్శనం చేయించగలిగారు. గత నెలలో 12.19 లక్షల మంది సమర్పించారు. అలాగే హుండీ ఆదాయం గత ఏడాది మే నెలలో 106.85 కోట్లు లభించగా గత నెలలో దాదాపు రూ.120.28 కోట్లు లభించింది.

# నేటి నుంచి మంత్రి దుర్గేష్ కేరళ పర్యటన

- ఏపీకి టూరిజం ప్రమోషన్ స్టేట్ అవార్డు
- 4న జీటీఎం ఎక్స్‌పో -2026లో ప్రదానం
- పర్యాటక సంస్కరణలకు జాతీయ గుర్తింపు
- 'బ్రాండ్ ఏపీ'కి దక్కిన అరుదైన పురస్కారం
- కేరళం అవార్డు విజయాలకు ఘనమైన ఆరంభం






అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. దక్షిణాదిలోనే అతిపెద్ద ట్రావెల్ అండ్ ట్రేడ్ ఎక్స్‌పో అయిన 'గ్లోబల్ ట్రావెల్ మార్కెట్' (జీటీఎం 2026) ఆంధ్రప్రదేశ్‌ను "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్" (ఉత్తమ పర్యాటక ప్రచార రాష్ట్రం)గా ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో కేరళలోని తిరువనంతపురంలో జరగను న్న 'జీటీఎం ఎక్స్ పో -2026'లో పాల్గొని ప్రతిష్ఠాత్మకమైన 'మెట్రో ఎక్స్‌పెడిషన్ - జీటీఎం టూరిజం అవార్డు 2026'ను మంత్రి స్వీకరించనున్నారు. అంతేకాకుండా మూడు రోజులు కేరళంలోనే పర్యటించనున్నారు. మంగళవారం ఆయన కేరళంకు బయలుదేరి వెళ్లారు. కేరళం పర్యటనలో భాగంగా జూన్ 3న తిరువనంతపురంలోని కోవాలం 'ఉదయ్ సముద్ర లీజర్ బీచ్ హోటల్ అండ్ స్పా'లో జరిగే జీటీఎం ఎక్స్‌పో -2026 ప్రారంభో త్సవంలో పాల్గొంటారు. అనంతరం జూన్ 4న తిరువనంతపురం 'గోల్డెన్ ప్యాలెస్ కన్వెన్షన్ సెంటర్'లో జరిగే ఎక్స్ పో కార్యక్ర మాలకు హాజరవుతారు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు కోవాలంలోని 'లీలా తిరువనంతపురం రావిజ్ హోటల్'లో జరిగే జీటీఎం అవార్డ్స్-2026 వేడుకలో దేశవిదేశాల ప్రముఖుల సమక్షంలో ఏపీకి దక్కిన "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్" అవార్డును అందుకోనున్నారు. ఆ తర్వాత జూన్ 5న తిరువ నంతపురం నుంచి ముంబయి పర్యటనకు బయలుదేరి వెళతారు.

### కూటమి దార్శనికతకు దక్కిన గౌరవం

టూరిజం ప్రమోషన్ స్టేట్ అవార్డుపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. "ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ల దిశానిర్దేశంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి కాట, పర్యాటక శాఖ అధికారుల బృందం అంతర్జాతీయ స్థాయిలో చేసిన కృషికి దక్కిన అరుదైన గౌరవం ఇది. పర్యాటక రంగంలో మేం తీసుకొచ్చిన వినూత్న సంస్కరణలు, విప్లవాత్మక మార్పుల వల్లే ఈ రోజు జాతీయ స్థాయి ప్రశంసలు దక్కాయని తెలిపారు. కేరళంలో అందుకోబోయే ఈ జాతీయ అవార్డు ఏపీ పర్యాటక వైభవానికి ముగింపు కాదు.. ఇది ప్రపంచ స్థాయి విజయాలకు ఒక ఘనమైన ఆరంభమని స్పష్టం చేశారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న టూరిజం బోర్డులు, హాస్పిటాలిటీ బ్రాండ్‌లు, పరిశ్రమల ప్రతి నిధులు పాల్గొనే ఈ ఎక్స్‌పో ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగా నికి మరిన్ని పెట్టుబడులు, పర్యాటకులు వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# దక్షిణ కోస్తా రైల్వేజోన్‌తో ఉత్తరాంధ్ర ప్రజల కోరిక నెరవేరింది

- ఖుర్దా నుంచి విశాఖ డివిజన్‌కు ఏడు రైల్వేస్టేషన్లు
- 12 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి ఫలితమిది
- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు




ఇచ్ఛాపురం (చైతన్యరథం): విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని కేంద్ర పౌర విమానాయశాఖ మంత్రి కింజరాపు రామ్మోహ న్‌నాయుడు పేర్కొన్నారు. ఏఎస్‌పేట (బోర్డర్) రైల్వే ట్రాక్ వద్ద ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వేజోన్ బోర్డును ఆయన ఆవిష్క రించారు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన రైల్వేజోన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. విశాఖ రైల్వేజోన్ సాధన కోసం 12 సంవత్సరాలుగా తాను సుదీర్ఘ పోరాటం సాగించినట్లు గుర్తు చేసుకున్నారు. సోమవారం నుంచే విశాఖ పట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారిక పరిపాలన ప్రాంభమైందని తెలిపారు. నూతన జోన్ ఏర్పాటుతో ఈ ప్రాంత రైల్వే సమస్యలకు స్థానికంగానే త్వరితగతిన పరిష్కారాలు లభిస్తా యన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జిల్లా అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. అందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా రూ3,300 కోట్ల భారీ వ్యయంతో 50కిపైగా రైల్వే ఓవర్ బ్రిడ్జిలు మంజూరైనట్లు చెప్పారు. ఇచ్ఛాపురం ప్రాంతానికి కూడా ఒక కీలకమైన ఆర్వోబీ మంజూరైనట్లు తెలిపారు. అలాగే నూతనంగా సాధించిన పూరి-అహ్మదాబాద్ రైలు సేవలను కూడా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విశాఖపట్నంలో 54 ఎకరాల్లో సుమారు రూ.450 కోట్ల అంచనా వ్యయంతో రైల్వేజోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణ పనులు ఇప్పటికే శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఏడు రైల్వేస్టేషన్లు ఖుర్దాడిజిన్ నుంచి విశాఖ డివిజన్‌లోకి వస్తాయని తెలిపారు.

### ఎయిర్‌పోర్టుకు సహకరించండి

పలాస ఎయిర్‌పోర్టుకు ప్రజలు సహకారం అందించాలని, నిర్మాణం జరిగితే 15 ఏళ్లలో ఈ ప్రాంత భవిష్యత్తు మారిపో తుందని రామ్మోహన్‌నాయుడు అన్నారు. దేశవ్యాప్తంగా 50 ఎయిర్‌పోర్టులు నిర్మాణం లక్ష్యంగా పెట్టుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తనకు టాస్క్ ఇచ్చారని, ఇప్పటికే 9 ఎయిర్‌పోర్టులు ప్రారంభించామని వివరించారు. మనకు కూడా ఒక ఎయిర్‌పోర్టు ఉండాలనే ఉద్దేశంతో పలాసను ఎంచుకున్నామని తెలిపారు. ఇక్కడ ప్రజల అభివృద్ధి, ఉద్యోగ అవకాశాల కోసం ఎయిర్‌పోర్టు ఆవశ్యకత ఉందన్నారు. శంషాబాద్, భోగాపురంలో జరుగుతున్న విధంగా అభివృద్ధి జరుగుతుందని, భవిష్యత్తు కోసం ఆలోచించి ఎయిర్‌పోర్టుకు సహకరించాలని కోరారు.

# అమరావతి రోడ్ల నిర్మాణంపై సీఆర్‌ఆర్‌ఐ ప్రతినిధుల అధ్యయనం



- మంత్రి పొంగూరు నారాయణతో భేటీ
- నాణ్యతా ప్రమాణాలపై కీలక సూచనలు
- త్వరలో ప్రభుత్వానికి తుది నివేదిక

అమరావతి (చైతన్యరథం): సచివాలయంలో సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఆర్‌ఆర్‌ఐ) ప్రతినిధులతో పురపాలక మంత్రి పొంగూరు నారాయణ భేటీ అయ్యారు. అమరావతి ఎల్‌పీ ఎస్ జోన్లు 2, 5, 9, 10, 12లలో అంతర్గత రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ లైన్ల నిర్మాణాలను సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నిపుణుల బృందం సమగ్రంగా అధ్యయనం చేసింది. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం రాజధాని ప్రాంతంలో రోడ్ల నిర్మాణాల నాణ్యతా ప్రమాణాలపై నిపుణుల బృందం పలు కీలక సూచనలు చేసింది. అమరావతిలో రోడ్ల భవిష్యత్తు నిర్మాణ ప్రణాళికపై సీఆర్‌ఆర్‌ఐ బృందం త్వరలోనే ప్రభుత్వానికి తన తుది నివేదికను సమర్పించనుంది. ఈ సమావేశంలో సీఆర్‌ఆర్‌ఐ డైరెక్టర్ సీహెచ్ రవిశేఖర్, చీఫ్ సైంటిస్ట్ కె.రవీందర్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ (ఫ్లెక్సిబుల్ పేవ్‌మెంట్) భరత్, ఏడీసీ చీఫ్ ఇంజినీర్ ధనుంజయ్ పాల్గొన్నారు.

# ఆరునెలల్లోనే తుంగభద్రకు 33 కొత్త గేట్లు





- ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో రికార్డ్
- నెలాఖరున రెండు రాష్ట్రాల సీఎంలతో ప్రారంభం
- గత ప్రభుత్వంలో జగన్‌రెడ్డి పట్టించుకోలేదు

అమరావతి (చైతన్యరథం): రాయలసీమ కరువు ప్రాంతానికి జీవనాధారమైన తుంగభద్ర అవసరాన్ని గుర్తించి చంద్రబాబు ఆరు నెలల్లోనే కొత్త గేట్లు పూర్తి చేయించారని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఒక్క సీజన్‌లోనే పాతగేట్లు తొలగించి రూ.51 కోట్లతో 33 కొత్త గేట్లు ఏర్పాటు చేయడం దేశంలోనే రికార్డు సృష్టించినట్లు వివరించారు. మంత్రి నిమ్మలను మంగళవారం తుంగభద్ర బోర్డ్ ఛైర్మన్ ఎస్.ఎన్.పాండే, కార్యదర్శి ఓ.ఆర్.కె.రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్‌కు 19వ గేటు స్థానంలో భారీ వరదలో సైతం స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు చేశాం. స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు చేసి 80 టీఎంసీలను వృథా కాకుండా కాపాడి రాయల సీమకు సాగు,తాగు నీరందించామని చెప్పారు. తుంగభద్ర గేట్లు ప్రమాదభరితంగా ఉన్నాయని నిపుణులు సూచించినా ఐదేళ్లు జగన్ పట్టించు కోలేదని మండిపడ్డారు.కూటమి వచ్చాక నిపు ణుడు కన్నయ్య నాయుడి సూచనల మేరకు 70 ఏళ్ల నాటి పాత గేట్ల స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేశామని వివరించారు. ఈ నెలాఖరు న ఏపీ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు తుంగభద్ర డ్యామ్ గేట్లను ప్రారంభించ బోతున్నారని తెలిపారు. తుంగభద్ర ప్రాజెక్టు ద్వారా ఏపీలో 7.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందుతుందని చెప్పారు.

## వెలిగొండ సొరంగం నుంచి

# టీబీఎం తొలగింపు పనులు ప్రారంభం


- రెండు నెలల్లో పూర్తికి చర్యలు
- కృష్ణా జలాలు తరలింపే లక్ష్యం



మార్కాపురం (చైతన్యరథం): పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజె క్టు నిర్మాణంలో రెండో సొరంగం తవ్వేందుకు వినియోగించిన టీబీఎం (టన్నెల్ బోరింగ్ యంత్రం) తొలగింపు పనులు ఎట్టకేల కు ప్రారంభమయ్యాయి. మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండ లం కొత్తూరు గ్రామంలో సొరంగంలో ఈ పనులు జరుగుతున్నాయి. ప్రాజెక్టులోని నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు తరలిం చేందుకు నల్లమల గర్భంలో రెండు సమాంతర సొరంగాలను కొత్తూరు సమీపంలో నిర్మించారు. తొలి సొరంగం 7 మీటర్ల వ్యాసం, రెండో సొరంగం 9.2 మీటర్ల వ్యాసంతో నిర్మించారు. ఆ పనులు నల్లమల అభయారణ్యంలో చేయాల్సి ఉండడంతో వన్య ప్రాణి సంరక్షణ, పర్యావరణ నిబంధనల ప్రకారం సొరంగాలు తవ్వకంలో పేలుళ్లు జరపకుండా విదేశాల నుంచి టీబీఎం(టన్నెల్ బోరింగ్ యంత్రం)లను దిగుమతి చేసుకున్నారు. వాటిలో తొలి సొరంగాన్ని 17.8 కిలోమీటర్లు తవ్విన టీబీఎంను 2021లో బయటకు తీశారు. దానిని లోపలే ధ్వంసం చేసి విడిభాగాలను బయటకు తెచ్చేందుకు అప్పట్లో నాలుగు నెలల సమయం పట్టిం ది. రెండో సొరంగంలో 11.8 కిలోమీటర్ల వద్ద ఉన్న టీబీఎంను బయటకు తెచ్చే పనిని ప్రత్యేక నిపుణులకు అప్పగించారు. 175 మీటర్ల పొడవు వెయ్యి టన్నుల బరువు ఉండే ఈ యంత్రానికి ఉండే విడి భాగాలను తొలిచే పని చేపట్టారు. దాని వెనుకవైపు నుంచి ఒక్కో భాగాన్ని వెల్డింగ్‌తో తొలగిస్తున్నారు. అనంతరం ఆ భాగాలను టిప్పర్‌లో వేసి బయటకు తెస్తున్నారు. ఈ పనిని రెండు నెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ దిశగా పనులు చేయిస్తున్నామని ఇంజినీరింగ్ అధికారులు చెబుతు న్నారు. టీబీఎంలో ఉండే కట్టర్ హెడ్‌ను ముక్కలుగా చేసి ఆ ప్రాం తంలోనే ఆ పూడ్చనున్నారు. ఈ పని పూర్తయితేనే రెండో సొరం గంలో కృష్ణా జలాలు ప్రవహించే అవకాశం ఉంటుంది.

# గొడ్డలి పార్టీ మరో ఫేక్ ప్రచారం

- బ్రిడ్జ్ క్రీడపై నిరాధార ఆరోపణలు
- కేంద్ర ప్రభుత్వం రూపొందించిన
- అధికారిక జాబితాలోనే ఆ క్రీడ ఉంది
- అందుకు అనుగుణంగానే స్పోర్ట్స్ కోటాలో చేర్చాం
- అయినా ఆ క్రీడ కింద ఎవరినీ రిక్రూట్ చేయలేదు
- వాస్తవాలను వెల్లడించిన ఏపీ ఫ్యాక్ట్ చెక్




అమరావతి(చైతన్యరథం): సోషల్ మీడియాలో 'మెగా డీఎస్సీ నియామకాలకు సంబంధించి ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా జాబితాలో 'బ్రిడ్జ్' క్రీడను చేర్చడంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచా రం ఏపీ ఫ్యాక్ట్ చెక్ స్పందించింది. అవి పూర్తిగా నిరాధార మైనవని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శ కాల మేరకు 'బ్రిడ్జ్' ఒక అధికారిక 'మైండ్ స్పోర్ట్'గా గుర్తింపు పొందింది. నిబంధనల ప్రకారం స్పోర్ట్స్ కోటాలో కేటగిరీ-ఏ, కేటగిరీ-బీ విభాగాల కింద క్రీడలను గుర్తించి జాబితా రూపొం దించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన అధికారిక క్రీడా విభాగాల జాబితాలోనే 'బ్రిడ్జ్' ఉన్నందున దానిని స్పోర్ట్స్ కోటాకు పరిగణనలోకి తీసుకోవడం అనేది నిబంధనలకు అనుగు ణంగానే జరిగింది. వాస్తవానికి చూస్తే స్పోర్ట్స్ కోటాలో ఆటల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం తయారు చేయదు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జాబితాలో ఉన్న ఆటలలో ప్రావీణ్యం ఉన్న వారినే స్పోర్ట్స్ కోటా కింద పరిగణనలోకి తీసుకుంటారు. కేంద్ర ప్రభు త్వం రూపొందించిన అధికారిక క్రీడా విభాగాల జాబితాలోనే 'బ్రిడ్జ్' ఉన్నందున దానిని స్పోర్ట్స్ కోటాకు పరిగణనలోకి తీసుకోవడం అనేది నిబంధనలకు అనుగుణంగానే జరిగింది. అయితే ఈ కోటా కింద డీఎస్సీ 2025లో ఎవరూ రిక్రూట్ కాలేదని వెల్లడిం చింది. కేంద్ర జాబితాలో ఉన్న అక్వాటిక్స్ (ఈత), ఆర్చరీ (విలు విద్య), అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, బేస్‌బాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, చెస్ (చదరంగం), క్రికెట్, సైక్లింగ్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, హాకీ, జుడో, కబడ్డీ, కయాకింగ్/ కానోయింగ్, ఖో ఖో, పారా-అథ్లెటిక్స్, పారా బ్యాడ్మింటన్, పారా స్పోర్ట్స్ (పారా స్పోర్ట్స్), పవర్‌లిఫ్టింగ్, రోలర్ స్కేటింగ్, రోయింగ్, సెయిలింగ్, షూటింగ్, సాఫ్ట్‌బాల్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, ట్రయాథ్లాన్, వాలీబాల్, బీచ్ వాలీబా ల్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, యోగాసన నుంచి మాత్రమే డీఎస్సీలో రిక్రూట్ అయ్యారని వెల్లడించింది. నిరుద్యోగ యువత ను తప్పుదోవ పట్టించేందుకు నిరాధారమైన ప్రచారం చేస్తున్నా రని వెల్లడించింది. ప్రజల్లో అశాంతిని ప్రేరేపించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించింది. ఇటువం టి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వ్యక్తులు, సోషల్ మీడియా, మీడియాపై చట్టపరమైన విచారణ చేపట్టి ఐటీ చట్టం, ఇతర నిబంధనల ప్రకారం కఠిన శిక్షలు అమలు చేస్తామని హెచ్చరించింది.

### మెరిట్ లిస్టుల డిలీట్ చేశారన్నది అబద్ధం

డీఎస్సీ 2025పై ప్రభుత్వం స్పష్టమైన వివరణలు ఇచ్చినా కొందరు తప్పుడు ప్రచారం ఆపడం లేదు. మెరిట్ ప్రకారం ఇవ్వా ల్సిన పోస్టులను పక్కదోవ పట్టించారనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. మెరిట్ లిస్టులు ఆన్‌లైన్‌లో డిలీట్ చేశారనే తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారు. ఎక్కడా లాంటివి జరగలేదని, ఆన్‌లైన్‌లో సమాచారం అంతా ఉందని అధికారులు చెప్పినా పట్టించుకోకుండా తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ ఫ్యాక్ట్ చెక్ హెచ్చరించింది.

# తెలంగాణలోనూ జనసేన పోటీ చేస్తుంది

- కదనరంగంలోకి దిగుతా..ప్రజల మధ్యే తిరుగుతా
- సమస్యలపై మాట్లాడతా..అన్యాయాలను ఎదుర్కొంటాం
- నా తెలంగాణ భారతదేశంలో అంతర్భాగం
- రాకూడదని తీర్మానం చేస్తే నేనేంటో చూపిస్తా
- హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలతో పాటు
- వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తాం
- ప్రాంతాల మధ్య ఎంతకాలం ద్వేషం రగిలిస్తారు?
- చెరువు కబ్జా అని తేలితే స్వచ్ఛందంగా అప్పగిస్తాను
- గద్దర్ విగ్రహం ఆంధ్రప్రదేశ్‌లోనూ ఏర్పాటు చేస్తాం
- హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో పవన్‌కళ్యాణ్



హైదరాబాద్ (చైతన్యరథం): తెలంగాణలో ప్రస్తుతం జరుగు తున్న రాజకీయాలు, దేశ సమగ్రతను దెబ్బతీసే కుయుక్తులు చూస్తుంటే కచ్చితంగా తెలంగాణలో కూడా జనసేన పార్టీ ఉండా లి..తెలంగాణలోనూ జనసేన పోటీ చేస్తుంది.. ఇక నుంచి తెలంగాణలో జనసేన పార్టీ రాజకీయంగా పోరాడుతుందని జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పష్టం చేశా రు. స్వయంగా తెలంగాణ కదనరంగంలోకి తానే దిగుతానని, ప్రజల మధ్య తిరుగుతానని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల మీద, ఆకాంక్షల సాధనకు జనసేన పార్టీ బలమైన పోరాటం చేస్తుందని, వచ్చే హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలతో పాటు, వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సైతం పోటీ చేస్తుందని చెప్పారు. ప్రతి సమస్య మీదా మాట్లాడతాం... ప్రతి అన్యాయాన్నీ ఎదు ర్కొంటామని స్పష్టం చేశారు. నా తెలంగాణ భారతదేశంలో అంతర్భాగమని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో జనసేన తరఫున నిర్వహించ తలపెట్టిన తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సమావేశం సాధక్‌ల సమ్మేళనానికి తెలంగాణ ప్రభుత్వం అనుమ తి ఇవ్వలేదు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం హైదరా బాద్ జూబ్లీ హిల్స్‌లోని తన నివాసం వద్ద తెలంగాణ రాష్ట్ర జనసేన నాయకులతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. తెలంగాణలో పొత్తులతో ముందుకు వెళ్తామా? ఒంటరిగా వెళ్తామా అనేది కాలం నిర్ణయిస్తుంది. పార్లమెంటు తలుపులు మూసి సభ్యులను బయటకు నెట్టి తెలంగాణను ప్రకటించడాన్ని మాత్రమే జనసేన పార్టీ తప్పు పట్టింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఏనాడూ జనసేన వ్యతిరేకం కాదని తెలిపారు.

### ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారు

తెలంగాణ, ఆంధ్ర ప్రజల ప్రజల మధ్య ప్రతిసారీ విద్వేషాలు రెచ్చగొట్టేలా కొందరు నాయకులు మాట్లాడుతున్నారు. రాష్ట్ర విభజనకు తాను వ్యతిరేకం అని చెప్పిన వైఎస్ రాజశేఖరరెడ్డి బతికి ఉన్నపుడు ఈ నాయకులు నోళ్లు ఎందుకు మూతపడ్డాయి. నాయకులు తప్పు చేస్తే నాయకులను అనాలి కానీ, ప్రతిసారి ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకుందామనే రాజకీయాలు పోవాలని హితవుపలికారు. ప్రతిసారీ పవన్‌కళ్యాణ్‌ను తెలంగాణ రానివ్వం. తెలంగాణలో తిరగనివ్వం అంటుంటారు. తెలంగాణ ఏమైనా మీ అయ్య జాగీరా? ప్రశ్నించారు. తెలంగాణ, ఆంధ్ర ప్రజల మధ్య దూరం పెంచేలా, విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడరాదని హెచ్చరించా రు. దాడులకు భయపడం.. బాంచన్ మీ కాల్మొక్తా అనే వాడిని కాదు.. ధైర్యంగా నిలబడతాం. పవన్‌కళ్యాణ్ అనే వాడు తెలంగా ణకు రాకూడదని అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేస్తే అప్పుడు నేనేంటో చూపిస్తానని తెలిపారు. ఓ విశ్లేషకుడు మేము అనని మాటలను అంటే దాన్ని ఖండించాం. అమిత్ షాపై కామెంట్స్ చేస్తే సమాధానం చెప్పకూడదా? అని ప్రశ్నించారు.

### కబ్జా అని తేలితే స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగిస్తా

చెరువు కబ్జా అంటూ కొత్త విషయాన్ని తీసుకొచ్చారు. కోడి చెరువు కబ్జా చేశానంటూ సోషల్ మీడియా వేదికగా ప్రచారం మొదలుపెట్టారు. నేను సవాల్ చేసి చెబుతున్నా.. తెలంగాణ ప్రభుత్వం ఆ మొత్తం సర్వే చేయించి తప్పు జరిగి ఉంటే కనుక స్వచ్ఛందంగా ఆ భూమిని నేను అప్పగిస్తాను. అక్కడ నాకు గోశాల మాత్రమే ఉంది. సుమారు 50 నుంచి 60 ఆవులు ఉంటాయి. మేత కోసం గడ్డి కోస్తారు. దశాబ్దాల క్రితం తీసుకున్న భూమి. అక్కడ ఎలాంటి తప్పు జరిగినట్లు ప్రభుత్వం తేల్చినా ఆ భూమిని తీసుకోవచ్చు. నాకు అభ్యంతరం లేదని తెలిపారు.

### కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి

ప్రాంతీయ వాదం పేరిట ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొడుతున్న కొన్ని శక్తుల పట్ల కేంద్రం దృష్టి పెట్టాలి. వీరిని ఇలాగే వదిలేస్తే జనగణమన, వందేమాతరం కూడా పాడేది లేదని చెబుతారు. కావాలని విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చుపెట్టే వారిని నియంత్రించేలా చొరవ తీసుకోవాలని అన్నారు. తెలంగా ణ, ఆంధ్ర ప్రజలను కలిపి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రధాన కారణం అయిన బూర్గుల రామకృష్ణారావు పేరును తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ను కలిపే రహదారికి పెట్టాలనేది నా

# ఊపందుకున్న కోటిపల్లి రైల్వేలైన్ పనులు




- రైల్వేస్టేషన్ సమీపంలో స్థలం సేకరణ
- మరో రెండు ప్లాట్‌ఫారాలకు ప్రతిపాదన
- రెండు నెలల్లో పాత భవనం తొలగింపు
- కొత్తస్టేషన్ వరకు ట్రాక్‌ల పొడిగింపు

నరసాపురం (చైతన్యరథం): కోటిపల్లి రైల్వేలైన్ పనులు ఊపందు కున్నాయి. ఇప్పటికే జిల్లాలో ఈ రైల్వే లైన్ కోసం 121 ఎకరాలను సేకరించారు. తాజాగా మరో రెండున్నర ఎకరాలను స్టేషన్ సమీపంలో గుర్తించారు. ఈ రైల్వే లైన్ కోసం స్టేషన్‌లో కొత్తగా రెండు ప్లాట్‌ఫారాలను నిర్మిస్తున్నారు. ఇందుకు అవసరమైన స్థలాన్ని స్టేషన్ సమీపంలో ఎంపిక చేశారు. అక్కడ ఉన్న నివాసాలకు ఇప్పటికే మార్కింగ్ చేశారు. రాష్ట్ర విభజన తరువాత పట్టాలెక్కిన ఈ ప్రాజెక్టు గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా పడకేసింది. ఒప్పందంలో భాగంగా నిర్మాణ వ్యయంలో 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడంతో పనులు పెండింగ్ పడ్డాయి. ఇటు కోనసీమలో భూ సేకరణలో కొంత మంది రైతులు కోర్టును ఆశ్రయించారు. ఈ కారణంగా కూడా ఈ పనులు ముం దుకు సాగలేదు. తాజాగా రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, కోర్టు రైల్వేకు అనుకూలంగా తీర్పును ఇవ్వడంతో పనులు ఊపందు కున్నాయి. జిల్లాలో 11 కిలోమీటర్ల మేర నిర్మించే కొత్త రైల్వేలైన్‌కు ఇప్పటికే భూ సేకరణ పూర్తయింది. అందులో మండలంలో 53, యలమంచిలి మండలంలో 66ఎకరాలను సేకరించి రైతులకు పరి హారం ఇచ్చారు. రైల్వే లైన్‌కు మార్కింగ్ కూడా చేశారు. అయితే రైల్వేస్టేషన్ సమీపంలో భూ సేకరణ పెండింగ్ పడింది. నివాసాలు ఉండటంతో అప్పట్లో మార్కింగ్ వేయలేదు. తాజాగా ప్లాట్‌ఫారాలు నిర్మించాల్సి ఉండటంతో మార్కింగ్ వేసి అవసరమైన స్థలాలను గుర్తించారు.

### కోటిపల్లి లైన్‌తో కొత్త ప్లాట్‌ఫారాలు

ప్రస్తుతం నరసాపురం స్టేషన్‌లో మూడు ప్లాట్ ఫారాలు ఉన్నాయి. గతంలో రెండు మాత్రమే ఉండేవి. విజయవాడ డబ్లింగ్‌తో కొత్త లైన్ ఏర్పడింది. దీంతో మూడో ప్లాట్‌పారం వచ్చింది. తాజాగా కోటిపల్లి పనులు కూడా వేగం అందుకోవ డంతో అదనంగా మరో రెండు ప్లాట్‌ఫారాలను ఏర్పాటు చేసేందు కు రైల్వే రెడీ అవుతోంది. ఇవి ప్రస్తుతం ఉన్న పాత స్టేషన్ ముందుభాగంలో రానున్నాయి.

### మరో రెండు నెలల్లో కొత్తస్టేషన్ వరకు ట్రాక్‌లు

అమృత్ భారత్ నిధులు రూ.30 కోట్లతో రైల్వే చేపట్టిన కొత్త రైల్వేస్టేషన్ల నిర్మాణం చివరి దశకు చేరింది. త్వరలో ఈ ఆధునిక స్టేషన్ ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. ఇది ప్రారం భం కాగానే ప్రస్తుతం ఉన్న పాత భవనాన్ని తొలగించాలని రైల్వే యోచిస్తున్నది. ఇదే జరిగితే ప్రస్తుతం ఉన్న ట్రాక్‌ను కొత్త రైల్వే భవనం వరకు పొడిగించనున్నారు. అదే సమయంలో కోటిపల్లి రైల్వే లైన్ కోసం నిర్మించే రెండు ట్రాక్‌లు కూడా కొత్త స్టేషన్‌లో ఏర్పడనున్నాయి. దీంతో నరసాపురం స్టేషన్ ప్లాట్‌ఫారంల సంఖ్య ఐదుకు పెరుగుతుంది.

చైతన్యరథం

# పేదల సొంతింటి కలలపై గొడ్డలి వేటు



- 2014-19 మధ్య శాంక్షన్ అయిన 4.73 లక్షల ఇళ్ల రద్దు
- 2.73 లక్షల ఇళ్లకు రూ.920 కోట్లు ఎగనామం
- 2019-24 మధ్య నిలిచిపోయిన ఇళ్లు 14.02 లక్షలు
- అమలు కాని జగన్ నవరత్నాల హామీ
- జగన్ పాలనలో పూర్తిచేసిన ఇళ్లు 6.13 లక్షల ఇళ్లే
- రాష్ట్రవాటా కింద లబ్ధిదారులకు ఇచ్చింది రూ.30 వేలే
- చాలీచాలని నిధులతో పేదవారిని మోసం చేసిన జగన్‌లి
- 22 లక్షల ఇళ్లు కట్టామంటూ కట్టుకథలు, ఫేక్ ప్రచారాలు

ప్రతి పేదవాడు కనే కల సొంతిల్లు. తిన్నా, తినకున్నా సొంతిం టిలో ఉంటే చాలు అనుకోవడం పేదవారి మనస్తత్వం. రాష్ట్ర ప్రభుత్వం సొంతింటి కలలను నెరవేరుస్తుందని గంపెడు ఆశలతో ఉంటారు. ప్రతి పేదవారికి కూడు, గూడు, గుడ్డ ఇవ్వాలనే సిద్ధాం తాలతో కొన్ని ప్రభుత్వాలు పనిచేస్తే...మరికొన్ని ప్రభుత్వాలు పేదవారికి పప్పు, బెల్లాలు పంచి తమను పేదవారి మనసుల్లో గొప్పవారిగా చిత్రీకరించుకోవాలని ఆలోచిస్తాయి. ఈ రెండు ప్రభుత్వాలకు మధ్య వ్యత్యాసాన్ని వర్ణించేందుకు 2014-19 మధ్య కాలంలోని చంద్రబాబు ప్రభుత్వం, 2019-24 మధ్య జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. ఎందు కంటే పేదవారి సొంతింటి కలలను నెరవేర్చాలనే ఉద్దేశంతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనపు ఆర్థికసాయం చేసి ఇళ్లను చంద్రబా బు మంజూరు చేస్తే..ఆ ఇళ్లను అర్థాంతరంగా నిలిపేయండి అని అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదేశాలు జారీ చేసిన చరిత్ర జగన్‌రెడ్డిది. పేదవారి సొంతింటి కలలపై ఒక్క మాటతో గొడ్డలి వేటు వేసి, మోసం చేసిన వ్యక్తి జగన్.

## 22 లక్షల ఇళ్లు కట్టామంటూ ఫేక్ ప్రచారం

జగన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో పూర్తిచేసింది కేవలం 6.13 లక్షల ఇళ్లు మాత్రమే. కానీ ఇటీవల తన పార్టీ అధికారిక వెబ్ సైట్‌లో అప్లోడ్ చేసిన "ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలం టే" అనే బుక్‌లెట్‌లో తన ఐదేళ్ల పాలనలో 22 లక్షల ఇళ్లు నిర్మిం చానని పేర్కొన్నారు. వాస్తవానికి అసలు ఏ మాత్రం దరిదాపుల్లో లేని విధంగా జగన్ పేదల సొంతింటి కల నెరవేర్చే విషయంలో విష ప్రచారం చేసుకుంటున్నాడు. తన ఐదేళ్ల పాలనలో సొంతింటి కల నెరవేరక తీవ్ర నిరాశకు గురైన విషయాన్ని బయటకు పొక్కకుండా ఉండేందుకు ఈ విధమైన ఫేక్ ప్రచారానికి జగన్ రెడ్డి, వైసీపీ తెరతీసింది. తమకు బిల్లులు చెల్లించకుండా టీడీపీ పాలనలో మంజూరైన ఇళ్లను ఎందుకు రద్దు చేశారంటూ అడుగు తున్న పేదలకు సమాధానం చెప్పాల్సివస్తుందనే భయంతో జగన్ ఈ విధంగా తాను చేయని పనులను అధికమొత్తంలో చేసినట్లు నమ్మించేందుకు ఇలాంటి ఫేక్ ప్రచారాలు చేస్తున్నాడు. తన ఐదేళ్ల పాలనలో 20.15 లక్షల ఇళ్లు మంజూరు చేసి వాటిలో 6.13 లక్షల ఇళ్లే పూర్తి చేసి, చాలీచాలని డబ్బులతో 14.02 లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిలిచిపోయేలా చేసిన జగన్ ఈ వాస్తవాలన్నింటినీ సమాధి చేయాలని చూస్తున్నాడు. ఇలాంటి ఫేక్ ప్రచారాల పట్ల రాష్ట్ర ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## 4.36 లక్షల ఎన్టీఆర్ హౌసింగ్ స్కీమ్ ఇళ్లు రద్దు

30-05-2019న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన జగన్‌రెడ్డి 2019 జూలై 2న గృహనిర్మాణ శాఖపై నిర్వహించిన తొలి సమీక్షా సమావేశంలో 2014-19 మధ్య కాలంలో శాంక్షన్ అయిన 4,36,907 ఇళ్లను అర్థాంతరంగా రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అప్పటి వరకు సొంతిల్లు కట్టుకుని, తమ కలలను నెరవేర్చుకుందామ నుకున్న పేదవారి ఆశలు అడియాశలు అయ్యాయి. తమ ఇళ్లు ఎందుకు రద్దు అయ్యాయో కూడా తెలియని దుస్థితి సదరు పేదవారిది. 2019 ఎన్నికల్లో వైసీపీ తమ మేనిఫెస్టోలో పేదలం దరికీ ఇళ్లు అనే హామీని ప్రధానంగా పొందుపర్చారు. ఇల్లు లేని పేదలందరికీ పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలు చూడకుండా పక్కా ఇళ్లు కట్టిస్తామని, ఐదేళ్లలో 25 లక్షల పక్కా ఇళ్లు కట్టిస్తా మని చెప్పి పేదవారిని నమ్మించి అధికారంలోకి వచ్చారు. పేదవారి సొంతింటి కలను నెరవేర్చడానికి రూ.2 లక్షలు నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరేలా చేస్తామని జగన్ తన 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు హామీలు ఇచ్చారు. కొత్తగా ఇళ్లు కట్టించే సంగతి పక్కన పెడితే చంద్రబాబు సర్కార్‌లో శాంక్షన్ అయిన ఇళ్లను రద్దు చేయడంతో పేదవారు అవాక్కయ్యారు.





1.వైసీపీ 2019 మ్యానిఫెస్టోలో ఇళ్ల గురించి :

**పేదలందరికీ ఇళ్ళు**

- ఇల్లు లేని పేదలందరికీ పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలు చూడకుండా పక్కా ఇళ్ళు కట్టిస్తాం.
- ఐదేళ్ళలో 25 లక్షల పక్కా ఇళ్ళు కట్టిస్తాం.
- ఇళ్ళ స్థలాలు లేని నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు ఇస్తాం. వారిపేరునే రిజిస్ట్రేషన్ చేస్తాం. ఇళ్ళు కూడా కట్టిస్తాం.
- ఇల్లు ఇచ్చే రోజునే ఆ ఇంట్లోని అక్క చెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్.
- అంతే కాదు డబ్బు అవసరమైతే అదే ఇంటి మీద పావలా వడ్డీకే రుణం వచ్చేట్లుగా బ్యాంక్‌లతో మాట్లాడుతాం.

రూ. 2 -5 లక్షలు

## 2.73 లక్షల మంది పేద లబ్ధిదారులకు రూ.920 కోట్లు ఎగనామం

పేదవారి సొంతింటి కలను నెరవేరుస్తాను, కులం, మతం, వర్గం, వర్ణం చూడకుండా అందరికీ ఇళ్లు ఇస్తామని చెప్పిన జగన్మోహన్ రెడ్డిని పేదవారు గుడ్డిగా నమ్మారు. కానీ పేదవారి నమ్మకాన్ని ముఖ్యంత్రి పీఠం ఎక్కిన రెండు నెలల్లోనే వమ్ము చేసిన చరిత్ర జగన్మోహన్ రెడ్డిది. 2019 జూలై 2న గృహనిర్మాణశాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన జగన్ చంద్రబాబు పాలనలో నిర్మించిన ఇళ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు నిలిపివేయండి అని అధికారులకు ఆదేశాలు జారీ చేశా రు. దీంతో వివిధ దశల్లో అప్పులు చేసి చేతి డబ్బులు పెట్టుకుని ఇళ్లు నిర్మించుకున్న పేదవారు పెండింగ్ బిల్లుల కోసం ఎదురు చూపులకు పరిమితం కావాల్సి వచ్చింది. జగన్ తీసుకున్న నిర్ణ యంతో పేదవారు అప్పులపాలయ్యారు. 2,73,709 మంది లబ్ధిదారులకు జగన్ ప్రభుత్వం రూ.919.82 కోట్లు పెండింగ్ బిల్లులు ఎగ్గొట్టి పేదవారిని నిట్టనిలువునా మోసం చేసింది.

### జిల్లాల వారీగా లబ్ధిదారులు, పెండింగ్ బిల్లులు

| క్ర.స. | జిల్లా | లబ్ధిదారుల సంఖ్య | పెండింగ్ బిల్లులు(కోట్లలో) |
|---|---|---|---|
| 1 | శ్రీకాకుళం | 15,592 | 50.35 |
| 2 | విజయనగరం | 6,252 | 18.89 |
| 3 | పార్వతీపురం మన్యం | 3,706 | 12.17 |
| 4 | అల్లూరి సీతారామరాజు | 3,906 | 13.83 |
| 5 | విశాఖపట్నం | 1,663 | 4.64 |
| 6 | అనకాపల్లి | 11,163 | 36.00 |
| 7 | కాకినాడ | 12,789 | 45.16 |
| 8 | అంబేద్కర్ కోనసీమ | 14,377 | 57.53 |
| 9 | తూర్పుగోదావరి | 10,245 | 40.00 |
| 10 | పశ్చిమ గోదావరి | 12,117 | 40.79 |
| 11 | ఏలూరు | 11,196 | 41.12 |
| 12 | కృష్ణా | 9,808 | 29.57 |
| 13 | ఎన్టీఆర్ | 8,234 | 24.40 |
| 14 | గుంటూరు | 7,305 | 20.93 |
| 15 | బాపట్ల | 8,321 | 28.24 |
| 16 | పల్నాడు | 14,662 | 46.43 |
| 17 | ప్రకాశం | 13,740 | 48.15 |
| 18 | శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు | 11,993 | 40.28 |
| 19 | తిరుపతి | 11,788 | 39.06 |
| 20 | చిత్తూరు | 13,237 | 47.19 |
| 21 | అన్నమయ్య | 10,313 | 36.61 |
| 22 | వైఎస్ఆర్ కడప | 9,525 | 29.78 |
| 23 | అనంతపురం | 14,178 | 45.10 |
| 24 | శ్రీసత్యసాయి | 11,124 | 32.04 |
| 25 | నంద్యాల | 14,621 | 49.89 |
| 26 | కర్నూలు | 11,854 | 41.64 |
| | **మొత్తం** | **2,73,709** | **919.82కోట్లు** |

## 25 లక్షల ఇళ్ల హామీ గాలికి

జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో పేదవారికి 25 లక్షల ఇళ్లు నిర్మిస్తామని 2019 ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పి పేదవారిని నమ్మించారు. జగన్ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఐదేళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వం ఏపీకి 20.15 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ఈ ఇళ్లకు కేంద్రం తన వాటాగా రూ.1.50 లక్షలు ఇచ్చింది. దీనికి అదనంగా జగన్‌రెడ్డి కేవలం రూ.30 వేలు మాత్రమే ఇచ్చి లబ్ధిదారులను మోసం చేశాడు. చాలీచాలని డబ్బులు ఇవ్వడం వల్ల పేదవారు తీవ్ర నిరాశకు గురయ్యారు. జగన్ సీఎం అయితే సొంతింటి కల నెరవేరుతుందని నమ్మిన పేదవారికి సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. జగన్ ఇచ్చిన చాలీ చాలని డబ్బులకు మరిన్ని డబ్బులను లబ్ధిదారులు అప్పు చేసి సొంత గూడును నిలబె ట్టుకున్నారు. జగన్ ప్రభుత్వంలో మంజూరు చేసిన 20.15 లక్షల ఇళ్లలో పూర్తయిన ఇళ్లు కేవలం 6.13 లక్షల ఇళ్లు మాత్రమే. మిగిలిన 14.02 లక్షల ఇళ్లు వివిధ దశల్లో ఆగిపోయాయి. కొన్ని ఇళ్లు అయితే అసలు శాంక్షన్ దశలోనే నిలిచిపోయాయి. ఆ వివరాలు ఇలా ఉన్నాయి...

| ఇళ్లు నిలిచిపోయిన దశ | నిలిచిపోయిన ఇళ్ల సంఖ్య |
|---|---|
| బీబీఎల్ | 2.87 లక్షలు |
| బీఎల్ | 3.22 లక్షలు |
| ఆర్ఎల్ | 1.50 లక్షలు |
| ఆర్‌సీ | 1.28 లక్షలు |
| మొదలుపెట్టని ఇళ్లు | 5.15 లక్షలు |
| మొత్తం | 14.02 లక్షలు |

## యూనిట్ విలువ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలు ఎక్కడ?


పేదలకు కట్టించే ఇళ్ల ద్వారా ఒక్కొక్క ఇంటికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేస్తామని జగన్‌రెడ్డి తన 2019 మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఈ విధంగా పేదవారిని నమ్మించారు. కానీ అధికారంలోకి వచ్చాక 2014-19 మధ్య ఇచ్చిన యూనిట్ విలువ కంటే తక్కువ ఇచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీలను మోసం చేశాడు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.1.50 లక్షలకు కేవలం రూ.30 వేలు మాత్రమే రాష్ట్ర వాటాగా ఇచ్చి యూనిట్ విలువ రూ.1.80 లక్షలు మాత్రమే జగన్ ప్రభుత్వం పేదలకు అందించింది. కానీ పేదలకు ఇచ్చిన హామీ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలు ఇంటి నిర్మాణా నికి ఇస్తామని, అవసరమైతే ఇంటి నిర్మాణానికి పావలా వడ్డీ రుణాలు ఇప్పిస్తామన్న హామీలు అన్నీ గాలిలో కలిపేశారు. దీనివల్ల జగన్‌ను నమ్ముకున్న పేద ప్రజలు ఘోరంగా మోసపోయారు.



## విభజన నుంచి స్వర్ణాంధ్ర వరకు..

# అభివృద్ధికి చంద్రబాబు మార్గదర్శకం

నిన్నటితో ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి 12 ఏళ్లు పూర్తయ్యాయి. 2014 జూన్ 2న రాష్ట్రం విడిపోయినప్పుడు ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఏమిటో ప్రతిఒక్కరికీ గుర్తుంటుంది. రాజధాని లేదు. ప్రధాన ఆదాయ వనరైన హైదరాబాద్ లేదు. పెద్ద పరిశ్రమలు లేవు. భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియని అనిశ్చితి నెలకొంది. అలాంటి పరిస్థితుల్లో కొత్త రాష్ట్రాన్ని నిలబెట్టడం, అభివృద్ధి దిశగా నడిపించడం అంత సులభమైన పనికాదు. అలాంటి సమయం లో సవాళ్లను అవకాశాలుగా మార్చడం కొందరు నాయకులకే సాధ్యం అవుతుంది. ఆంధ్రప్రదేశ్ విషయంలో ఆ పాత్రను పోషిం చిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు. రాష్ట్రానికి కేవలం పరిపాలన మాత్రమే కాదు, ఒక విజన్ కూడా అవసరమని ఆయ న నమ్మారు. అందుకే విభజన తర్వాత నుంచే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అడుగులు వేశారు.




**కొత్త రాష్ట్రానికి కొత్త దిశ**

విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు అత్యంత అవసరమైనది ఒక దిశ. ఆ దిశను చూపించడానికి చంద్రబాబు అమరావతి రాజధా ని నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రపంచస్థాయి రాజధాని నిర్మా ణం ద్వారా పెట్టుబడులు, ఉపాధి, అభివృద్ధి రాష్ట్రానికి తీసుకు రావాలన్న ఆలోచన చేశారు. అదే సమయంలో పోలవరం ప్రాజెక్టును రాష్ట్ర జీవనాడిగా భావించి ముందుకు తీసుకెళ్లారు. సాగునీరు, తాగునీరు, విద్యుత్ అవసరాలకు దీర్ఘకాలిక పరిష్కా రం చూపే ప్రాజెక్టుగా దాన్ని అభివృద్ధి చేశారు. విభజనతో నష్టపో యిన రాష్ట్రానికి మౌలిక సదుపాయాలు కల్పించడమే అభివృద్ధికి పునాది అని ఆయన నమ్మకం.

**పెట్టుబడులు వస్తేనే యువత భవిష్యత్**

చంద్రబాబు రాజకీయ తత్వంలో ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. యువతకు ఉద్యోగాలు రావాలంటే పరిశ్రమలు రావాలి. పరిశ్రమలు రావాలంటే పెట్టుబడులు రావాలి. అందుకే ఆయన ఎప్పుడూ పెట్టుబడులపై దృష్టి పెడతారు. కియా వంటి అంతర్జాతీయ కంపెనీలను రాష్ట్రానికి తీసుకురావడం నుంచి నేటి భారీ పెట్టుబడి ఒప్పందాల వరకు అదే ఆలోచన కనిపిస్తుంది. 2024 తర్వాత రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి ప్రతి పాదనలు రావడం, విశాఖను డేటా సెంటర్లు, కృత్రిమ మేధస్సు, గ్రీన్ ఎనర్జీ రంగాలకు కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరగడం ఈ దిశలో కీలక పరిణామాలు. పెట్టుబడులు అంటే కేవలం సంఖ్యలు కాదు. అవి లక్షలాది యువతకు ఉద్యోగ అవకాశాలు. వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా. రాష్ట్రానికి దీర్ఘకాలిక అభివృద్ధికి బలమైన పునాది.

**మహిళల శక్తినే రాష్ట్ర బలంగా మార్చే ఆలోచన**

సమాజ అభివృద్ధి మహిళల అభివృద్ధితోనే సాధ్యమని చంద్రబాబు ఎప్పటి నుంచో చెబుతున్నారు. అందుకే మహిళల సాధికార తకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం వంటి కార్యక్రమాలు మాత్రమే కాదు, రాజకీయంగా కూడా మహిళలకు పెద్దపీట వేయాలని నిర్ణయిం చారు. 2029 ఎన్నికల్లో 33 శాతం టిక్కెట్లు మహిళలకు కేటాయి స్తామని ప్రకటించడం దేశ రాజకీయాల్లోనే ఒక కీలక నిర్ణయంగా భావించవచ్చు. మహిళలు కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులు కాకుండా, నాయకులుగా ఎదగాలన్న ఆలోచన ఆయన విజన్‌లో స్పష్టంగా కనిపిస్తుంది.

**స్వర్ణాంధ్ర 2047.. రేపటి తరాల కోసం**

చంద్రబాబు గురించి మాట్లాడేటప్పుడు ఎక్కువగా వినిపించే పదం "విజన్". ఎందుకంటే ఆయన ఈరోజు గురించి మాత్రమే కాదు, 20-25 ఏళ్ల తర్వాత రాష్ట్రం ఎలా ఉండాలన్న దాని గురించి కూడా ఆలోచిస్తారు. అందుకే "స్వర్ణాంధ్ర 2047" లక్ష్యాన్ని ప్రకటించారు. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, భారీ పెట్టుబడులు, అధిక ఉపాధి అవకాశాలు, మహిళా సాధికా రత, సాంకేతిక అభివృద్ధి, మెరుగైన జీవన ప్రమాణాలు..ఇవన్నీ కలిపి ఒక అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలన్నదే ఈ విజన్ సారాంశం. 12 ఏళ్ల క్రితం విభజనతో నిరాశలో ఉన్న రాష్ట్రం, నేడు ఆశతో భవిష్యత్తు వైపు చూస్తోంది. ఆ ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఉన్నా రాష్ట్రానికి ఒక స్పష్టమైన దిశను, ఒక దీర్ఘ కాలిక లక్ష్యాన్ని చూపించిన నాయకుడిగా చంద్రబాబు నిలిచారు. స్వర్ణాంధ్ర అనేది కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమం కాదు. ప్రతి ఆంధ్రుడి కల. ఆ కలను సాకారం చేసే ప్రయాణానికి మార్గదర్శ కంగా నిలుస్తున్నది చంద్రబాబు విజన్.

**- శాంతి జలసూత్రం, అనలిస్ట్,**
**తెలుగుదేశం పార్టీ నాలెడ్జ్ సెంటర్**

# పాపిష్టి పాలనకు సమాధి కట్టిన రోజు!

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు.మంచి పాలకులను ఎన్నుకొనే స్వేచ్ఛ ప్రజలకే వుంది.ఐదేళ్లపాటు అహంకారం తలకెక్కి, చట్టాలను చుట్టాలుగా మార్చుకుని, వ్యవస్థలను నిర్వీర్యం చేసిన పాలకులకు ప్రజలు ఏ విధంగా బుద్ధి చెబుతారో నిరూపించిన చారిత్రాత్మక రోజు 2024 జూన్ 4..ఆంధ్రాభ్యుదయానికి అంకురార్పణ జరిగిన రోజు, అహంకారానికి,అరాచకానికి,అవినీతికి సమాధి కట్టిన రోజు. పాపిష్టి పాలనకు సమాధి కట్టి నవ్యాంధ్ర ప్రగతికి బాటలు వేసిన రోజు..భారత ప్రజాస్వామ్యంలో చీకటి అధ్యాయానికి ముగింపు పలికిన దినం.2019 ఎన్నికల్లో తాము మోసపోయామని గ్రహించిన ప్రజలు 2024లో తమ తీర్పును తిరగ రాశారు. తమను పాలించే పాలకులు ఎలా ఉండకూడదో తమ తీర్పు ద్వారా రుజువు చేశారు.ఎలాంటి వారు ముఖ్యమంత్రి కాకూడదో ఆంధ్రప్రదేశ్ ప్రజలు స్పష్ట మైన తీర్పు ఇచ్చారు. అధికారం ఉందని ఉచ్ఛనీచాలు మరచి ప్రవర్తించిన రాజకీయ పార్టీని ప్రజలు రాజకీయంగా మట్టుబెట్టారు.విద్వేష, విధ్వంస రాజకీయాలకు ప్రజలు బుద్ధి చెప్పారు..గతంలో ఎన్నడూలేని విధంగా జిల్లాలకు జిల్లాలు తుడిచిపెట్టుకు పోయాయి. ధర్మానికి- అధర్మానికి, న్యాయానికి- అన్యాయానికి మధ్య జరిగిన యుద్ధంలో ధర్మం, న్యాయానిదే గెలుపు అని రుజువు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో 2024 జూన్ 4 చారిత్రాత్మక రోజుగా నిలిచిపోతుంది. ఐదేళ్లపాటు సాగిన అరాచక, విధ్వంసక, ప్రతీకార రాజకీయాలకు ప్రజలు ఇచ్చిన అద్భుత తీర్పు.ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన ప్రభుత్వం ప్రజలనే శత్రువులుగా చూసినప్పుడు, అభివృద్ధి చేయాల్సిన పాలకులు విధ్వంసాన్ని ఎంచుకున్నప్పుడు, సంక్షేమం పేరుతో అప్పుల ఊబిలో రాష్ట్రాన్ని నెట్టడాన్ని జనం గ్రహించారు. సమయం చూసి తమ ఓటుతో తీర్పు చెప్పారు.2024 జూన్ 4 కొత్త ఆశలకు, కొత్త అవకాశాలకు, అభివృద్ధి రాజకీయాలకు నాంది పలికింది. రాష్ట్ర పునర్నిర్మాణం, పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగ కల్పన, మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి, రైతు సంక్షేమం,మహిళల అభివృద్ధి వంటి అంశాలపై ప్రజలు కొత్త ప్రభుత్వానికి బాధ్యతలను అప్పగించారు.ఓటర్లు సృష్టించిన ఈ నిశ్శబ్ద విప్లవంలో చంద్రబాబు చెప్పినట్లు ప్రజలు గెలిచారు, రాష్ట్రం నిలబడింది

2019 ఎన్నికల్లో గెలవగానే జగన్ గర్వాంధకారంలో కూరుకుపోయి అయిదేళ్ల పాటు ప్రజాస్వామ్యాన్ని నరికి పోగులు పెట్టినందుకు జగన్ రెడ్డి కి 11 సీట్లిచ్చి, ప్రతిపక్షానికి కూడా పనికిరారని తరిమేశారు ఆంధ్రా ప్రజలు.నా వెంట్రుక కూడా పీకలేరు అన్న నడమంత్రపు నాయకుడి అహంకారాన్ని జనం నేలకు దించారు.జూన్ 4 వ తేదీన ప్రజలు తిరస్కరించడాన్ని వెన్నుపోటు దినంగా గా చిత్రించి ప్రజలనే దోషులుగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నారు జగన్ రెడ్డి ..ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు దైవోపదేశం వంటిది.ప్రజలను వంచించిన పాలనకు జగన్ రెడ్డి చెల్లించిన తగిన మూల్యం అది..ప్రజలు తనకు వెన్నుపోటు పొడవలేదు లేదు,నమ్మి అధికారం ఇస్తే జగన్ రెడ్డే ప్రజలకు వెన్ను పోటు పొడిచారు. ప్రజలు 2019లో జగన్ పార్టీకి 151 సీట్లు ఇచ్చారు అది వారి నమ్మకం.అదే ప్రజలు 2024లో 164 స్థానాలను తెలుగుదేశం కూటమికి ఇచ్చారు.జగన్ పాలన పై నమ్మకం పోయింది.ఓటమికి కారణం తెలుసుకొనే ప్రయత్నం చేయకుండా ప్రజలే వెన్నుపోటు పొడిచారని ప్రచారం చేస్తూ ప్రజల తీర్పును అపహాస్యం చేయడం దురదృష్టకరం. ప్రజలు ఎప్పుడూ విజ్ఞతతో, అనుభవంతో ఓటు వేస్తారు. జగన్ ప్రజలను ఒకసారి మాత్రమే మోసం చేయవచ్చు కానీ పదే,పదే మోసం చేయ్యడం సాధ్యం కాదు. ప్రజల తీర్పును వెన్నుపోటుగా చూపడం జగన్ ముఠా ఆజ్ఞానానికి,అహంకారానికి నిదర్శనం.రెండేళ్లగా ప్రజల మౌలిక సమస్యలపై దృష్టి పెట్టకుండా, అసెంబ్లీకి రాకుండా ప్రజా సమస్యల పై మాట్లాడకుండా అప్పుడప్పుడు ప్రెస్ మీట్లు పెడుతూ వ్యక్తిగత విమర్శల చేస్తూ,వెన్ను పోటు అంటూ జగన్నాటకాలు ఆడుతున్నారు. ప్రజలకు అన్యాయం జరిగింది అనే కోణాన్ని ప్రజల్లో నాటాలని, నమ్మకద్రోహం అనే భావాన్ని జనంలో కల్పించాలని జగన్ వ్యూహం. ప్రజలు తనను ఎందుకు తిరస్కరించారో అర్థం చేసుకొని, ప్రజాస్వామ్య తీర్పును గౌరవించటం నిజమైన ప్రజాస్వామ్యం.జగన్ రెడ్డికి మళ్ళీ అధికారం ఇస్తే జరిగే పరిణామాలు ఏమిటో జనం అర్థం చేసుకొని విజ్ఞత ప్రదర్శించి విపత్తు నివారించుకొన్నారు.

ఐదేళ్ల వైసిపి పాలనలో అధ్వాన ఆర్థిక విధానాలతో ఆంధ్రప్రదేశ్ లో ఆర్థిక విధ్వంసం చేశారు, రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు తీసుకురాక పోగా,ఉన్న కంపెనీలను తరిమేశారు, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు.అభివృద్ధి నిలిపివేశారు,సాగునీటి ప్రాజెక్టులను పాడుపెట్టారు,పోలవరాన్ని గోదావరి లో ముంచారు. మూడు రాజధానుల ముసుగులో ఒక్క రాజధాని కూడా లేకుండా చేశారు.సంక్షేమం పేరుతో సంకెళ్లు వేశారు.ఒక చేత్తో పది రూపాయలు ఇచ్చి,మరో చేత్తో వంద రూపాయలు లాక్కునే బటన్ నొక్కుడు నాటకాలకు పాల్పడ్డారు.యువతకు ఉద్యోగాలు, రాష్ట్రానికి పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పనను గాలికి వదిలేశారు.సర్వ విధ సలహాదారులతో పాలనా మందిరం కిట,కిట లాడింది.కూర్చోవడానికో సలహా దారు,నిలుచోవడానికో సలహాదారు,అడుగుకో సలహాదారు లతో కీర్తి గాన కోవిదులతో సభా మందిరం మోతెక్కి పోయింది. నియంతృత్వ పోకడలతో, మూర్ఖపు చర్యలతో, దురహంకార ప్రవర్తనతో గత అయిదేళ్లు ఆంధ్రప్రదేశ్ అదోగతి పాలుచేశారు. అభివృద్ధిని గాలికి వదిలేసి,రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. గతంలో కొన్ని ప్రాంతాలకే పరిమిత మైన ఫ్యాక్షనిజం, సంస్కృతి, హింస, రక్తపాతం. ఆట విక ప్రవృత్తి, పగలు ప్రతీకారాలు ప్రతి ప్రాంతానికి విస్తరించాయి..ప్రశాంతతకు ఆల వాలమైన పచ్చని సీమలు సైతం పగలు ప్రతీకారాలతో భగ్గున మండాయి. ప్రజాస్వామ్యం అపహాస్యానికి గురైంది. నాగరికత మురికికాల్వల్లో కలిసిపోయింది.భూతుల రోత వికృత రూపం దాల్చడంతో వైసిపి రక్కసి మూకలను రాకాసి రాబందులను, భయంకర దోపిడిదారులను రాష్ట్రం పొలిమేర లకు తరిమికొట్టి చట్టసభలో ప్రతిపక్షహోదాసైతం దక్కని చరిత్రహీనులుగా మిగిల్చారు ప్రజలు. ప్రజాక్షేత్రంలో దుర్మార్గానికి దుష్ట సంస్కృతికి చోటు లేదని, ఎన్నికల్లో ప్రజలు ప్రదర్శించిన పరమాద్భుత వివేకానికి, చతురత పరిణతికి నిదర్శనంగా కారుచీకట్లో కాంతిరేఖ మెరిసి చంద్రోదయమైంది.

విషపూరితమైన జె బ్రాండ్ మద్యంతో ప్రజారోగ్యాన్ని పొట్టన పెట్టుకున్న. ఏపీని గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియా గా మార్చిన, ఇసుక, మట్టి. విలువైన ఖనిజ దోపిడీ, భూముల కబ్జాలతో రాష్ట్రాన్ని యదేచ్ఛగా కొల్లగొట్టిన జగన్ ముఠా ను ఏపీ ప్రజలు అధఃపాతాళానికి తొక్కారు.అధికార మధంతో ధర్మాన్ని విస్మరించి అధర్మ పరిపాలన చేసిన జగన్ రెడ్డి పై జనాగ్రహం కట్టలు తెంచుకొన్నది.గత ఎన్నికలలో 151 సీట్లు ఒక్క వైసిపినే గెలుచుకున్నది.అయిదు ఏళ్ళు గడిచే సరికి మధ్యన ఉన్న అయిదు అదృశ్యమై 11 సీట్లు మాత్రమే మిగిలాయి.యువత, రైతులు, ఉద్యోగులు, మహిళలు, విద్యావంతులు, వ్యాపారులు, మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి, ఉన్నత వర్గాలకు చెందిన ప్రజలు అవినీతి,అసమర్థ పాలనను చరమగీతం పాడారు.ప్రాంతాలతో నిమిత్తం లేకుండా ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ మొత్తం అన్ని ప్రాంతాలలో ఒకే విధమైన విజయాన్ని కూటమి సాధించింది. పాత 13 జిల్లాలలో 8 జిల్లాలలో వైసీపీ ఒక్క సీటు కూడా దక్కలేదు. కక్షసాధింపు రాజకీయాలను హర్షించబోమని ప్రజలు తిరుగులేని తీర్పు ఇచ్చారు.అయిదు కోట్ల ఆంధ్రులు అందించిన అద్భుత విజయం అది.చీకట్లు కమ్మిన సీమాంధ్రలో వెలుగులు నింపే చంద్రుడు చంద్రబాబే నని, కష్టాల సుడి గుండం నుండి తమను ఒడ్డుకు చేర్చే భాధ్యతను కూటమి ప్రభుత్వానికి కట్ట బెట్టిన ఆంధ్రా ఓటర్ల విజ్ఞత అభినంద నీయం.జగన్ అధికారం కోల్పోయి వైసిపి ఉనికే ప్రమాదంలో పడటంతో ఉక్రోషం,ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. వెన్నుపోటు అంటూ జగన్ ఎన్ని పిల్లి మొగ్గలు వేసినా జనం నమ్మరు.అబద్దాలతో అధికారంలోకి వచ్చి నిరంకుశ రాజ్యాన్ని ఏలిన జగన్ నేడు అమాయక ముఖం పెట్టి నేనేం తక్కువ చేసాను అంటూ మొసలి కన్నీరు కార్చడం సిగ్గు చేటు

**- నీరుకొండ ప్రసాద్**

## ఏపీలోని పలు జిల్లాల్లో పిడుగులు పడే అవకాశం



విశాఖపట్నం (చైతన్యరథం): వేసవి కాలం.. అందునా రోహిణి కార్తె కావడంతో ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలో రుతుపవనాల ప్రవేశానికి ఇంకా సమయం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో తీవ్రమైన ఎండలు, గాలిలో తేమ లేకపోవడంతోపాటు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అలాంటి వేళ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం ఉరుములు మెరుపులతోపాటు పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. విశాఖపట్నం, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, పార్వతీపురం మన్యం, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు విజయనగరం, విశాఖపట్నం, మన్యం అల్లూరి, అనకాపల్లి, ఏలూరు, ఎన్టీఆర్, అనకాపల్లితోపాటు ఉభయ గోదావరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. దీంతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు స్పష్టం చేసింది.

## ఏపీలో రెండు వారాల పాటు యోగాంధ్ర



అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఆంధ్రప్రదేశ్‌లో "యోగాంధ్ర – 2026" పేరుతో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' అనే విశిష్ట నినాదంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న వేడుకల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు జరుపుతున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి మంది... రైతులు, మహిళా స్వయం సహాయక బృందాలు, మత్స్య కారులు, గిరిజనులు, వివిధ సాంస్కృతిక కళాకారులు, యువజన సంఘాల సభ్యులు, ఆటో లారీ అసోసియేషన్ల సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులను యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తామన్నారు. 10 లక్షల మంది నిత్య సాధకులను తయారుచేస్తామని వెల్లడించారు.

గతేడాది 1.5 లక్షల మంది శిక్షకుల ద్వారా కార్యక్రమాలు జరిపామని, ఈ సంఖ్యకు అదనంగా మరో లక్ష మంది శిక్షకులను జత చేస్తున్నామని తెలిపారు. ఈసారి కూడా యోగా, ప్రకృతి వైద్య ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో రూపొందించిన యోగా వీడియోలను ఉచితంగా ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు.

యోగా దినోత్సవ వేడుకల నిర్వహణపై సచివాలయంలో మంత్రి సత్యకుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ... యోగాసనాల ప్రాధాన్య తను తెలిపే విధంగా ప్రత్యేకంగా ఏపీ యోగా ప్రచార పరిషత్ ఏర్పాటు కోసం పంపిన ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు నాయుడు ఆమోదముద్ర వేశారని తెలిపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫైల్ ఆర్థిక శాఖ పరిశీలనలో ఉందని చెప్పారు. ఈ పరిషత్ ఏర్పాటకనుగుణంగా 3 ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటవుతాయని తెలిపారు. యోగాసనాల కార్యక్రమాలకే పరిమితం కాకుండా నిరంతరం కొనసాగేలా ఈ పరిషత్ పర్యవేక్షిస్తుందని చెప్పారు. విద్యా శాఖ మంత్రి లోకేష్ విద్యార్థులకు జరిగే బోధనలో యోగాను అంతర్భాగంగా చేర్చి ఉత్తర్వులు కూడా ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే యోగాసనాల కార్యక్రమాల నిరంతర పర్య వేక్షణ, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం కోసం మంగళగిరి ఏపీఐఐసీలో ప్రత్యేకంగా వార్ రూంను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

## ఇసుక ర్యాంపును నిలిపివేయాలి



హీరమండలం (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లా హీర మండలం భగీరథపురం గ్రామం సమీపంలో వంశధార నదిలో నిర్వహిస్తున్న అధికారిక ఇసుక ర్యాంపును నిలిపివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. మంగళవారం ర్యాంపు వద్దకు నీలాదేవిపురం, భగీరథపురం గ్రామాలకు చెందిన ప్రజలు చేరుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామం పక్కనే ర్యాంపు నిర్వహిస్తుండటంతో వరదలు వచ్చే సమయంలో పంట పొలాలు, గ్రామం ముంపునకు గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు.

## ఆపదలో కొండంత అండ.. అభాగ్యుల పాలిట 'సంజీవని'!

- కష్టమంటే 'నేనున్నా'నంటూ కదిలొచ్చే జననేత... మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- పేదల కళ్లలో ఆనందం నింపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత
- బాధితుల పాలిట ఆపద్బాంధవుడిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవ
- టెక్కలి నియోజకవర్గంలో 23 నెలల్లో 322 మందికి రూ. 3.15 కోట్ల సీఎంఆర్ఎఫ్ సాయం



నిమ్మాడ (చైతన్యరథం): అనుకోని అనారోగ్యం.. ఆసుపత్రి పాలైతే లక్షల్లో ఖర్చు.. అప్పు చేసి ప్రాణాలు నిలబెట్టుకున్నా, ఆ అప్పుల ఊబిలోంచి ఎలా బయటపడాలో తెలియని అయోమయం. ఇలాంటి దీనస్థితిలో ఉన్న ఎన్నో పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా మారుతోంది. ఆపదలో ఉన్నవారికి "మేమున్నాం" అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న భరోసా అభాగ్యుల పాలిట సంజీవనిలా పనిచేస్తోంది. అప్పుల బాధతో కుంగిపోతున్న కుటుంబాల్లో ఈ సాయం సరికొత్త మానవీయ వెలుగులు ప్రసరిస్తోంది. టెక్కలి నియోజకవర్గం పరిధిలోని నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల ప్రజలతో పాటు.. ఇతర నియోజకవర్గాల నుంచి ముఖ్యమంత్రి సహాయనిధి కోసం ఆశ్రయించిన వారికి సైతం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సాయం అందిస్తూ తన మానవత్వాన్ని చాటుకుంటున్నారు.

**అహర్నిశలు శ్రమిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్గదర్శకత్వంలో, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేదల పాలిట ఆత్మీయుడిగా నిలుస్తున్నారు. కష్టం అని వచ్చిన వారికి 24 గంటలూ తన కార్యాలయ సిబ్బందిని అందుబాటులో ఉంచుతూ, బాధితుల గుండె ఘోషను వింటున్నారు. గత ప్రభుత్వ పాలనలో లాగా కాళ్లరిగేలా ఆఫీసుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, దళారుల ప్రమేయమే లేకుండా నేరుగా లబ్ధిదారులకు సాయం అందేలా ఆయన తీసుకుంటున్న ప్రత్యేక చొరవ సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. అవసరమైతే స్వయంగా ఆయనే కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో మాట్లాడి, బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూస్తుండటం మంత్రిలోని మానవీయ కోణానికి అద్దం పడుతోంది. ఎప్పటికప్పుడు విజయవాడకు సమాచారం చేరవేస్తూ, చెక్కుల మంజూరులో ఎలాంటి జాప్యం లేకుండా ఆయన యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారు.

**గణాంకాల్లో దాగిన కరుణ.. ఆకలి తీర్చే ఆత్మీయత**

గడిచిన 23 నెలల్లోనే ఏకంగా 322 మంది లబ్ధిదారులకు రూ. 3.15 కోట్ల ముఖ్యమంత్రి సహాయనిధి సాయం మంజూరైందంటే కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు. ఒక్క టెక్కలి నియోజకవర్గంలోనే రూ. 3.15 కోట్లకు పైగా సాయం అందించి, మంత్రి అచ్చెన్నాయుడు వందలాది కుటుంబాల్లో వెలుగులు నింపారు. సాయం కోసం సుదూర ప్రాంతాల నుంచి తన కార్యాలయానికి వచ్చే వారికి కేవలం భరోసా మాత్రమే ఇవ్వకుండా, నాణ్యమైన భోజనం పెట్టి ఆదరిస్తున్న అచ్చెన్నాయుడి పెద్ద మనసు అక్కడికి వచ్చేవారిని కంటతడి పెట్టిస్తోంది.

**ఆదర్శంగా నిమ్మాడ క్యాంప్ కార్యాలయ సిబ్బంది**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి స్ఫూర్తితో నిమ్మాడ క్యాంప్ కార్యాలయ సిబ్బంది సైతం బాధితులకు విశేష సేవలు అందిస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నిరుపేదలకు వారు ఆత్మీయంగా అండగా నిలుస్తున్నారు. దరఖాస్తుకు ఎలాంటి ధృవీకరణ పత్రాలు అవసరమో వారికి కూలంకషంగా, ఓపికగా వివరిస్తున్నారు. సమర్పించిన దరఖాస్తు ఎక్కడా వెనక్కి రాకుండా, నూటికి నూరు శాతం మంజూరయ్యే విధంగా అత్యంత క్రమపద్ధతిలో ఫైళ్లను సిద్ధం చేసి విజయవాడకు పంపుతున్నారు. సిబ్బంది చూపుతున్న ఈ ప్రత్యేక చొరవ వల్ల ఎలాంటి వివరాలు తెలియని అమాయకులైన పేదలకు శ్రమ తప్పడమే కాకుండా, సాయం త్వరితగతిన అందుతోంది.


**కళ్లలో ఆనంద భాష్పాలు.. చెరగని కృతజ్ఞత**

తాజాగా సాయం అందుకున్న 322 మంది లబ్ధిదారుల ముఖాల్లో ఇప్పుడు చెప్పలేనంత ఆనందం కనిపిస్తోంది. "అప్పుల పాలై దిక్కుతోచని స్థితిలో ఉన్న మాకు ముఖ్యమంత్రి చంద్రబాబు దేవుడిలా సాయం చేశారు. అచ్చెన్నాయుడు మాకు ఎలాంటి ఇబ్బంది రాకుండా, వేగంగా చెక్కులు అందేలా చూశారు. ప్రాణాలు నిలబెట్టుకోవడానికి అప్పులు చేసిన మాకు, ఈ సాయం కొండంత అండ. ఈ మేలును ఎప్పటికీ మర్చిపోలేం" అంటూ వారు భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలుపుతున్నారు. పేదల విద్య, వైద్యంపై కూటమి ప్రభుత్వం చూపుతున్న ఈ ప్రత్యేక శ్రద్ధ.. రాష్ట్రంలో సరికొత్త మానవీయ పాలనకు నాంది పలుకుతోంది.

## డీఎస్సీపై వైసీపీది ఫేక్ ప్రచారం... మండిపడ్డ తెలుగుయువత



పెడన (చైతన్యరథం): గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా వేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న జగన్ రెడ్డికి, ఇవాళ కూటమి ప్రభుత్వంపై మాట్లాడే అర్హత లేదని, డీఎస్సీపై వైసీపీది ఫేక్ ప్రచారమని కృష్ణా జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు దండమూడి చౌదరి ధ్వజమెత్తారు. అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మొదటి సంతకం మెగా డీఎస్సీ మీదే పెట్టారు. కేవలం 148 రోజుల్లోనే అత్యంత పారదర్శకంగా 16,347 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేసి, నియామక పత్రాలు అందజేశారు. 5 లక్షల మంది అప్లై చేసి, 3 లక్షల మంది క్వాలిఫై అయిన ఈ మెగా డీఎస్సీపై వైసీపీ నేతలు ఆధారాలు లేకుండా చేస్తున్న ఫేక్ ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నాం. దమ్ముంటే అవకతవకలను నిరూపించాలి. పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ నేతృత్వంలో నియోజకవర్గంలో మునుపెన్నడూ లేనివిధంగా భారీ ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెడన రూపురేఖలు మారుతున్నాయని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. నాడు 'అమ్మ ఒడి' పేరుతో ఇంట్లో ఒక్కరికే ఇస్తే.. మా యువనేత నారా లోకేష్ నేడు 'తల్లికి వందనం' ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా, ప్రతి ఒక్కరికీ ?15,000 చొప్పున అందిస్తున్న ఘనత మా కూటమిది అన్నారు. నాడు టీచర్లను ఇబ్బంది పెడితే.. నేడు కూటమి ప్రభుత్వం వారికి పోస్టింగులు ఇవ్వడమే కాకుండా, సింగపూర్ పంపించి మరీ అంతర్జాతీయ స్థాయి కోచింగ్ ఇప్పిస్తోంది. ఇంటర్ విద్యార్థులకు నిలిపివేసిన మధ్యాహ్న భోజనాన్ని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనలతో పునరుద్ధరించి విద్యార్థుల ఆకలి తీరుస్తున్నాం. గతంలో జరిగిన అవినీతిని తుడిచేస్తూ, ప్రస్తుత చైర్మన్ రవి నాయుడు ఆధ్వర్యంలో క్రీడాకారులకు, ఉద్యోగులకు పూర్తి ప్రోత్సాహం అందిస్తున్నాం. గతంలో జాబ్ క్యాలెండర్, డీఎస్సీ పేరుతో మోసం చేసిన వైసీపీ.. ఇప్పటికైనా ఇలాంటి అసత్య ప్రచారాలు మానుకోవాలి. లేకపోతే తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మునగాల నాగ భాస్కరరావు, ఎన్ ఎ బేగ్, బెజవాడ నాగరాజు, మండెం అశోక్ పాల్గొన్నారు.



జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

# ఆర్థిక భద్రతతోనే మహిళల జీవితాల్లో వెలుగులు : ప్రత్తిపాటి

- ●సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగిపోతేనే వేగవంతమైన అభివృద్ధి
- ●సామాజిక సేవా సంస్థలు, సంపన్నులు ప్రభుత్వ ఆశయంలో భాగం కావాలి
- ●పేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ



చిలకలూరిపేట (చైతన్యరథం): రెక్కల కష్టం, శక్తియుక్తులతో జీవించే పేద, మధ్య తరగతి మహిళల జీవితాలు మెరుగుపడి, ఆర్థిక భద్రత లభిస్తేనే, సమాజానికి మేలు జరుగుతుందని, ఆ దిశగా స్వచ్ఛంద సంస్థలతో పాటు.. కార్పొరేట్ సంస్థలు తమ సహాయ సహకారాలు అందించాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. మంగళవారం ఆయన పట్టణ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో జి.డి.యం.సి. చైర్మన్ వద్దణం హరిబాబుతో కలిసి పాల్గొని, 20 మంది మహిళలకు కుట్టుమిషన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రోటరీ క్లబ్ నిర్వాహకుల సేవల్ని కొనియాడారు. రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్న ముఖ్యమంత్రి సంకల్పంలో సామాజిక, సేవా సంస్థలు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. ప్రజా సేవకు రాజకీయాలతో పనిలేదని, మంచి చేయాలనే ఆశయం, ఆలోచన ఉంటే సరిపోతుందన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగినప్పుడే రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. మారుతున్న కాలంతో పాటు.. సంపన్నులు, సామాజికంగా, ఆర్థికంగా బలంగా ఉన్నవారి ఆలోచనా విధానం మారాలని, అప్పుడే పేదరికమనే జబ్బు మాయమవుతుందన్నారు. ప్రభుత్వ ఆశయానికి ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు, ప్రజల సహకారం తోడైతేనే పీ-4 విజయవంతంగా అమలవుతుందని ప్రత్తిపాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కందిమల్ల జయమ్మ, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, రోటరీ క్లబ్ సభ్యులు ఉప్పుటూరి ప్రసాద్, బోడే రామసుబ్బారావు, చిలుకూరి శ్రీనివాసరావు, కాంతయ్య, అడుసుమల్లి మోహన్ రావు, సాంబశివరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

●రాజమహేంద్రవరంలో మన వార్డు - మన ఆదిరెడ్డి కార్యక్రమంలో ఎమ్మెల్యే




రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగర చరిత్రలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రత్యేక నాయకుడని, నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవంలో ఇలాంటి నాయకుడిని చూడలేదని టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, గౌతమి జీవ కారుణ్య సంఘం చైర్మన్ వర్రే శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి నగరంలో ప్రారంభం కానున్న "మన వార్డు - మన ఆదిరెడ్డి" కార్యక్రమం వివరాలు తెలిపేందుకు గోరక్షణపేటలోని శ్రీకారం ఫంక్షన్ హాల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మజ్జి రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలు, నాయకులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారని తెలిపారు. ప్రతి వార్డులో కార్యకర్తలను, నాయకులను కలిసి వారి వ్యక్తిగత, కుటుంబ, రాజకీయ సమస్యలను తెలుసుకుని పరిష్కరించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికే దేవాదాయ శాఖ కమిటీలలో సుమారు 140 మందికి బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్లు, డైరెక్టర్ పదవులు, రాష్ట్ర, జిల్లా కమిటీలలో కూడా కార్యకర్తలకు ప్రాతినిధ్యం కల్పించినట్లు చెప్పారు. జనసేన, బీజేపీ, టీడీపీ పార్టీల నాయకులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి కమిటీలో కూటమి భాగస్వామ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. చిన్న సమస్య అయినా, పెద్ద సమస్య అయినా కార్యకర్తలు నేరుగా ఎమ్మెల్యేకు తెలియజేసేలా వ్యవస్థను రూపొందించామని చెప్పారు. సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభమయ్యే "మన వార్డు - మన ఆదిరెడ్డి" కార్యక్రమానికి సంబంధించిన నెలరోజుల షెడ్యూల్ను విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

# మా భూమిని బ్రహ్మనాయుడు దౌర్జన్యంగా ఆక్రమించాడు

●మాజీ సైనికుడు వెంకట్రావు ఆవేదన

వినుకొండ (చైతన్యరథం): వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మా భూమిని దౌర్జన్యంగా ఆక్రమించారని మాజీ సైనికులు బొల్లేపల్లి వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసిపి అధికారంలో ఉండగా అప్పటి ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అధికారాన్ని అడ్డం పెట్టుకొని తమ విలువైన భూమిని దౌర్జన్యంగా కబ్జా చేసిన అంశాన్ని సాక్షాదారులతో మంగళవారం మీడియాకు వెల్లడించారు. తాను 2008లో సైనికుడిగా పదవీ విరమణ పొంది తనకొచ్చిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ డబ్బుతో తన మిత్రులు పెంగినేని చంద్రశేఖర్, గోవిందరాజులు, తన బావ గారు వాసిరెడ్డి హనుమంతరావు కలిసి వెల్లటూరు రోడ్ లోని కొండ వద్ద వినుకొండ సర్వేనెంబర్ య. 221/1లో 2.45 ట్లు, 226-ఇ లో య. 1.70ట్లు భూమిని 2011 లో కొనుగోలు చేసి అగ్రిమెంటు పోదుర్చుకోవడం జరిగిందన్నారు. మాకు అగ్రిమెంట్ చేసిన ఇరు వర్గాల మధ్య వారి వ్యక్తిగత సమస్యల మధ్య వివాదం జరిగి య.2.45 హక్కుదారులు మా రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. మరో వర్గం రిజిస్ట్రేషన్ను ముందుకు రాకపోవడంతో మేము సంవత్సరాలు గడిచిన వేచి ఉండడం జరిగిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండ కొండ చుట్టూ భూ హక్కుదారులను బెదిరించి తక్కువ ధరకు సొంతం చేసుకుంటున్న రోజుల్లో అతని కన్ను మా భూమి పై పడిందన్నారు. మాకు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉన్న ఒక వర్గం వారిని పిలిపించుకొని మాకు ముందుగా విక్రయ అగ్రిమెంటు ఉన్నప్పటికీ బెదిరించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని మమ్మల్ని బెదిరించడం మొదలుపెట్టారన్నారు. రెవిన్యూ అధికారులను, పోలీసులను ఒత్తిడి చేసి మహిళలతో తమపై అక్రమ కేసులు బనాయించి పోలీస్ స్టేషన్ను పిలిపించి బ్రహ్మనాయుడు బెదిరించి దౌర్జన్యం చేశాడని వివరించారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన బ్రహ్మనాయుడు పోలీసుల అండదండతో నాడు మా భూమిని ఆక్రమించడం కూడా జరిగిందన్నారు. అక్రమంగా బొల్లా బ్రహ్మనాయుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్న మా భూమిని బొల్లా రమేష్ కు 8 కోట్ల అమ్మి సొమ్ము చేసుకునే ప్రయత్నం కూడా జరిగిందన్నారు. మా వద్ద ఉన్న విక్రయ స్వాధీన దస్తావేజులు, విక్రయ అగ్రిమెంట్లు, లింకు డాక్యుమెంట్లతో జిల్లా అధికారులకు ఫిర్యాదు కూడా చేయడం జరిగిందన్నారు. బ్రహ్మనాయుడు ఒత్తిడికి లోనైన అధికారులు తమకు ఎటువంటి న్యాయం చేయలేదని వాపోయాడు. దేశ



రక్షణకు బార్డర్లో ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడిన మాలాంటి సైనికుల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన జీవితాన్ని దేశానికి అంకితం చూసి పదవీ విరమణ అనంతరం తనకొచ్చిన బెనిఫిట్స్ తో ఆస్తిని కొనుగోలు చేసుకుంటే బ్రహ్మనాయుడు దౌర్జన్యంగా ఆక్రమించి తమకు అన్యాయం చేశాడని మాజీ సైనికుడు వెంకట్రావు వాపోయాడు. మా వద్ద ఉన్న డాక్యుమెంట్లు ఆధారంగా విచారణ చేపట్టి సాక్షాదారాలను పరిశీలించి మాకు సర్వహక్కులు కల్పించి మా భూమిని అప్పగించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. మా భూమిని దౌర్జన్యంగా ఆక్రమించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న బొల్లా బ్రహ్మనాయుడు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# వేలేరుపాడు అగ్నిప్రమాదంపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దిగ్భ్రాంతి

- ●సమగ్ర విచారణ చేయాలని పోలీసులకు ఆదేశాలు
- ●మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఎంపీ



ఏలూరు (చైతన్యరథం): ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం వేలేరుపాడులో మంగళవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందడం పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పూరిల్లు దగ్ధం అయిన ఘటనలో వలగాని సావిత్రి, సిగ పూలమ్మ అనే ఇద్దరు మహిళలు సజీవదహనమై మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. అగ్నిప్రమాదంలో వలగాని సావిత్రి ఇల్లుతో పాటు పక్కనే ఉన్న మరో ఇల్లు పూర్తిగా దగ్ధమవడం దురదృష్టకరమన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున తక్షణ సహాయం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారుల ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేసిన ఎంపీ, ప్రమాద స్థలానికి వెళ్లిన కుక్కునూరు సీఐ రమేష్తో ఫోన్లో మాట్లాడారు. అగ్నిప్రమాద ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కొంతమంది స్థానికులు తనకు ఫోన్ చేసిన విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లిన ఎంపీ ప్రమాద కారణాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే క్లూస్ టీమ్ ను రప్పిస్తున్నట్లు, ఏదైనా కుట్ర కోణం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఎంపీకి వివరించారు.

# తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.కోటి నిధులు

పొన్నూరు (చైతన్యరథం): నియోజకవర్గానికి రూ.1 కోటి విలువైన తాగునీటి పథకాలకు పరిపాలనా అనుమతులు ఇచ్చారు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, నియోజకవర్గంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారం కోసం 15వ ఆర్థిక సంఘం టైడ్ నిధుల కింద రూ.1.00 కోటి విలువైన తాగునీటి పథకాలకు పరిపాలనా అనుమతులు మంజూరైనట్లు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమోదం పొందిన ఈ ప్రతిపాదనల మేరకు చెబ్రోలు, పెదకాకాని మండలంలో దేవరాయబొట్లపాలెం, నంబూరు, పెదకాకాని, తక్కెళ్లపాడు, వెనిగండ్ల గ్రామాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థల అభివృద్ధి మరియు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గ ప్రజల అవసరాలను గుర్తించి తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అవసరమైన నిధులను సాధించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మంజూరైన పనుల్లో చెబ్రోలు గ్రామానికి రూ.25 లక్షలు, దేవరాయబొట్లపాలెం గ్రామానికి రూ.25 లక్షలు, నంబూరు గ్రామానికి రూ.10 లక్షలు, పెదకాకాని గ్రామానికి రూ.25 లక్షలు, తక్కెళ్లపాడు గ్రామానికి రూ.5 లక్షలు, వెనిగండ్ల గ్రామానికి రూ.10 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయిన అనంతరం ఆయా గ్రామాల్లో తాగునీటి సరఫరా గణనీయంగా మెరుగుపడి ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను తీసుకువస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే తెలిపారు.

# మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

కొయ్యలగూడెం (చైతన్యరథం): మలేరియా, డెంగీ కారకాలైన దోమల నివారణపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని కొయ్యలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తస్లీం అన్నారు. పీహెచ్సీ ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా ప్రధాన కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఉమాశంకర్, శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ 'యూనిట్' సమావేశాలు విజయవంతం చేయాలి : ప్రభుత్వ చీఫ్ విప్ జీవి



వినుకొండ (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని యూనిట్లలో బుధవారం తప్పనిసరిగా 'క్యాలెండర్ మీటింగ్స్' నిర్వహించాలని వినుకొండ శాసనసభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ఆదేశించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మొత్తం 85 యూనిట్లలో ఈ సమావేశాలు వంద శాతం జరగాలని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సమావేశాల నిర్వహణకు ఆయా యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, కో-ఇన్‌ఛార్జ్‌లు పూర్తి బాధ్యత వహించాలని జీవి ఆంజనేయులు సూచించారు. బూత్ కన్వీనర్స్, కో-కన్వీనర్స్, గ్రామ పార్టీ అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు, నీటి సంఘాల అధ్యక్షులు, ఆలయ కమిటీల సభ్యులు మరియు సీనియర్ నాయకులందరినీ కలుపుకుని సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రగతితో పాటు ఓటర్ల జాబితాలో జరుగుతున్న మార్పులు, చేర్పులపై క్షేత్రస్థాయిలో సమీక్షించాలన్నారు. అలాగే స్థానిక కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై సవివరంగా చర్చించి, యూనిట్ పరిధిలో పరిష్కారం కాని అంశాలను ప్రతి నెల రెండవ బుధవారం జరిగే మండల స్థాయి సమావేశం దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. నాయకులందరి సమన్వయం కోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకోవాలని, సమావేశ వివరాలతో పాటు ఫోటోలను తప్పనిసరిగా మై టీడీపీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని జీవి ఆంజనేయులు స్పష్టం చేశారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేమూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వేమూరు నియోజకవర్గానికి రూ.8,90,874 విలువైన వైద్య సహాయం మంజూరు చేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారి వైద్య ఖర్చులను దృష్టిలో ఉంచుకుని, బాధితుల దరఖాస్తులను వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తమ సిఫార్సు లేఖలతో ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయానికి పంపించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లెటర్ ఆఫ్ క్రెడిట్ రూపంలో మొత్తం 8 మంది లబ్ధిదారులకు రూ.8,90,874 వైద్య సహాయాన్ని మంజూరు చేసింది. అనంతరం మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ... పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అవసరమైన వారికి ఆర్థిక తోడ్పాటును అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని, ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని నక్కా ఆనందబాబు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ మంజూరైన మొత్తాలను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేసి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మహిళా సమస్యల పరిష్కారానికి మహిళా గ్రీవెన్స్



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి మహిళల నుండి వినతులు, అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు టీడీపీ పార్లమెంట్ కమిటీ సభ్యులు పరుచూరి సంజీవరావు, నీలం ప్రసాద్, గుర్రం ప్రసాద్, షేక్ అబ్దుల్ రహీం పాల్గొని మహిళల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళల నుండి అర్జీలు స్వీకరించారు. మహిళలు తెలిపిన ప్రతి సమస్యను నమోదు చేసుకుని ఎమ్మెల్యే గళ్ళా మాధవి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ముఖ్యంగా మహిళల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని వారు పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, భద్రత, సాధికారత కోసం ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధులు కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు.

## ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది



ఉయ్యూరు (చైతన్యరథం): ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.4 వేలు పెన్షన్లు అందించడం జరిగిందని, సూపర్ సిక్స్ పథకాలు అములు చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారని మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి రాజేంద్రప్రసాద్ వ్యాఖ్యానించారు. పట్టణంలోని 7, 20వ వార్డులలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు ప్రతినెలా ఒక పండగలా పెన్షన్ పంపిణీ చేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమం కోసం ప్పెన్షన్ దారులకు ఇబ్బంది లేకుండా ప్రతి నెలా ఒకటవ తేదీ ఉదయాన్నే వృద్ధులకు రూ.4000 వికలాంగులకు రూ.6000, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10,000, బెడ్‌రీడింగ్ పేషంట్లకు రూ.15,000 ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రభుత్వానికి ప్రతినెలా రూ.2వేల 728 కోట్ల భారం అయినప్పటికీ ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లోని మహిళలు రాజేంద్రప్రసాద్‌ని కలిసి వారి సమస్యలను తెలియజేసుకొనగా త్వరలో వాటిని పరిష్కరిస్తామని మహిళలకు రాజేంద్ర ప్రసాద్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మైనార్టీ సెల్ కార్యదర్శిసయ్యద్ అజ్మతుల్లా బాబు, కౌన్సిలర్లు పశీర్రాజు చిరంజీవి, వడుపు కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**●గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మెగా జాబ్ మేళా విజయవంతం**

**●742 మంది హాజరు, 365 మందికి ఉద్యోగ అవకాశాలు**

**●వెల్లడించిన గుంటూరు టీడీపీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. యువతే రాష్ట్ర భవిష్యత్తు అని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో, ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరులోని హిందూ ఫార్మసీ కళాశాల, అమరావతి రోడ్‌లో మెగా జాబ్ మేళా ఘనంగా నిర్వహించారు. ఈ మెగా జాబ్ మేళాకు మొత్తం 742 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరుకాగా, ప్రాథమిక ఎంపికల్లో 365 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని, అందులో భాగంగా ఉద్యోగ మేళాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో ఇంకుక్స్ ఏఐ ప్రైవేట్ లిమిటెడ్, క్లౌడ్ మెల్లో టెక్నాలజీస్ ఎల్ఎల్‌పి, మాల్టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, బుక్ ఎక్స్‌పర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రైమారియా హెల్త్ కేర్, డ్రోగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్, అపెక్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, స్కిల్జా గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్యూచర్ ఐటి సొల్యూషన్స్ లిమిటెడ్ సహా 30కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు. మొత్తం 1,100 ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంచగా, వివిధ విద్యార్హతలు కలిగిన యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారని చెప్పారు.

**హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ...** ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇలాంటి ఉపాధి కార్యక్రమాలకు తమ కళాశాల ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ముత్తినేని శివలీల,టీడీపీ పార్లమెంట్ సెక్రటరీ గంటా మౌళిక మాట్లాడుతూ... యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

**జిల్లా ఉపాధి అధికారి అభినవ్ మాట్లాడుతూ...** యువతకు మరింత ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిరంతరం ఉద్యోగ మేళాలు నిర్వహిస్తోందని తెలిపారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకత్వంలో ప్రతి నియోజకవర్గంలో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నామని, నిరుద్యోగ యువత ఈ అవకాశాలను వినియోగించుకుని తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు.

## డీఎస్సీపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలి : గద్దె క్రాంతి కుమార్

**●నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగింది**



విజయవాడ (చైతన్యరథం): డీఎస్సీ నియామకాల విషయంలో ర్యాంకులు, మార్కులు వెల్లడించలేదంటూ కొందరు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, వాస్తవాలను వక్రీకరించి యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ విమర్శించారు. 2025 జూలై 2న రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించిందని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా ఎస్ఎస్సీ, ఆర్ఆర్బీ, హైకోర్టు సహా 100కు పైగా ప్రతిష్టాత్మక పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన టీసీఎస్ ఐయాన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో ఈ పరీక్షలు నిర్వహించబడినట్లు చెప్పారు. పరీక్షల భద్రత విషయంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారని, సిస్టమ్‌లో ముందుగానే ఎన్క్రిప్ట్ చేసిన ప్రశ్నపత్రాలు పరీక్ష ప్రారంభమైన తర్వాత మాత్రమే డీక్రిప్ట్ అయ్యే విధంగా ఏర్పాట్లు చేశారని వివరించారు. ప్రతి అభ్యర్థికి ప్రశ్నల క్రమం జంబుల్ రూపంలో అందడం వల్ల పేపర్ లీకేజీ లేదా మాస్ కాపీయింగ్‌కు ఏమాత్రం అవకాశం ఉండదన్నారు. డీఎస్సీ పరీక్షలు పూర్తయిన అనంతరం 2025 ఆగస్టు 22న పరీక్ష రాసిన ప్రతి అభ్యర్థి వివరాలు, వారు సాధించిన మార్కులు, ర్యాంకులను అధికారికంగా పబ్లిక్ డొమైన్‌లో విడుదల చేశామని గుర్తుచేశారు. అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించి వాటిని సమగ్రంగా పరిశీలించిన తర్వాతే సెప్టెంబర్ 15న తుది ఎంపిక జాబితాను విడుదల చేశారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఏ జిల్లాలకు కేటాయించబడ్డారో స్పష్టంగా వెల్లడిస్తూ, సంబంధిత డీఈఓ కార్యాలయాల్లో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని సూచించామని చెప్పారు. ఇంత పారదర్శకంగా, సాంకేతిక భద్రతతో నిర్వహించిన డీఎస్సీ నియామకాలపై నిరాధార ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని గద్దె క్రాంతి కుమార్ అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం యువతలో అనుమానాలు రేకెత్తించే ప్రయత్నాలను ప్రజలు, నిరుద్యోగ యువకులు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. "డీఎస్సీ నియామకాల ప్రతి దశ పారదర్శకంగా జరిగింది. మార్కులు, ర్యాంకులు అధికారికంగా విడుదలయ్యాయి. టీసీఎస్ ఐయాన్ వంటి జాతీయ స్థాయి సంస్థ ఆధ్వర్యంలో అత్యంత భద్రతతో పరీక్షలు నిర్వహించబడ్డాయి. వాస్తవాలను వక్రీకరించి ఫేక్ ప్రచారాలు చేయడం సరికాదని గద్దె క్రాంతి కుమార్ స్పష్టం చేశారు.

# పేదల ఆరోగ్య భద్రతే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**●కొండకమార్లలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి**



కొండకమార్ల (చైతన్యరథం): ఓడిచెరువు మండలం కొండకమార్ల గ్రామంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య వైద్య శిబిరానికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన శిబిరాన్ని పరిశీలించి, వైద్య సేవలు పొందుతున్న ప్రజలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ... పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు చేరువ అవుతున్నాయని పేర్కొన్నారు. శిబిరంలో పలువురు వైద్య నిపుణులు పాల్గొని రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులను అందజేశారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో వినియోగించుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా రమాదేవి హాస్పిటల్‌కు చెందిన డాక్టర్లు వెంకటేష్, మనోహర్‌లను మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి శాలువాతో సన్మానించి వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, మండల టీడీపీ కన్వీనర్ జయచంద్ర, అల్లా బకాస్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు నిజాం, కంచి సురేష్, జాకీర్, బాలకృష్ణారెడ్డి, కొత్త సుధాకరరెడ్డి, సురేష్, ఇర్షాద్, షానవాజ్, గంగాధరి, మల్లాపల్లి ఓబుల్ రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం



కర్నూలు (చైతన్యరథం): ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వహించిన వర్క్‌షాప్‌లో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలు, బూత్ స్థాయి నిర్వహణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. పార్టీ శ్రేణులు ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్క్‌షాప్‌లో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధ్యక్షులు పాల్గొని ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అనుసరించాల్సిన కార్యాచరణపై మార్గదర్శకాలు స్వీకరించారు.

# మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా పనిచేద్దాం

ఆదోని (చైతన్యరథం): ప్రజలకు మెరుగైన వైద్య సేలందించడమే లక్ష్యంగా పనిచేద్దామని, దీని వల్ల సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని ఎమ్మెల్యే డా. పార్థసారథి అన్నారు. మంగళవారం స్థానిక ఆదోని ఆర్ట్స్ కళాశాల సమావేశపు హాల్ లో ఏర్పాటు చేసిన ఆశా డే కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. కామేశ్వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్ని మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఆశా కార్యకర్తల సేవలు కీలకమన్నారు. వారు ఇటు ప్రభుత్వానికి, అటు ప్రజలకు మధ్య వారధిగా ఉంటున్నారని, ప్రభుత్వం అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వైద్య సేవల్లో ఏ చిన్న సమస్య వచ్చినా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారిణి డా. సత్యపతి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌కి వాటర్ కూలింగ్ రిఫ్రిజిరేటర్

చీరాల (చైతన్యరథం): నియోజకవర్గ శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ఆదేశానుశారం వేటపాలెం పోలీస్ స్టేషన్లో సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు వేసవి దృష్ట్యా కూలింగ్ వాటర్ అందాలని ఉద్దేశంతో బాపట్ల జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షులు, చీర నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు దోగిపర్తి బాలకృష్ణ కూలింగ్ రిఫ్రిజిరేటర్‌ని బహూకరణ చేశారు. దీనిని వేటపాలెం స్టేషన్ ఆఫీసురైన పి జనార్ధన్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాసిక వీరభద్రయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు జాగబత్తుని పోతురాజు, వైశ్య ఫెడరేషన్ సభ్యులు కొత్త శ్రీనివాసరావు, చుండూరు సురేష్, మాజేటి వెంకట సుబ్బారావు, గట్టా రమేష్, చుండూరు నాగాంజనేయులు, శేఖర్ మరియు గ్రామ ప్రజలు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తుల ఆరోగ్య భద్రతే టీటీడీపీ ప్రధాన లక్ష్యం: టీటీడీ అదనపు ఈవో




తిరుమల (చైతన్యరథం): భక్తుల ఆరోగ్యం, ఆహార భద్రతకు తితిదే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని తితిదే అదనపు ఈవో సీహెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని ఎస్వీ మ్యూజియం ఆడిటోరియంలో మంగళవారం, తితిదే ఆరోగ్య శాఖ.ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI), నెస్లే ఇండియా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆహార భద్రత, పరిశుభ్రతలపై మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తిరుమలకు ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు విచ్చేస్తున్న నేపథ్యంలో వారికి నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడం తితిదే బాధ్యత అని అన్నారు. ఆహార తయారీ, నిల్వ, పంపిణీ ప్రక్రియల్లో పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తిరుమలలో ప్రస్తుతం సుమారు 325 దుకాణాల్లో ఆహార విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, వాటిలో దాదాపు 1,300 మంది సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. సంస్థల యజమానులు తమ సిబ్బందికి పరిశుభ్రత, ఆహార భద్రత ప్రమాణాలపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన తిరుమలలో పరిశుభ్రతను మరింత మెరుగుపరచడం, భక్తులకు సురక్షితమైన ఆహారం అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అదనపు ఈవో తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధారాణి, క్వాలిటీ మేనేజర్ లక్ష్మీ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుత్తి రైల్వేస్టేషన్‌లో తప్పిన ప్రమాదం... రైలు నుంచి విడిపోయిన బోగీలు... జాయింట్ కప్లింగ్ ఉడిపోయిన వైనం



అనంతపురం (చైతన్యరథం): అనంతపురం జిల్లా గుత్తి రైల్వేస్టేషన్‌లో యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. బోగీల మధ్యన ఉండే జాయింట్ కప్లింగ్ ఊడిపోవటంతో రెండు బోగీలు యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి విడిపోయాయి. కర్ణాటక రాజధాని బెంగళూరులోని యశ్వంతపూర్ రైల్వేస్టేషన్ నుంచి బిహార్‌లోని కటిహార్ వెళ్తున్న యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ ( 06571 ) మంగళవారం రోజున గుత్తి రైల్వేస్టేషన్‌లో ప్రమాదానికి గురైంది. గుత్తి రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్ ఫామ్ మీదకు రైలు చేరుకున్న సమయానికి ఎస్6, ఎస్7 రైలు బోగీల మధ్యన ఉన్న జాయింట్ కప్లింగ్ విడిపోయింది. దీంతో రైలు నుంచి ఎస్6, ఎస్7 బోగీలు విడిపోయాయి. ఈ విషయాన్ని గమనించిన లోకోపైలెట్ వెంటనే అప్రమత్తమయ్యారు. రైలును నిలిపివేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న రైల్వే సాంకేతిక సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు తేపట్టారు. మరమ్మతు పనుల తర్వాత సుమారు 35 నిమిషాల తర్వాత రైలు తిరిగి బయల్దేరింది. అయితే కప్లింగ్ ఊడిపోయిన ఘటనపై రైల్వే ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నారు. సాంకేతిక కారణాలతోనే ఈ ప్రమాదం జరిగిందా.. లేక వేరే కారణాలు ఏవైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు. అయితే ఈ ఘటన కారణంగా ప్రయాణం ఆలస్యం కావటంతో రైల్వే ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవటంతో మరికొందరు ఊపిరి పీల్చుకున్నారు. యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి మంగళవారం ఉదయం ఏడు గంటలకు యశ్వంతపూర్ రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరుతుంది. యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుత్తి, డోన్, నంద్యాల, మార్కాపురం రోడ్, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, సింహాచలం, విజయనగరం, శ్రీకాకుళం, పలాస రైల్వేస్టేషన్ల మీదుగా ప్రయాణించి గురువారం తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు బిహార్‌లోని కటియార్ జంక్షన్ చేరుకుంటుంది. ఈ క్రమంలోనే యశ్వంతపూర్ నుంచి వస్తున్న సమయంలో గుత్తి రైల్వేస్టేషన్ వద్ద మంగళవారం ప్రమాదం చోటుచేసుకుంది. అయితే ఎవరికీ ఎలాంటి హానీ కలగకపోవటంతో ఆందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# తిరుపతిలో భారీగా పెరుగుతున్న క్యాన్సర్ బాధితులు

**● గత మూడేళ్లలో 175 శాతం పెరిగిన క్యాన్సర్ రిజిస్ట్రేషన్లు**

**● గుట్కా, పొగాకు వాడకమే ప్రధాన కారణమంటున్న వైద్యులు**



తిరుపతి (చైతన్యరథం): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుపతిలో క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గత మూడేళ్లలో కొత్తగా నమోదవుతున్న క్యాన్సర్ రోగుల సంఖ్య 175 శాతం మేర పెరిగింది. టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్‌కు చెందిన శ్రీ వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ (స్విక్కార్) విడుదల చేసిన గణాంకాలు ఈ షాకింగ్ నిజాన్ని వెల్లడించాయి. స్విక్కార్ నివేదిక ప్రకారం 2022 చివరి నాటికి 2,556గా ఉన్న కొత్త క్యాన్సర్ రిజిస్ట్రేషన్ల సంఖ్య.. 2025 చివరి నాటికి 7,000 దాటింది. ఇదే కాలంలో క్యాన్సర్‌గా నిర్ధారణ అయిన కేసులు 1,437 నుంచి 3,413కి రెట్టింపు అయ్యాయి. 2022 మధ్యకాలం నుంచి ఇప్పటివరకు దాదాపు 11,000 కేసులు నమోదైనట్లు తెలుస్తోంది.

**ప్రధాన కారణాలు ఇవే..**

ఈ ప్రాంతంలో గుట్కా, పొగాకు ఉత్పత్తుల వాడకం విపరీతంగా ఉండటమే ఈ పెరుగుదలకు ప్రధాన కారణమని వైద్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. పొలాల్లో, దుకాణాల్లో పనిచేసే కార్మికులు వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారని, నోటిలో నొప్పిలేని తెల్లటి మచ్చలు వంటి ప్రాథమిక లక్షణాలను నిర్లక్ష్యం చేస్తున్నారని వారు తెలిపారు. వ్యాధి ముదిరిన తర్వాత ఆసుపత్రికి వస్తుండటంతో చికిత్స సంక్లిష్టంగా మారుతోందని పేర్కొన్నారు. అయితే, కేసుల పెరుగుదల వ్యాధి తీవ్రతను సూచిస్తున్నప్పటికీ, ప్రజలలో పెరుగుతున్న అవగాహన, మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం కూడా ఒక కారణమని స్విక్కార్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. గతంలో దూర ప్రాంతాలకు వెళ్లే రోగులు ఇప్పుడు స్థానికంగానే చికిత్స పొందేందుకు ముందుకు వస్తున్నారని ఆయన వివరించారు.

**నివారణ చర్యలు.. పెరిగిన సేవలు**

పెరుగుతున్న కేసులకు అనుగుణంగా స్విక్కార్ తన సేవలను గణనీయంగా విస్తరించింది. 2022–23లో కేవలం 33గా ఉన్న తల, మెడకు సంబంధించిన సంక్లిష్ట క్యాన్సర్ సర్జరీలు, 2025–26 నాటికి 697కి పెరిగాయి. పొగాకు మాన్పించేందుకు ప్రత్యేకంగా “టొబాకో సెసేషన్ క్లినిక్” ప్రారంభించడంతో పాటు, సమాజంలో అవగాహన కల్పించేందుకు 20కి పైగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 2020 నుంచి ఇప్పటివరకు 1,43,000 మందికి పైగా నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల కోసం స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆటో యూనియన్లు, పాఠశాల విద్యార్థులు లక్ష్యంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.



# ఖండాంతరాల్లో పసుపు పండుగ



## మాల్టాలో వేడుకగా అన్న ఎన్టీఆర్ జయంతి

**మాల్టా:** మాల్టాలో ఎన్నారై టీడీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంత్యుత్సవం అంబరాన్నంటింది. విశ్వ విఖ్యాత నటసార్వభౌమ, తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక అయిన డాక్టర్ నందమూరి తారక రామారావు జయంతిని వేడుకగా నిర్వహించారు. ముళ్ళపూడి లతామురళి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంతో శ్రమించి తీసుకొచ్చిన విగ్రహాన్ని వేదికపై ఆవిష్కరించారు. ఆమెకు ప్రవాసాంధ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంలో జై ఎన్టీఆర్ నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. అనంతరం జరిగిన మహానాడులో పలు కీలక తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలుగు జాతి గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహా నేత ఎన్టీఆర్ అని కొనియాడారు. రాజకీయాలతో పాటు సినీ రంగంలో ఆయన సాధించిన విజయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. విదేశాల్లో ఉన్నా తెలుగు తల్లిపై ప్రేమను నిలబెట్టుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మాల్టాలో నివసిస్తున్న తెలుగు ప్రజలు తమ భాష, సంస్కృతి, సంప్రదాయాలను మరువకుండా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ అభిమానులు, నందమూరి అభిమానులు, ప్రవాస తెలుగు కుటుంబాలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వేడుక ప్రవాస తెలుగు ప్రజల్లో ఎన్టీఆర్ పట్ల ఉన్న అభిమానాన్ని, తెలుగు సంస్కృతితో ముడిపడిన అనుబంధాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. కార్యక్రమంలో మురళి ముళ్ళపూడి, లతా ముళ్ళపూడి, రవి సాగి, అజార్ షేక్, నరేష్ తాళ్లపనేని, సతీష్ ముళ్ళపూడి, చాగంటి బ్రహ్మ, సుమంత్ పద్మాల, గౌరవ్ జోషి, సురేష్ విశ్వనాథ్, అబ్బూరి ప్రశాంత్, కైపు లక్ష్మి, సంపత్, పి.వేణు గోపాల్, చావా శ్రీనాథ్, కె.రణధీర్, మల్లికార్జున్, వెంకట్ యామిని, రాజీవ్, వికాస్, సతీష్ దుర్గం, వినోద్, ప్రదీప్, సుధీర్ రెడ్డి, వంశీ, గోపీ తదితరులు పాల్గొన్నారు.









## స్కాట్లాండ్‌లో వైభవంగా మినీ మహానాడు

**ఎడిన్‌బర్గ్ (స్కాట్లాండ్):** ఎన్ఆర్ఐ టీడీపీ స్కాట్లాండ్ ఆధ్వర్యంలో స్కాట్లాండ్‌లోని అప్‌హాల్ కమ్యూనిటీ ఎడ్యుకేషన్ సెంటర్లో మినీ మహానాడు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు టీడీ జనార్దన్ ఏపీ నుంచి వీడియో కాల్ ద్వారా ప్రవాసులనుద్దేశించి ప్రసంగించారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరిస్తూ ప్రవాస తెలుగు ప్రజలు పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జ్యోత్స్న తిరునగరి ఫోనులో సందేశమిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాస భారతీయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. స్కాట్లాండ్‌లోని ఎన్ఆర్ఐలు కృష్ణప్రసాద్ పొట్లూరి, డాక్టర్ శ్రీకాంత్‌లావు, రమేష్ గోల్కొండ, సురేష్ కన్నెగంటి, ప్రదీప్ వేజండ్ల, స్వాతి చిగురుపాటి తమ ప్రసంగాల్లో టీడీపీ బలోపేతానికి ప్రవాసుల సహకారం కొనసాగాలని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, ప్రజలకు చేరవేస్తున్న సంక్షేమ పథకాలను వారు ప్రశంసించారు. కాగా ఈ వేడుకకు ఎడిన్‌బర్గ్, అబెర్డీన్, గ్లాస్గో నగరాల నుంచి పెద్ద సంఖ్యలో తెలుగు ప్రవాసులు హాజరయ్యారు. తొలుత చిన్నారులు కేక్ కట్ చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం పార్టీ ఆశయాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చలు జరిగాయి. ముగింపులో చైతన్య వింజం కృతజ్ఞతా ప్రసంగం చేసి కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. హాజరైన వారందరికీ సంప్రదాయ తెలుగు రుచులతో కూడిన విందు ఏర్పాటుచేశారు. ప్రవాస తెలుగువారు ఆత్మీయంగా ముచ్చటించుకుని కార్యక్రమాన్ని ఆనందంగా ముగించారు.





## ఓస్లోలో ఎంపీల బృందం పర్యటన

### పర్యావరణ పరిరక్షణపై శ్రీభరత్, శబరి అధ్యయనం

### నగరాల అభివృద్ధి, సుస్థిర రవాణా వ్యవస్థలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన





**ఓస్లో (నార్వే):** భారత్–నార్వే నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్ టూర్ (India-Norway Knowledge Exchange Tour) మొదటి రోజు ద్వితీయార్థం నార్వే రాజధాని ఓస్లోలో అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమాలతో సాగింది. ఐక్యరాజ్యసమితి బృంద సభ్యులైన తెలుగుదేశం పార్టీ ఎంపీలు మతుకుమిల్లి శ్రీభరత్, బైరెడ్డి శబరి పర్యావరణ సుస్థిరత, నగరాల అభివృద్ధి, పర్యావరణ పాలనకు సంబంధించి విలువైన అంశాలను తెలుసుకున్నారు. పర్యావరణ, రవాణా శాఖలకు చెందిన ప్రతినిధుల బృందం ఓస్లో పర్యావరణ–రవాణా శాఖ వైస్ మేయర్ మారిట్ క్రిస్టీన్ వెయాతో సమావేశమైంది. ఓస్లో నగర వాతావరణ ప్రాధాన్యతలు, సుస్థిర రవాణా వ్యవస్థలు, భవిష్యత్ నగరాల నిర్మాణంలో నాయకత్వం వహించాల్సిన పాత్రపై సుదీర్ఘంగా చర్చించారు.

అనంతరం ఓస్లో మున్సిపాలిటీ పరిధిలో అమలవుతున్న పలు సుస్థిర పర్యావరణ కార్యక్రమాలను ప్రతినిధుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ వ్యవస్థల పరిరక్షణ, ప్రసిద్ధ 'ఓస్లోఫ్యోర్డ్' పరిరక్షణ కోసం నార్వే అవలంబిస్తున్న వినూత్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఈ వాకింగ్ టూర్ ప్రతిష్టాత్మకమైన 'ఓస్లో ఒపెరా హౌస్' వద్ద ముగిసింది. అక్కడ పర్యావరణానికి హాని చేయని రీతిలో చేపట్టిన సుస్థిర పట్టణాభివృద్ధిని ప్రత్యక్షంగా వీక్షించారు.

తర్వాత ఫ్రాగ్నర్‌సెటెరెన్‌లోని ప్రసిద్ధ 'రోజెన్‌స్లాటెట్'ను బృంద సభ్యులు సందర్శించారు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, మానవ హక్కులు, పౌర సమాజం ప్రదర్శించిన ధైర్యసాహసాలను ప్రతిబింబించే కళాఖండాలను తిలకించారు.

నార్వే విదేశాంగ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ సిగ్‌బ్జోర్న్ టెన్‌ఫ్జోర్డ్ భారత ప్రతినిధుల బృందానికి అధికారిక రాత్రి విందు ఏర్పాటు చేశారు. ఎన్నో కొత్త విషయాల అభ్యసనం, పరస్పర అవగాహన, అర్థవంతమైన చర్చలతో తొలి రోజు పర్యటన విజయవంతంగా ముగిసింది.









# కూటమి ప్రభుత్వంతోనే ఏపీ పురోగతి

## ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

## అమెరికా రాజధాని ప్రాంతంలో ఆత్మీయ సత్కారం

**అమెరికా:** చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి గెలుపు భావితరాలకు బంగారు బాట అని, రాష్ట్ర ప్రగతికి మేలి మలుపు అని ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ బ్యాంకు (ఆప్కాబ్) చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. 2029 ఎన్నికల్లోనూ కూటమి ప్రభుత్వమే అధికారంలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. అమెరికా రాజధాని పరిధిలో భానుప్రకాష్ మాగులూరి అధ్యక్షతన ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు అన్న ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ విద్య, వైద్యం, సాంకేతిక రంగాల్లో రాష్ట్ర పురోగతి పట్టాలెక్కిందన్నారు. చంద్రబాబు, లోకేష్ అవిశ్రాంత కృషితో రాష్ట్రంలో బహుళ జాతి కంపెనీల పెట్టుబడులు సాధ్యమయ్యాయన్నారు. తెలుగుదేశం పార్టీ ఉనికి, విజయంలో ప్రవాసుల పాత్ర నిరుపమానమన్నారు. యువతకు స్ఫూర్తిగా ఇటీవల అమెరికాలో అత్యంత పిన్న వయసులో ఇమ్మిగ్రేషన్ అటార్నీగా పట్టా పుచ్చుకున్న కడపకు చెందిన భూమిరెడ్డి సాయిశ్రీనివాస రెడ్డిని సత్కరించారు.

మరో అతిథి, గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు మాట్లాడుతూ భారత్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక స్థానం ఉందని, ఇక్కడ వనరులకు కొదవ లేదన్నారు. నారా చంద్రబాబు నాయుడి పాలనా దక్షతతో రాష్ట్రం పలు రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందన్నారు. సంపద సృష్టించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమాలను సైకిల్ చక్రాలుగా మలచిన ఘనత చంద్రబాబుదే అన్నారు. యువ నేత లోకేష్ విలక్షణ శైలితో రాజకీయ క్షేత్రంలో దూసుకుపోతున్నా రన్నారు. భానుప్రకాష్ మాగులూరి మాట్లాడుతూ... వృత్తి, ఉపాధి రీత్యా ఏ దేశంలో ఉన్నా మాతృ భూమి, మాతృ భాష మనకు రెండు కళ్లు అన్నారు. పుట్టి పెరిగిన గ్రామాల అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలన్నారు. జన్మభూమి స్ఫూర్తినందించిన చంద్రబాబు సమర్ధ నాయకత్వాన్ని నిలబెట్టుకోవడానికి మన వంతు సహకారాన్ని బాధ్యతగా అందించాలన్నారు. అనంతరం గన్ని వీరాంజనేయులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బొల్లినేని సాయి, పొత్తూరి నాగ సత్యనారాయణరాజు, మైనేని రామ్‌ప్రసాద్, అవిర్నేని రమేష్, కందుల అభిరామ్, ఎండూరి సీతారామారావు, సామినేని వెంకటేశ్వరరావు, అరుణ్, అమరలింగం, వెంకటరెడ్డి, గోవర్ధన్, సుబ్బారావు, రమణ, నూరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.









# న్యూజెర్సీలో క్రీడా సంబరం

## 'తానా' ఆధ్వర్యంలో ఉత్కంఠభరితంగా పికిల్‌బాల్ టోర్నమెంట్





**న్యూజెర్సీ:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) న్యూజెర్సీ శాఖ ఆధ్వర్యంలో క్రీడా సంబరం అంబరాన్నంటింది. న్యూజెర్సీలో పికిల్‌బాల్ టోర్నమెంట్ ఆద్యంతం ఉత్కంఠ భరితంగా జరిగింది. న్యూజెర్సీ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. క్రీడాస్ఫూర్తి, నైపుణ్యంతో పాటు సమన్వయాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. పెద్ద సంఖ్యలో తెలుగు కుటుంబాలు, క్రీడాభిమానులు, సంఘ సభ్యులు హాజరై పోటీలను ఆసక్తిగా వీక్షించారు. ప్రథమ విజేతకు $500, రన్నరప్‌కు $250, ద్వితీయ రన్నరప్‌కు $150 నగదు బహుమతులతో పాటు ప్రత్యేక ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 'తానా' కోశాధికారి రాజా కసుకుర్తి మాట్లాడుతూ అమెరికా, భారతదేశాల్లో విద్య, యువత అభివృద్ధి, ఆరోగ్య అవగాహన, విపత్తు సహాయం, ఆహార పంపిణీ, విద్యార్థుల మార్గదర్శకత్వం, రైతు సంక్షేమ కార్యక్రమాలు వంటి అనేక రంగాల్లో చేస్తున్న సేవలను ప్రస్తావించారు. 'తానా' అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ లావు, కోశాధికారి రాజా కసుకుర్తి, న్యూజెర్సీ ప్రాంతీయ ప్రతినిధి సుధీర్‌చంద్ నారేపలుపు, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శివ చావా, యూత్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ చెరుకూరి, తానా ఫౌండేషన్ కోశాధికారి శ్రీనివాస్ ఒరుగంటి, ఫౌండేషన్ ట్రస్టీ సతీష్ మేక, న్యూజెర్సీ ప్రాంతీయ మాజీ ప్రతినిధి రామకృష్ణ వాసిరెడ్డి, తానా వాలంటీర్లు దశరథ్ తాళ్లపనేని, హరీష్ కోయల నాయకత్వం, సహకారంతో టోర్నీని నిర్వహించారు. కార్యక్రమ సమన్వయంలో హరిబాబు గంగవరపు (న్యూజెర్సీ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్, ప్రవీణ్ కల్వకొల్లు (న్యూజెర్సీ తానా కేర్స్ కో-ఆర్డినేటర్), రవి మాచర్ల, (న్యూజెర్సీ టీమ్‌స్క్వేర్ చైర్) కీలక పాత్ర పోషించారు. ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేసిన క్రీడాకారులు, వాలంటీర్లు, ప్రేక్షకులు, మద్దతుదారులకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.







# స్ఫూర్తిదాయకమైన నేల డాలస్ గాంధీజీ స్మారక స్థలి

## జాతిపితకు కోమటి జయరాం నివాళి

**డాలస్:** ఉత్తర అమెరికాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన కోమటి జయరాం తొలిసారిగా అర్వింగ్ (డాలస్)లోని జాతి పిత మహాత్మా గాంధీ స్మారక స్థలిని సందర్శించారు. ఈ సందర్భంగా పూజ్య బాపూజీకి పుష్పాంజలి ఘటించారు. మహాత్మా గాంధీ మెమోరియల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ తోటకూర, గవర్నెన్స్ బోర్డు సభ్యుడు అనంత్ మల్లవరపు... జయరాంకు స్వాగతం పలికి జ్ఞాపికతో సత్కరించారు. ప్రముఖ వ్యాపారవేత్త రామ్ గుళ్ళపల్లి, పలువురు ప్రవాస భారతీయులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ... "పుష్కర కాలం పూర్తి చేసుకుంటున్న ఇక్కడి గాంధీజీ స్మారక స్థలిని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు సందర్శించిన ఒక స్ఫూర్తిదాయకమైన యాత్రా స్థలంగా పేర్కొన్నారు. ప్రవాస భారతీయుల ఐక్యతకు ఈ మహాత్మా గాంధీ మెమోరియల్ ఒక నిలువెత్తు నిదర్శనమన్నారు. ఈ మహత్కార్యాన్ని సాకారం చెయ్యడంలో విశేష కృషి సల్పిన గాంధీ మెమోరియల్ చైర్మన్ డాక్టర్ ప్రసాద్ తోటకూర, వారి కార్యవర్గ బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## బీజేపీకి అన్నామలై రాజీనామా

ఢిల్లీ: తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కె.అన్నామలై పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు తన రాజీనామా లేఖను సమర్పించినట్లు తెలుస్తోంది. పార్టీ తరఫున రాజ్యసభ సభ్యత్వం ఆఫర్ చేసినప్పటికీ ఆయన దానిని తిరస్కరించినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో అన్నామలై భేటీ అయ్యేఅవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ పరిణామం తమిళనాడు బీజేపీలో చర్చనీయాంశంగా మారగా, అన్నామలై భవిష్యత్ రాజకీయ అడుగులపై ఆసక్తి నెలకొంది. ఆయన త్వరలోనే సొంత రాజకీయ పార్టీని ప్రకటించే అవకాశం ఉందన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది.



## సీబీఎస్ఈ చీఫ్‌కు పార్లమెంటరీ ప్యానెల్ సమన్లు




ఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) చైర్మన్ రాహుల్ సింగ్‌కు పార్లమెంటరీ స్థాయి సంఘం సమన్లు జారీ చేసింది. క్లాస్ 12 పరీక్షల్లో అమలు చేసిన ఆన్‌-స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానంపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమా చారం. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ జూన్ 2న సమా వేశం కానుంది. ఈ సమావేశానికి స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ సంజయ్ కుమార్‌తో పాటు సీబీఎస్ఈ చైర్మన్ రాహుల్ సింగ్ హాజరు కావాలని కమిటీ ఆదేశించింది. ఈ సమావేశంలో క్లాస్ 12 బోర్డు పరీక్షల్లో అమలు చేసిన ఓఎస్ఎమ్ విధానం, ఫలితాల అనంతరం విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలు, రీ-వెరిఫికేషన్, రీ-ఎవాల్యుయేషన్ ప్రక్రియలో తలెత్తిన సాంకేతిక ఇబ్బందులపై చర్చించనున్నారు. అలాగే 9, 10 తరగతుల్లో మూడు భాషల విధానం అమలుపై కూడా కమిటీ వివరణ కోరనుంది. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ 2020)లో భాగంగా సీబీఎస్ఈ ఈ విధానాన్ని అమలు చేస్తుండగా, కొన్ని రాష్ట్రాలు దీనిపై అభ్యంతరా లు వ్యక్తం చేస్తున్నాయి. విద్యా వ్యవస్థలో పారదర్శకత, విద్యా ర్థుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఈ సమీక్షలు నిర్వహిస్తున్న ట్లు పార్లమెంటరీ వర్గాలు తెలిపాయి.

# అమిత్‌షాను కలిసిన అన్నామలై..

## ఊపందుకున్న కొత్త పార్టీ ప్రచారం



న్యూఢిల్లీ: తమిళనాడు మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంగళవారం నాడిక్కడ కలుసుకున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఆర్గనైజేషన్ సెక్రటరీ బీఎల్ సంతోష్‌లతో తొలుత సమావేశమైన అన్నామలై తన రాజీనామా పత్రాన్ని వారికి సమర్పించారు. ఆ వెంటనే అమిత్‌షాను కూడా కలుసుకోవడంతో ఆయన కొత్త పార్టీని స్థాపించేందుకు నిశ్చయించుకున్నారనే ఊహాగానాలు మరింత ఊపందుకుంటున్నాయి. అయితే కొత్త పార్టీ ఆలోచనను అన్నామలై ఇంతవరకూ అధికారికంగా ఇంకా ధ్రువీకరించలేదు. న్యూఢిల్లీ పర్యటనలో అన్నామలైను పార్టీలోనే కొనసాగాలని బీజేపీ అధిష్ఠానం కోరిందని, రాజ్యసభ సీటు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని, దీనిపై ఒక నిర్ణయానికి వచ్చేంతవరకూ ఢిల్లీలోనే ఉండాలని సూచించిందని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. అన్నామలై సైతం తన నిర్ణయాన్ని రెండ్రోజుల్లో తెలియజేస్తానని ఢిల్లీకి బయలుదేరే ముందు చెన్నైలో మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. మరోవైపు, అన్నామలై మరో కొత్త అవతారం ఎత్తాలని, తమిళనాడును కాపాడాలని కోరుతూ మదురై, కోయంబత్తూరులో రెండ్రోజుల క్రితం పోస్టర్లు వెలిసాయి. జూన్ 4వ తేదీన అన్నామలై పుట్టినరోజున ఆయన నుంచి ఒక కీలక ప్రకటన ఉంటుందని అన్నామలై అనుచరులు చెబుతున్నారు. అన్నామలై గత కొంతకాలంగా పలు అంశాల విషయంలో అసంతృప్తితో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే పొత్తు పెట్టుకోవడంపై మొదట్నించీ ఆయన అసంతృప్తితో ఉన్నారు. పార్టీ టిక్కెట్‌ను కూడా నిరాకరించి ఎన్నికల ప్రచారానికే పరిమితమయ్యారు. అయితే ప్రచారంలోనూ ఆయనను పార్టీ పెద్దగా పట్టించుకోలేదని అన్నామలై వర్గీయులు బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు కేంద్ర ప్రభుత్వ త్రిభాషా విధానంతో అన్నామలై బహిరంగంగానే విభేదించారు.

ఈ విధానం వల్ల విద్యార్థులకు ముఖ్యంగా తమిళనాడుకు చెందిన వారు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని, తక్షణమే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కేంద్ర విద్యాశాఖను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన కోరారు. ఈ క్రమంలో సుహృద్భావ వాతావరణంలోనే పార్టీ నుంచి తప్పుకుని సొంత మార్గాన్ని ఎంచుకోవాలని అన్నామలై గట్టి నిశ్చయానికి వచ్చినట్టు ఆయన వర్గీయులు చెబుతున్నారు.

# త్విశా శర్మ కేసు..
# కీలక సాక్షిపై సమర్థ్ స్నేహితుల దాడి




భోపాల్: నటి త్విశా శర్మ కేసులో కీలక సాక్షి అయిన నీరజ్ దూబేపై దాడి జరిగింది. నిందితుడు సమర్థ్ సింగ్ స్నేహితులు నీరజ్‌పై దాడి చేశారు. మే 30వ తేదీన జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

బాధితుడు పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. సమర్థ్ సింగ్ ఇంటి సమీపంలో నీరజ్ దూబే సెలూన్ నడుపుతున్నాడు. త్విశా శర్మ కేసులో నీరజ్ కీలక సాక్షిగా మారాడు. దీంతో సమర్థ్ స్నేహితులు నీరజ్‌ను టార్గెట్ చేశారు. కోర్టులో సాక్ష్యం చెప్పొద్దంటూ వేధింపులకు గురిచేస్తున్నారు. మే 30వ తేదీన నీరజ్ తన సెలూన్ సమీపంలో ఉండగా ఐదుగురు వ్యక్తులు అక్కడికి వచ్చారు. వచ్చీరాగానే నీరజ్‌ను చుట్టుముట్టి బూతులు తిడుతూ రెచ్చిపోయారు. ఎదురు తిరిగిన నీరజ్‌పై దాడికి దిగారు. 'నువ్వు ఎందుకు ఈ కేసులో కీలక సాక్షిగా మారావు?' అని ప్రశ్నించారు.

కోర్టులో సమర్థ్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పొద్దని బెదిరించారు. నీరజ్‌ను విచక్షణా రహితంగా కొట్టి అక్కడినుంచి వెళ్లిపోయారు. దాడి జరిగిన వెంటనే నీరజ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటా మని నీరజ్‌కు భరోసా ఇచ్చారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దాడికి పాల్పడ్డ వారిని గుర్తించే పనిలో పడ్డారు. ఈ ఘటనపై నీరజ్ మీడియాతో మాట్లాడుతూ 'నా ప్రాణాలు పోతాయే మోనని చాలా భయపడ్డాను. నాకు రక్షణ కల్పించమని, న్యాయం చేయమని పోలీసులను కోరాను' అని అన్నాడు.

## టీఎంసీ రెబల్స్ కొత్త పార్టీ..
# తెరపైకి 'అస్లీ తృణమూల్'

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత టీఎంసీ పార్టీ పరిస్థితి దారుణంగా తయారైంది. పార్టీ తీవ్రఅంతర్గత సంక్షోభంలో చిక్కుకుంది. టీఎంసీలో కీలక నేతల తిరుగుబాటు మొదలైంది. అసెంబ్లీ ఎన్నికలు జరిగి నెల తిరక్కుండానే కీలక పరిణామం చోటు చేసుకుంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో సాందీపన్ సాహా, రితబ్రత బెనర్జీ అనేఇద్దరు ఎమ్మెల్యేలను అధిష్ఠానంపార్టీ నుంచి బహిష్కరించింది. ఈ నేపథ్యంలోనే టీఎంసీ భవిష్యత్తుపై పలుపుకార్లు షికార్లు చేస్తున్నాయి. టీఎంసీ పార్టీ రెండుగా చీలే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. గత కొన్ని వారాలుగా కోల్‌కతాలోని ఎమ్మెల్యే హాస్టల్‌తోపాటు గేట్‌వే హోటల్‌లో టీఎంసీ రెబల్స్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆ సమావేశాల్లో 'అస్లీ తృణమూల్'పేరిట కొత్త పార్టీ ఏర్పాటుపై ప్రధానంగా చర్చిస్తున్నారు. అయితే, ఇప్పటి వరకు కొత్తపార్టీ ఏర్పాటుపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. రెబల్స్ తమతో కలిసి వచ్చే వారి మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా, మమతా బెనర్జీ నివాసంలో జరిగిన టీఎంసీ శాసనసభా పక్ష సమావేశానికి కేవలం 19మంది ఎమ్మెల్యేలు మాత్రమే హాజరయ్యారు. 61మంది ఎమ్మెల్యేలు మీటింగ్‌కు హాజరు కాకుండా డుమ్మా కొట్టారు. వీరిలో సుమారు 50మందికి పైగా ఎమ్మెల్యేలు 'అస్లీ తృణమూల్'వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.




# సుప్రీంకోర్టు కొత్త న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త న్యాయమూర్తులు నియమితులైన సంగతి తెలిసిందే. కొలీజియం సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు రాష్ట్రపతిముర్ము ఆమోదముద్ర వేయడంతో కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం ఐదుగురు కొత్త న్యాయమూర్తులు సుప్రీంకోర్టులో ప్రమాణ స్వీకారం చేశారు. జస్టిస్ శీల్ నాగు,జస్టిస్ శ్రీచంద్రశేఖర్, జస్టిస్ సంజీవ్, జస్టిస్ అరుణ్‌పల్లి, జస్టిస్ వెంకిట సుబ్రమణి జడ్జిలుగా ప్రమాణ స్వీకారం చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా నియమితులైన ఐదుగురు న్యాయమూర్తులతో కలిపి సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 37కు చేరింది. సుప్రీంకోర్టులో ప్రస్తుతం జస్టిస్ బీవీ నాగరత్న మాత్రమే మహిళా న్యాయమూర్తిగా ఉన్నారు. ఇప్పుడు జస్టిస్ మోహన బాధ్యతలు చేపట్టడంతో సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తుల సంఖ్య రెండుకు చేరింది. సుప్రీంకోర్టులో న్యాయవాదిగా ఉంటూ అదే న్యాయస్థానానికి జడ్జి అయిన వారి సంఖ్య 12కు చేరింది. అయితే వయసు రీత్యా కొత్త న్యాయమూర్తుల్లో ఎవరూ సీజేఐగా పదోన్నతి పొందే అవకాశంలేదు.

చైతన్యరథం

# నేను లేకపోతే జైలులో ఉండేవాడివి



❑ నేతన్యాహూపై ట్రంప్ ఆగ్రహం

అమెరికా: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువరించింది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ చేపట్టిన తాజా సైనిక చర్యల నేపథ్యంలో ఇద్దరు నేతల మధ్య ఉద్రిక్తతలు పెరిగినట్లు తెలుస్తోంది. లెబనాన్‌లో దాడులను కొనసాగించడంపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, నెతన్యాహూతో ఫోన్‌లో ఘాటుగా మాట్లాడినట్లు సమాచారం. 'నువ్వు పిచ్చివాడివి. నేను లేకపోతే నువ్వు జైలులో ఉండేవాడివి. నేను నిన్ను కాపాడుతున్నా. ప్రస్తుతం అందరూ నిన్ను ద్వేషిస్తున్నారు. నీ చర్యల వల్ల ఇజ్రాయెల్‌పై కూడా వ్యతిరేకత పెరుగుతోంది. అసలు నువ్వు ఏం చేస్తున్నావు' అని నెతన్యాహూపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు అమెరికా మీడియాలో వార్తలు వచ్చాయి. హెజ్‌బొల్లాకు చెందిన ఓ సైనిక కమాండర్‌ను హతమార్చేందుకు ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో అమాయకులైన లెబనీస్ పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై ట్రంప్ ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలను ఖాళీ చేయాలని అక్కడి ప్రజలను ఇటీవల ఇజ్రాయెల్ హెచ్చరించింది. లెబనాన్‌పై దాడులు చేస్తే శాంతి చర్చల నుంచి వైదొలుగుతామని ఇరాన్ బెదిరించింది. దీంతో నెతన్యాహుతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. ఆ తర్వాత హెజ్‌బొల్లా నాయకులతోనూ మాట్లాడారు. ఇరు వర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని తన సోషల్ మీడియా ఖాతా 'ట్రూత్' ద్వారా ట్రంప్ తెలిపారు.


# ఇరాన్‌తో డీల్‌కు కఠిన నిబంధనలు



అమెరికా: ఇరాన్‌తో కుదుర్చుకోబోయే కొత్త ఒప్పందంలో మరింత కఠిన నిబంధనలు ఉండాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్టుబడుతున్నట్టు సమాచారం. ప్రస్తుతం రూపుదిద్దుకుంటున్న ఒప్పందం మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా హయాంలో 2015లో కుదిరిన అణు ఒప్పందంతో అనేక అంశాల్లో పోలికలు కలిగి ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2015 అణు ఒప్పందాన్ని ట్రంప్ గతంలో తీవ్రంగా విమర్శించారు. ఆ ఒప్పందం ఇరాన్‌కు ప్రయోజనం చేకూర్చిందని, అణ్వాయుధాల అభివృద్ధిని పూర్తిగా అడ్డుకోలేదని ఆయన పలుమార్లు ఆరోపించారు. అయితే ప్రస్తుతం కుదరిన ఒప్పందం కూడా అదే తరహాలో ఉందనే వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ అప్రమత్తమైనట్టు సమచారం. పాత ఒప్పందం కంటే కొత్త ఒప్పందం మరింత కఠినంగా ఉండాలని ట్రంప్ కోరుతున్నారు. తాజా చర్చల్లో ఇరాన్ అణు కార్యక్రమంపై కఠిన నియంత్రణలు, అధికంగా శుద్ధి చేసిన యురేనియం నిల్వల నిర్వహణ, అలాగే హోర్ముజ్ జలసంధికి సంబంధించిన అంశాలపై అమెరికా అదనపు షరతులు ప్రతిపాదించినట్లు సమాచారం. ఇందుకోసం ఇప్పటికే సిద్ధమైన ముసాయిదాను ట్రంప్ సవరణల కోసం తిరిగి పంపినట్టు వార్తలు వస్తున్నాయి.

# ఇజ్రాయెల్-హెజ్బొల్లా కాల్పుల విరమణ

## ఇరాన్‌తో చర్చలు సానుకూలం: ట్రంప్



అమెరికా: ఇజ్రాయెల్, ఇరాన్ మద్దతు ఉన్న హెజ్‌బొల్లా మధ్య జరుగుతున్న ఘర్షణలు శాశ్వతంగా ముగియాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆకాంక్షించారు. ఇరుపక్షాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని ఆయన పేర్కొన్నారు. హెజ్‌బొల్లా-ఇజ్రాయెల్ మధ్య దాడులు ఆగిపోవడంతో శాంతి చర్చల్లో ఇరాన్ చురుకుగా పాల్గొంటోందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతా 'ట్రూత్'లో ఓ పోస్ట్ చేశారు. 'ఇజ్రా యెల్‌పై కాల్పులు ఆపేందుకు హెజ్‌బొల్లా అంగీకరించింది. అలాగే ఇజ్రాయెల్ కూడా హెజ్‌బొల్లాపై దాడులు నిలిపివేయడానికి ఒప్పుకుంది. ఇది ఎంతకాలం కొనసాగుతుందో చూడాలి. ఇది శాశ్వతంగా కొనసాగాలని ఆశిస్తున్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతో చాలా మంచి సంభాషణ జరిగిందని ట్రంప్ చెప్పారు. అయితే పరిస్థితి పూర్తిగా ప్రశాంతంగా మారలేదని అంతర్జాతీయ మీడియా నివేదికలు చెబుతున్నాయి. కాల్పుల విరమణ ప్రకటన వచ్చిన తర్వాత కూడా దక్షిణ లెబనాన్ ప్రాంతాల్లో దాడులు, రాకెట్ ప్రయోగాల వార్తలు వెలువడ్డాయి. దీంతో ఈ ఒప్పందం ఎంతకాలం నిలుస్తుందన్న దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా లెబనాన్‌లో ఉద్రిక్తతలు తగ్గించడం అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న చర్చలకు కీలకమని విశ్లేషకులు భావిస్తున్నారు.

# యూఎస్‌లో 30 మంది భారతీయుల అరెస్ట్



న్యూయార్క్: యూఎస్‌లో అక్రమంగా నివసిస్తున్న 30 మంది భారతీయులను అరెస్ట్ చేసినట్లు యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ వెల్లడించింది. త్వరలో వారిని స్వదేశానికి పంపుతామని స్పష్టం చేసింది. అరిజోనాలో యూమా సెక్టార్‌లో సరిహద్దు తనిఖీల్లో భాగంగా 52 మందిని అరెస్ట్ చేసినట్లు వివరించింది. వారిలో 36 మంది ట్రక్ డ్రైవర్లుగా పని చేస్తున్నారని తెలిపింది. అందులో 30 మంది భారతీయులు కాగా.. మిగిలిన వారు మెక్సికో, ఎల్ సాల్వెడార్, రష్యాలకు చెందిన వారని పేర్కొంది. అయితే వీరిలో కొందరు వాషింగ్టన్, కాలిఫోర్నియా, న్యూయార్క్, వర్జీనియా తదితర ప్రాంతాల నుంచి డ్రైవింగ్ లైసెన్స్ పొందారని వివరించింది. మరికొందరు వద్ద ఎలాంటి డ్రైవింగ్ లైసెన్స్ లేవని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ స్పష్టం చేసింది. తనిఖీల్లో భాగంగా వీరి వద్ద జో బైడెన్ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన ఉపాధి పత్రాలను గుర్తించామని తెలిపింది. కానీ ఇప్పుడవి చెల్లుబాటు కావని స్పష్టం చేసింది. ఫెడరల్ చట్టం ప్రకారం వారందరిని స్వదేశానికి పంపుతామని పేర్కొంది.

అమెరికాలో ఇటీవల వాణిజ్య వాహనాలను నడుపుతూ భారతీయ సంతతికి చెందిన పలువురు ట్రక్ డ్రైవర్లు ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీంతో వారిని అరెస్ట్ చేశారు. ప్రజా భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ తరహా ప్రమాదాలు నివారించేందుకు ప్రతిరోజు తనిఖీలు చేపట్టినట్లు యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ వెల్లడించింది.

# హర్మూజ్ ఓపెన్‌కు చర్చలు

## భారత్‌కు యూకే ఆహ్వానం

యూకే: హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు ప్రపంచ దేశాలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. ఈ విషయమై చర్చించేందుకు నేడు 35 దేశాలు సమావేశం కానున్నాయి. ఇందులో పాల్గొనాలంటూ భారత్‌ను తాజాగా యూకే ఆహ్వానించింది. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ గురువారం తెలిపింది. భారత్ తరపున విదేశాంగ శాఖ సెక్రెటరీ విక్రమ్ మిస్రీ ఈ సమావేశంలో పాల్గొంటారని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. 'హోర్ముజ్‌పై చర్చల కోసం భారత్ సహా పలు దేశాలను యూకే ఆహ్వానించింది. మా తరపున విదేశాంగ శాఖ సెక్రటరీ నేటి సాయంత్రం జరగనున్న సమావేశంలో పాల్గొంటారు' అని ఆయన తెలిపారు. భారత్ ఇప్పటికే ఇరాన్‌తో పాటు ఇతర దేశాలతో ఈ విషయమై చర్చలు జరుపుతోందని రణధీర్ జైస్వాల్ తెలిపారు. హోర్ముజ్ మీదుగా సరకు రవాణాకు అంతరాయం కలగకుండా తమ వంతు ప్రయాత్నాలను చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రయత్నాలు ఫలితాలను ఇస్తున్నాయని కూడా అన్నారు. భారత్‌కు చెందిన ఆరు నౌకలు సురక్షితంగా హోర్ముజ్‌ను దాటగలిగాయని అన్నారు. తాజా సమావేశంలో భారత్‌తో పాటు ఫ్రాన్స్, జర్మనీ, కెనడా, జపాన్, ఇటలీ తదితర దేశాలు పాల్గొంటున్నాయని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిస్థితులను చక్కదిద్దేందుకు అందుబాటులో ఉన్న



అన్ని మార్గాలను పరిశీలిస్తామని తెలిపారు. హోర్ముజ్ జలసంధి మీదుగా ఎవరి ముడి చమురును వారే తెచ్చుకోవాలని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో తన ఆక్రోశం వెళ్లగక్కిన విషయం తెలిసిందే. ఎల్లకాలం అమెరికా సాయంగా రాదని అన్నారు. తాము సాయం కోరినప్పుడు ఇతర దేశాలు రాలేదని కూడా మండిపడ్డారు.

# ఆరుగురిని కాల్చి చంపి..తానూ కాల్చుకుని




అమెరికాలో కిరాతకం

న్యూయార్క్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి దారుణానికి ఒడిగట్టాడు. ఆరుగురు కుటుంబ సభ్యులను అతి కిరాతకంగా తుపాకితో కాల్చి చంపాడు. అనంతరం తనను తాను కాల్చుకుని ప్రాణాలు తీసుకున్నాడు. ఈ సంఘటన అమెరికాలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం మధ్యాహ్నం 12.12 గంటల సమయంలో మస్కటిన్, పార్క్ ఎవెన్యూలోని ఓ ఇంట్లో కాల్పులు జరిగినట్లు మస్కటిన్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందింది. పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లారు. ఇంట్లో నలుగురు వ్యక్తులు రక్తపు మడుగులో పడి ఉన్నారు. వారు అప్పటికే చనిపోయినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఆ నలుగురిని కాల్చి చంపిన వ్యక్తిని 52 ఏళ్ల ర్యాన్ విల్లిస్ మెక్‌ఫార్లాండ్‌గా గుర్తించారు. పోలీసులు ఇంటి దగ్గరకు రావడానికి ముందే అతడు అక్కడినుంచి వెళ్లిపోయాడు. మిల్ స్ట్రీట్‌లోని ఓ ఇంట్లోకి చొరబడి ఓ వ్యక్తిని చంపేశాడు. తర్వాత గ్రాండ్‌వ్యూ ఎవెన్యూలో మరో వ్యక్తిని కాల్చి చంపాడు. అనంతరం ఓ బ్రిడ్జి దగ్గర తుపాకితో కాల్చుకుని ర్యాన్ విల్లిస్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు అతడి శవాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ర్యాన్ విల్లిస్ చేతిలో హత్యకు గురైన వారందరూ అతడి కుటుంబసభ్యులేనని తేలింది. కుటుంబకలహాల నేపథ్యంలో అతడు ఈ దారుణానికి ఒడిగట్టాడని వెల్లడైంది. నిందితుడికి నేర చరిత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

# మరో 9 రోజుల్లో.. సాకర్ సమరం




అమెరికా: ఖండాలన్నీ కదంతొక్కే సమరం.. ఊహకందని విన్యాసాలు.. లిప్తపాటులో తలకిందులయ్యే ఫలితాలు.. అవధుల్లేని ఆనందాలు.. అంతులేని నిర్వేదాలు.. ఇలా భూగోళం మొత్తాన్ని 'బంతి'లా ఆడేసే.. టోర్నీలకెల్లా బంపర్ టోర్నీ.. సాకర్ సమరానికి వేళైంది. యావత్ ప్రపంచానికి ఫుట్‌బాల్ ఫీవర్ ఎక్కించే మాస్ మహా జాతర 'ఫిఫా వరల్డ్‌కప్'నకు మరో 9 రోజుల్లో తెరలేవ నుంది. 39 రోజులపాటు.. సాకర్ కిక్కుతో.. చిందులు తొక్కించ నుంది. నాలుగేళ్లకొకసారి ప్రపంచం మొత్తాన్నీ ఉర్రూతలూగించే సాకర్ సంరంభానికి ఈసారి అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. 23వ ఫిఫా వరల్డ్‌కప ఈ నెల 11న ఆరంభం కానుండగా.. వచ్చే నెల 19న న్యూయార్క్‌లో జరిగే మెగా ఫైనల్‌తో ముగియనుంది. డిఫెండింగ్ చాంప్‌గా అర్జెంటీనా బరిలోకి దిగనుంది.

### జంబో టోర్నీ

ఇప్పటివరకు జరిగిన ఈవెంట్లు ఒక లెక్క కాగా.. ఇప్పుడు జరగబోయేది అంతకు మించి అన్నట్టుగా సాగనుంది. 39 రోజుల పాటు టోర్నీ సాగనుండగా.. 104 మ్యాచ్‌లకు 16 నగరాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. బరిలోకి దిగే జట్ల సంఖ్యను 32 నుంచి 48కి పెంచారు. ఆయా జట్లను నాలుగేసి చొప్పున 12 గ్రూప్ లుగా వర్గీకరించారు. ప్రతి గ్రూప్

## 39 రోజులు..48 జట్లు..104 మ్యాచ్‌లు

నుంచి టాప్-2లో నిలిచిన జట్లతోపాటు మూడో స్థానంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన మరో 8 జట్లను నాకౌట్ రౌండ్-32కు ఎంపిక చేయనున్నారు. మొత్తంగా కలల కప్‌ను సొంతం చేసుకోవాలంటే ఆయా జట్లు 8 మ్యాచ్‌లు నెగ్గాల్సి ఉంటుంది.

### ఐరోపాలోనే ఎక్కువగా..

ఇప్పటివరకు జరిగిన 22 ప్రపంచ కప్‌ల్లో.. 11సార్లు ఐరోపా దేశాలు ఆతిథ్యం ఇచ్చాయి. ఆసియాలో తొలిసారి 2002లో జపాన్, కొరియాలు సంయుక్తంగా నిర్వహించాయి. 2010లో ఆఫ్రికా ఖండానికి మొదటిసారి వరల్డ్‌కప్ నిర్వహణ హక్కులు దక్కాయి. 2022 వరల్డ్‌కప‌నకు పశ్చిమాసియా దేశమైన ఖతార్ వేదికైంది.

### మెక్సికో అరుదైన రికార్డు..

మూడోసారి వరల్డ్‌కప్‌నకు ఆతిథ్యం ఇస్తున్న దేశంగా మెక్సికో అరుదైన రికార్డును సొంతం చేసుకో నుంది. 1970, 1986లో రెండుసార్లు మెక్సికో సాకర్ కప్‌ను నిర్వహించింది. ఇప్పుడు అమెరికా, కెనడాతో కలసి మూడోసారి టోర్నీ జరపనుంది. అంతే కాకుండా మూడు దేశాలు సంయుక్తంగా వరల్డ్ కప్‌ను నిర్వహించ డం కూడా టోర్నీ చరిత్రలో ఇదే తొలిసారి. బ్రెజిల్‌తో పాటు ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీలు రెండేసిసార్లు వరల్డ్‌కపనకు ఆతిథ్యం ఇచ్చాయి.

### బ్రెజిల్ ఐదుసార్లు..

సాకర్ వరల్డ్‌కపను బ్రెజిల్ అత్యధికంగా ఐదుసార్లు సొంతం చేసుకోగా.. జర్మనీ, ఇటలీలు నాలుగేసి సార్లు దక్కించుకున్నాయి. అర్జెంటీనా మూడుసార్లు.. ఫ్రాన్స్, ఉరుగ్వే రెండేసి సార్లు సొంతం చేసుకొన్నాయి. ఇంగ్లండ్, స్పెయిన్ చెరోసారి మెగా కప్‌ను ముద్దాడాయి.

### వరల్డ్‌కప్ చరిత్ర

సాకర్‌ను తొలిసారి 1900 ఒలింపిక్స్‌లో ప్రవేశపెట్టగా.. 1904లో ఫిఫా ఏర్పడింది. 'వరల్డ్‌కప్ పితామహుడు'గా చెప్పుకొనే ఫిఫా మాజీ అధ్యక్షుడు జూలెస్ రిమెట్.. 1920 విశ్వక్రీడల్లో సాకర్ కప్ ప్రతిపాదన చేశాడు. 1930లో తొలి ఫిఫా వరల్డ్ క్‌పను 13 జట్లతో ఉరుగ్వేలో నిర్వహించారు. ఆతిథ్య దేశమైన ఉరుగ్వే 4-2తో అర్జెంటీనాను ఓడించి ఆరంభ టైటిల్‌ను సొంతం చేసు కుంది. ఆ తర్వాతి 1934లో ఇటలీ, 1938లో ఫ్రాన్స్ నిర్వహిం చాయి. 1942 మెగా కప్‌ను హిట్లర్ ఆధ్వర్యంలో జర్మనీలో జరపా లనుకున్నా.. ప్రపంచ యుద్ధం కారణంగా రద్దు చేశారు. 1946లో కూడా వరల్డ్‌వార్ కారణంగా ఆగింది. ఇక, 1950 నుంచి ప్రతి నాలుగేళ్ల కొకసారి నిర్వహిస్తూనే వస్తున్నారు. భవిష్యత్‌లో 2030 వరల్డ్‌కపను మొరాకో, స్పెయిన్, పోర్చుగల్ సంయుక్తంగా జరప నుండగా.. 2034 మెగా టోర్నీ హక్కులను సౌదీ అరేబియా దక్కించుకొంది.

## సెరెనా వింబుల్డన్‌లో ఆడనుందా?



అమెరికా: టెన్నిస్ ప్రపంచాన్ని దాదాపు రెండు దశాబ్దాల పాటు ఏలిన దిగ్గజ ప్లేయర్ సెరెనా విలియమ్స్ అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పింది. దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత మళ్లీ కోర్టులో అడుగుపెట్టనున్నట్లు ప్రకటించింది. దీంతో ప్రతిష్ఠాత్మక గ్రాండ్ స్లామ్ టోర్నీ వింబుల్డన్ 2026లో సెరెనా బరిలోకి దిగుతుందా? అనే చర్చ జోరందుకుంది. 2022లో జరిగిన యూఎస్ ఓపెన్ తర్వాత సెరెనా ప్రొఫెషనల్ సింగిల్స్ మ్యాచ్ ఆడలేదు. అయితే అప్పట్లో ఆమె అధికారికంగా రిటైర్‌మెంట్ ప్రకటించలేదు. పోటీ టెన్నిస్‌కు దూరమవుతున్నానని మాత్రమే చెప్పింది. ప్రస్తుతం 44 ఏళ్ల వయసులో ఇద్దరు పిల్లలకు తల్లి అయిన తర్వాత సెరెనా మళ్లీ రాకెట్ పట్టేందుకు సిద్ధమైంది.

లండన్‌లో జరిగే క్వీన్స్ క్లబ్ ఛాంపియన్‌షిప్ టోర్నీలో డబుల్స్ విభాగంలో పాల్గొని.. సెరెనా తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించనుంది. జూన్ 8 నుంచి 21 వరకు జరిగే ఈ గ్రాస్ కోర్ట్ టోర్నీని వింబుల్డన్‌కు ముందు జరిగే సన్నాహక పోటీగా భావిస్తారు. 'నా కెరీర్‌లో టెన్నిస్ కోర్టులు అత్యంత ప్రత్యేకమైన జ్ఞాపకాలను ఇచ్చాయి. ఈ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించ డానికి క్వీన్స్ క్లబ్ సరైన వేదికగా అనిపించింది. మళ్లీ పోటీల్లో పాల్గొనబోతున్నందుకు ఎంతో ఉత్సాహంగా ఉన్నాను' అని సెరెనా తెలిపింది.

ప్రతిష్ఠాత్మక గ్రాండ్ స్లామ్ టోర్నీ వింబుల్డన్ ఛాంపియన్‌షిప్స్ పోటీలు జూన్ 29 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో సెరెనాకు వైల్డ్‌కార్డ్ అవకాశం లభించే అవకాశం ఉంది. ఆమె ఆసక్తిని బట్టి సింగిల్స్ లేదా డబుల్స్ విభాగంలో చోటు కల్పించే అవకాశాలు ఉన్నాయని టెన్నిస్ వర్గాలు భావిస్తున్నాయి. అలాగే ఈ ఏడాది చివర్లో జరిగే యూఎస్ ఓపెన్‌లో కూడా సెరెనా ఆడనున్నట్లు సమాచారం.

ఇదిలా ఉండగా.. ప్రపంచ నంబర్-1, నాలుగు గ్రాండ్ స్లామ్ టైటిళ్ల విజేత సబలెంకా.. సెరెనా పునరాగమనంపై స్పందించింది. 'సెరెనా ఒక లెజెండ్. ఆమె తిరిగి రావడం ఎంతో స్ఫూర్తిదాయకం. ఆమెను మళ్లీ కోర్టులో చూడాలని, అవకాశం వస్తే సెరెనాతో పోటీ పడాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను' అని సబలెంకా తెలిపింది. 23 గ్రాండ్ స్లామ్ సింగిల్స్ టైటిళ్లతో అత్యంత విజయవంతమైన మహిళా టెన్నిస్ ప్లేయర్‌గా నిలిచిన సెరెనా విలియమ్స్ పునరాగమనం ఇప్పుడు టెన్నిస్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది. అభిమానులు మాత్రం ఆమెను వింబుల్డన్ కోర్టులో మళ్లీ చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## వెస్టిండీస్‌కు షాకిచ్చిన ఐర్లాండ్

### టీ20లో ఒక్క పరుగుతో విజయం



డబ్లిన్: వెస్టిండీస్ మహిళల జట్టుకు ఐర్లాండ్ ఊహించని షాకిచ్చింది. ట్రై సిరీస్‌లో భాగంగా డబ్లిన్ వేదికగా జరిగిన విండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో డక్ వర్త్ లూయిస్ పద్ధతిలో ఒక్క పరుగు తేడాతో ఐర్లాండ్ విజయం సాధించిం ది. మహిళల టీ20ల్లో వెస్టిం డీస్‌పై ఐర్లాండ్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. ఈ విజయంతో ఐర్లాండ్ ఫైనల్‌కు చేరుకునే అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఐర్లాండ్ కెప్టెన్ ఓర్లా ప్రెండర్‌గాస్ట్ బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలోనూ అదరగొట్టి తన జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. కెప్టెన్ హేలీ మాథ్యూస్(1), టేలర్(9), డాటిన్(16) వంటి సీనియర్ ప్లేయర్లు విఫలమయ్యారు. 43 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న విండీస్ జట్టును షెమైన క్యాంప్‌బెల్ ఆదుకుంది. ఆఖరిలో గ్లాస్గో(36) కాస్త దూకుడుగా ఆడడంతో విండీస్‌కు కాస్త గౌరవప్రదమైన స్కోర్ దక్కింది. అనంతరం 142 పరుగుల టార్గెట్‌తో ఐర్లాండ్ ఇన్నింగ్స్ ప్రారంభించింది. ఐర్లాండ్ స్కోర్ 14.1 ఓవర్లలో 95/5 వద్ద ఉండగా ఆటకు వర్షం అంతరాయం కలిగించింది. అయితే ఆ సమయానికి డక్ వర్త్ లూయిస్ ప్రకారం ఐర్లాండ్ 3 పరుగులు వెనుకబడి ఉంది. అంపైర్లు మ్యాచ్‌ను ఆపేసే ముందు కనీసం ఒక్క బంతి అయినా వేయాలని ఐర్లాండ్ బ్యాటర్లు పట్టుబట్టారు. జాజారా క్లాక్స్టన్ వేసిన బంతి లూయిస్ లిటిల్ ఫోర్ కొట్టాడు. వర్షం తీవ్రత పెరగడంతో మ్యాచ్‌ను నిలిపివేశారు. అప్పటికి డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం ఐర్లాండ్ ఒక పరుగు ఆధిక్యంలో ఉండటంతో ఐర్లాండ్ జట్టును విజేతగా ప్రకటించారు. ఓర్లా ప్రెండర్‌గాస్ట్(46 బంతుల్లో 71 పరుగులు) అజేయంగా నిలిచిం ది. ఈ ట్రై సిరీస్ లో పాకిస్థాన్, ఐర్లాండ్, వెస్టిండీస్ మహిళల జట్టు పాల్గొన్నాయి. ఇప్పటికీ రెండు మ్యాచులు ఓడి.. పాయింట్ల పట్టికలో పాకిస్థాన్ చివరి స్థానంలో ఉంది. ఐర్లాండ్, విండీస్ జట్లకు సమానంగా నాలుగు పాయింట్లు ఉన్నప్పటికీ నెట్ రన్ రేట్ ప్రకారం వెస్టిండీస్ టాప్ ప్లేసులో ఉంది. ముక్కోణపు సిరీస్‌లో భాగంగా ఈ మూడు జట్టులో మిగిలిన జట్లతో రెండేసి మ్యాచులు ఆడాల్సి ఉంటుంది.

## ఆర్‌సీబీ ప్లేయర్ల అరుదైన ఘనత

బెంగళూరు: ఐపీఎల్ 2026 విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలిచిన సంగతి తెలిసిందే. వరుసగా రెండోసారి ట్రోఫీని కైవసం చేసుకోవడంతో ఆ జట్టు సభ్యులతో పాటు అభిమానులు ఆనందంలో మునిగితేలుతున్నారు. ఆర్సీబీ జట్టు విజయం సాధించడంతో పాటు ఐపీఎల్ చరిత్రలో అత్యంత అరుదైన ఘనతను ఆ జట్టులోని ఇద్దరు సభ్యులు సాధించారు. అది కూడా ఐపీఎల్ చరిత్రలో ఒకే ఒక్కరికి దక్కిన రికార్డును ఈ ప్లేయర్లు సాధించారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ 2026 ఛాంపియన్‌గా నిలవడంతో ఆ జట్టులోని ఆటగాళ్లు ఫిల్ సాల్ట్, సుయాశ్ శర్మ హ్యాట్రిక్ ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన అరుదైన ఫీట్‌ను నమోదు చేశారు. టైటిళ్లు గెలిచిన సీజన్‌లలో ఆయా జట్లలో కనీసం ఒక మ్యాచ్ అయినా ఆడిన ఆటగాళ్లుగా వీరు ఉన్నారు. గతంలో కర్ణ్ శర్మ ఒక్కడే ఈ ఘనతను సాధించగా.. తాజాగా సాల్ట్, సుయాశ్ ఈ జాబితాలో చేరారు. కర్ణ్ శర్మ 2016 లో సన్ రైజర్స్ హైదరాబాద్‌తో, 2017లో ముంబై ఇండియన్స్‌తో, 2018లో చెన్నై సూపర్ కింగ్స్ జట్లలో సభ్యుడిగా ఉండి ఐపీఎల్ టైటిళ్లు సాధించాడు. అలానే సాల్ట్, సుయాశ్ ఇద్దరూ 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో, 2025, 2026లో ఆర్సీబీతో ఐపీఎల్ టైటిళ్లు సాధించి ఈ చారిత్రక రికార్డును సొంతం చేసుకున్నారు. ఐపీఎల్ 2026 వేలంలో 11.50 కోట్లకు సాల్ట్‌ను ఆర్సీబీ కొనుగోలు చేసింది. ఈ సీజన్‌లో ఆరు



మ్యాచులు ఆడిన సాల్ట్ 168.33 స్ట్రైక్ రేట్‌తో 202 పరుగులు చేశాడు. ఇప్పటి వరకు ఐపీఎల్ లో 40 మ్యాచులు ఆడిన సాల్ట్ 12 హాఫ్ సెంచరీలతో సహా 1258 పరుగులు సాధించాడు. ఇక సుయాశ్ విషయానికి వస్తే.. అతడిని ఐపీఎల్ 2026 వేలంలో ఆర్సీబీ రూ.2.60 కోట్లకు దక్కించుకుంది. ఈ యువ లెగ్ స్పిన్నర్ ఐపీఎల్-19లో 12 మ్యాచులు ఆడి 9.21 ఎకానమీ రేటుతో 9 వికెట్లు సాధించాడు. మొత్తంగా 39 ఐపీఎల్ మ్యాచుల్లో 44.07 సగటుతో 27 వికెట్లు పడగొట్టాడు.

చైతన్య రథం
సినిమా
బుధవారం 3 జూన్ 2026 X

## బాలీవుడ్‌కు, టాలీవుడ్‌కు తేడా అదే!

### జాన్వీకపూర్



రామ్‌చరణ్‌తో కలిసి 'పెద్ది'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. నటి జాన్వీకపూర్, బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ప్రచారంలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జాన్వీ.. బాలీవుడ్ టాలీవుడ్లలో షూటింగ్ గురించి మాట్లాడారు. టాలీవుడ్లో క్రియేటివిటీకి పని గంటలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారని ఆమె ప్రశంసించారు.

"సౌత్ సినిమా సెట్స్‌లో అందరిలో ఒక రకమైన ఆసక్తి ఉంటుంది. అక్కడ కేవలం ఓ ప్రాజెక్ట్ పూర్తి చేయాలనో, డెడ్లైన్లను అందుకోవాలనో మాత్రమే పనిచేయరు. సినిమాలోని ప్రతి సీన్ అద్భుతంగా రావాలనే ప్రయత్నిస్తుంటారు. దానికోసం ఎంత సమయమైనా కేటాయిస్తారు. హిందీ సినిమా విషయానికి వస్తే అక్కడ ఎక్స్‌ఎల్ షీట్లకు (బడ్జెట్, టైమ్స్) ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. అంతా రూల్ ప్రకారం పక్కా ప్రణాళికతో జరుగుతుంది. కొన్నిసార్లు ఈ అతి జాగ్రత్త వల్ల క్రియేటివిటీ విషయంలో రాజీపడాల్సి వస్తుంది. అయితే అలా పక్కాగా ఉండటం వల్ల కొన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయి" అన్నారు జాన్వీ.

వర్కింగ్ అవర్స్ గురించి కూడా ఆమె ఇటీవల మాట్లాడిన విషయం తెలిసిందే. "తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రతిఒక్కరి పని గంటలను గౌరవించే విధానం నాకు బాగా నచ్చింది. కేవలం నటీనటులకే కాదు, టెక్నీషియన్లు అందరికీ సరైన బ్రేక్స్ ఇస్తారు. లంచ్ బ్రేక్ అంటే అందరూ 40 నిమిషాలు తిని, మరో 20 నిమిషాలు నిద్రపోయి మళ్లీ ఫ్రెష్గా పనిలోకి వస్తారు. కానీ బాలీవుడ్లో ఒక్కోసారి ఈ విషయంలో కూడా రాజీపడాల్సి వస్తుంది" అని చెప్పారు. ఇక ఈ వ్యాఖ్యలపై రామ్‌చరణ్ స్పందిస్తూ.. బాలీవుడ్లో సినిమాలు చాలా వేగంగా పూర్తి చేస్తారని, ఆ విషయంలో హిందీ పరిశ్రమను మెచ్చుకోవాలన్నారు. 'పెద్ది' 265 రోజులు షూట్ చేసినట్టు ఆయన చెప్పారు.

## 'మేడ్ ఇన్ కొరియా' సక్సెస్ ఎఫెక్ట్

### కొరియా టూరిజం అంబాసిడర్‌గా ప్రియాంకా మోహన్



దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనదైన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి ప్రియాంకా మోహన్ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కించుకుంది. నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన ఆమె తాజా చిత్రం 'మేడ్ ఇన్ కొరియా' గ్లోబల్ వైడ్‌గా భారీ విజయాన్ని అందుకోవడంతో ఆమె క్రేజ్ ఒక్కసారిగా అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది. ఈ సూపర్ హిట్ చిత్రం సాధించిన అద్భుతమైన సక్సెస్ తర్వాత... కొరియా టూరిజం ఆర్గనైజేషన్ (ఖూ) ప్రియాంకా మోహన్‌ను 'కొరియా టూరిజం గౌరవ అంబాసిడర్'గా అధికారికంగా నియమించింది. కొరియా సంస్కృతిని, అక్కడి పర్యాటకరంగ విశేషాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు, ముఖ్యంగా భారతీయులకు మరింత దగ్గర చేసేందుకు కొరియా ప్రభుత్వం ఆమెను ఈ గౌరవ పదవికి ఎంపిక చేసింది. రోజురోజుకూ పెరుగుతున్న తన అంతర్జాతీయ ఫ్యాన్ బేస్‌తో ప్రియాంక ఒక గ్లోబల్ స్టార్‌గా అవతరిస్తూ ప్రపంచ వేదికపై సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఈ అరుదైన గౌరవం దక్కడంపై ప్రియాంకా మోహన్ హర్షం వ్యక్తం చేస్తూ... తనకు ఈ అవకాశం కల్పించిన కొరియా ప్రభుత్వానికి, కొరియా టూరిజం ఆర్గనైజేషన్‌కు సోషల్ మీడియా ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.

## విజయ్ బాటలో మరో స్టార్ హీరో

### రాజకీయ రంగప్రవేశంపై తండ్రి కామెంట్స్



తమిళనాడులో సినిమా రంగానికి, రాజకీయాలకు దశాబ్దాల కాలంగా విడదీయరాని బంధం ఉంది. ఎంజీఆర్, జయలలిత నుంచి నిన్నటి విజయ్ వరకు ఎంతోమంది సినీ తారలు రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రులుగా, ప్రజా నాయకులుగా సేవ చేశారు. ఈ నేపథ్యంలో కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కూడా భవిష్యత్తులో రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందా అనే చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. దీనిపై ఆయన తండ్రి, ప్రముఖ దర్శకుడు కస్తూరి రాజా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

చెన్నైలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న కస్తూరి రాజాను ధనుష్ రాజకీయ ఎంట్రీపై ప్రశ్నించగా... ఆయన ఆ అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేమన్నారు.. "రాజకీయాల్లోకి రావాలనుకుంటే ఎవరికైనా ఆ హక్కు ఉంటుంది. భవిష్యత్తులో నా కుమారులు మాత్రమే కాదు, నా మనవళ్ళు కూడా ఆ మార్గాన్ని ఎంచుకోవచ్చు" అన్నారు. దీంతో ఆయన సమాధానం ధనుష్ అభిమానుల్లో, రాజకీయ వర్గాల్లో సరికొత్త ఊహాగానాలకు తావిచ్చింది.

ఇదే వేదికపై తన కుటుంబ సినీ ప్రయాణాన్ని, పడిన కష్టాలను కస్తూరి రాజా గుర్తు చేసుకున్నారు. ధనుష్ అసలు పేరు వెంకటేష్ ప్రభు అని, సినిమాల్లోకి వచ్చిన తర్వాతే ఆ పేరు మార్చుకున్నాడని తెలిపారు. "విమానాశ్రయాల్లో లేదా ఇతర బహిరంగ ప్రదేశాల్లో మా అబ్బాయిని అందరూ 'ధనుష్ కె.రాజా' అని పిలుస్తుంటే నాకు ఎంతో గర్వంగా, ఆనందంగా అనిపిస్తుంది" అని చెప్పారు. ప్రస్తుతం రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ధనుష్ తన 50వ సినిమాలో నటిస్తున్నారు.

## హీరోయిన్లలో ఆమే టాప్?

### రష్మిక హయ్యెస్ట్ రెమ్యూనరేషన్ ఇదే



బాలీవుడ్‌లో ప్రస్తుతం అత్యంత డిమాండ్ ఉన్న హీరోయిన్లలో రష్మిక మందన్న పేరు ముందు వరుసలో వినిపిస్తోంది. సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా ఇప్పటికే తన స్థానాన్ని బలపరుచుకున్న ఆమె ఇప్పుడు హిందీ చిత్ర పరిశ్రమలోనూ వరుస అవకాశాలు అందుకుంటూ తన మార్కెట్‌ను విస్తరించుకుంటోంది. కొంతకాలంగా ఆమె నటించిన సినిమాలు విశేష ప్రేక్షకాదరణ పొందడంతో నిర్మాతలు, దర్శకుల దృష్టి ఆమెపై మరింతగా పడింది. ముఖ్యంగా కమర్షియల్ సినిమాలతో పాటు కంటెంట్ ఓరియెంటెడ్ కథల్లోనూ తనదైన నటనతో ఆకట్టుకుంటూ రష్మిక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది.

ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో కాక్‌టెయిల్-2 ఒకటి. ప్రముఖ డైరెక్టర్ హోమి అదజానియా తెరకెక్కిస్తున్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో షాహిద్‌కపూర్, కృతి సనన్‌లతో కలిసి రష్మిక కీలక పాత్ర పోషిస్తోంది. మ్యాడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ సినిమా ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి ఆసక్తిని రేకెత్తిస్తోంది. గ్లామర్, భావోద్వేగాలు, వినోదం మేళవించిన కథతో రూపొందుతున్న ఈ సినిమా విడుదలకు ముందే ప్రేక్షకుల్లో అంచనాలను పెంచింది. జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై ట్రేడ్ వర్గాలు కూడా ఆశావహంగా ఉన్నాయి.

ఇదిలా ఉంటే... ఈ సినిమా కోసం రష్మిక అందుకున్న పారితోషికం ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సమాచారం ప్రకారం కాక్‌టెయిల్-2 కోసం ఆమె రూ.12 కోట్ల రెమ్యూనరేషన్ అందుకున్నట్లు తెలుస్తోంది. ఇది ఆమె కెరీర్‌లో ఇప్పటివరకు అత్యధిక పారితోషికంగా చెప్పబడుతోంది. వరుస సక్సెస్‌లతో మార్కెట్ విలువ పెరగడంతో భవిష్యత్తులో హిందీ సినిమాల కోసం ఆమె రెమ్యూనరేషన్‌ను మరింత పెంచే అవకాశాలు ఉన్నాయని బాలీవుడ్ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

## ఇకపై నా ప్రతి సినిమాకూ ఆయనే మ్యూజిక్

### 'పెద్ది' డైరెక్టర్ బుచ్చిబాబు కీలక ప్రకటన

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, దర్శకుడు బుచ్చిబాబు కాంబినేషన్‌లో తెరకెక్కిన ప్రతిష్ఠాత్మక చిత్రం 'పెద్ది'. రా అండ్ రస్టిక్ కంటెంట్‌తో స్పోర్ట్స్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రానికి ఆస్కార్ అవార్డు గ్రహీత, సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్ అద్భుతమైన స్వరాలను అందించారు. తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో బుచ్చిబాబు.. రెహమాన్‌తో తనకున్న అనుబంధాన్ని పంచుకుంటూ ఒక సంచలన ప్రకటన చేశారు.

ఈ సినిమా కోసం ఏఆర్ రెహమాన్‌తో కలిసి పనిచేయడం తన జీవితంలోనే మర్చిపోలేని అనుభూతి అని బుచ్చిబాబు ఎంతో ఎమోషనల్ అయ్యారు. ఆయనతో సాగిన జర్నీ ఒక అద్భుతమని, ఆయన అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని కొనియాడారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పాటలు సోషల్ మీడియాలో విపరీతమైన రెస్పాన్స్‌తో దూసుకుపోతున్నాయి.

ఇదే ఇంటర్వ్యూలో బుచ్చిబాబు ఒక క్రేజీ నిర్ణయాన్ని వెల్లడిస్తూ.. రెహమాన్ వర్కింగ్ స్టైల్‌కు తాను పూర్తిగా ఫిదా అయ్యానని చెప్పారు. అందుకే ఇకపై తాను తీయబోయే అన్ని సినిమాలకూ ఆయనే మ్యూజిక్ డైరెక్టర్‌గా ఉంటారని స్పష్టం చేశారు. ఒక దర్శకుడు సంగీత దర్శకుడిపై ఈ స్థాయి నమ్మకాన్ని ఉంచడం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కాంబినేషన్ జూన్ 4న థియేటర్లలో ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో చూడాలి. కాగా బుచ్చిబాబు కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

